# రాయలసీమను
# సస్యశ్యామలం ఇలా చేద్దాం

## (ప్రతిపాదనలు)

ఎం.సుబ్బరాయుడు, D.E.,
విశ్రాంత ఇంజనీరు

**RAYALASEEMA NU ILA**

**SASYASAMALAM CHEDDAM !**

**By M.SUBBARAYUDU, D.E.,**
**Rtd., Engeneer**

Copy Rights : **Rayalaseema Vidya Vantula Vedhika**

First Edition : MAY 2019
Copies : 1000
Price : **50/-**

Cover Design :

Type Setting : **VanamSarma**

Printed at : **Penneru Printing Works**
**Proddatur, YsrDist., 9393939095**

**For copies : Arun,**
**H.No. 87/106, SriLakshmi Nagar,**
**B-Camp, Kurnool-518002**
**Andhra pradesh.**
**Mobile: 94402 94462**
**email: nsssarma@gmail.com**

**All Prajasakti & Visalandhra Book House Branches**

ముఖచిత్రం : సంగమేశ్వరం వద్ద ప్రవహిస్తున్న భవనాశిని నది.

# అంకితం....



డా॥ మాధవస్వామి



ఏడిండ్ల డేవిడ్

దళిత బహుజనుల సంక్షేమం కోసం ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం కోసం
నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం అహర్నిశలు తపించిన
రాయలసీమ విద్యావంతుల వేదిక వ్యవస్థాపక కో-కన్వీనర్
అమరుడు **డా. మాధవస్వామికి**

మరియు

విద్యార్థి, ఉద్యోగ జీవితకాలం నుండి ప్రగతిశీలవాది,
విప్లవోద్యమ సానుభూతిపరుడు,
రాయలసీమ విద్యావంతుల వేదిక
కర్నూలు జిల్లా కో-కన్వీనర్
అమరుడు **ఏడిండ్ల డేవిడ్‌కి** ...

## అనువాదకుల మాట

2010 డిసెంబర్‌లో రాయలసీమ విద్యావంతుల వేదిక ఏర్పాటైంది. ఆనాడు సంస్థలోని వారెవ్వరికీ సాగునీటి విషయాలపై అవగాహన లేకపోవడం ప్రధాన లోపంగా కనిపించింది. రాయలసీమ సమస్యలు అంటేనే తాగు, సాగునీటి సమస్యలు. వాటిని గురించి ఆలోచించకుండా, ప్రస్తావించకుండా, పట్టించుకోకుండా, రాయలసీమ విషయంలో ఏమి మాట్లాడతాము. ఎవరిని సంప్రదించాలి? అని ఆలోచిస్తున్నప్పుడు మిత్రుడు భార్గవ అనుకుంటా విశ్రాంత ఇంజనీర్ ఎం.సుబ్బారాయుడుగారి పేరును మా దృష్టికి తెచ్చారు. అంతే సీమ నీటి సమస్యల విషయంలో అంతవరకు మమ్మల్ని అలుముకున్న గాడాంధకారం పటాపంచాలయ్యింది. సీమ సాగునీటి సమస్యలు, వాటి పరిష్కారాలు మాకు వేయి సూర్యుల వెలుగులో కన్పించాయి. అప్పటి నుండి ఆయన సీమ తాగునీటి, సాగు నీటి సమస్యల పరిష్కారానికై చేసిన ప్రతిపాదనలు, ప్రభుత్వానికి పంపిన విజ్ఞప్తులు, ఆయన వెంట మా ఫీల్డ్ సర్వేలు మాకే కాదు ఆయనతో పరిచయమైన వారందరికీ సాగునీటి రంగంలో చొరవ కల్పించాయి. ఆయన పరిజ్ఞానాన్ని అందరికీ, ముఖ్యంగా రాయలసీమ వాసులందరికీ అందుబాటులోకి తేవడంద్వారా, రాయలసీమకు సాగునీటిరంగంలో జరిగిన, జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా కొనసాగిస్తున్న పోరాటాలకు మరింత మద్దతు, బలం చేకూర్చాలనే లక్ష్యంతో ఈ పుస్తకం మీ ముందుకువచ్చింది. ఏమైనా తప్పులుంటే అవి అనువాదకులవేనని తెలియజేస్తూ...

మీ

**– అరుణ్, కన్వీనర్,రాయలసీమవిద్యావంతుల వేదిక,**

**– వనం దత్తప్రసాద్, ఎడిటర్, పెన్నేరు.**

# విషయ సూచిక


1. నీటి కొలతల గురించి తెలుసుకుందాం 06

2. వ్యాఖ్యానం - పాణ్యం సుబ్రమణ్యం 08

3. సీమ రైతులకు వరప్రధాయని ఆర్డీఎస్ కుడి వరదకాలువ 15

4. తుంగభద్ర, పెన్నా నదుల అనుసంధానం 32

5. గుండ్రేవుల వర్సెస్ ముచ్చుమర్రి 60

6. నీళ్ళున్నా కర్నూల్‌జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజలకు మిగిలింది కన్నీళ్ళే 71

7. ఇక ఈ రెండేళ్ళనూ వృధా చేయకండి 75

8. శ్రీశైలం కథేంటి 78

9. కర్నూలు జిల్లా పశ్చిమ మండలాల వరప్రదాయని 92

10. సిద్ధేశ్వరం అలుగు / బ్రిడ్జి 102

11. నీళ్ళలో న్యాయమైన వాటా చాలు సీమ సస్యశ్యామలం

ప్రశ్నలు - సమాధానాలు - 111

# నీటి కొలతల గురించి తెలుసుకుందాం

క్యూసెక్కు (cubic feet per second) :– ప్రవహించే నీటి కొలమానం క్యూసెక్కు. అంటే ఒక సెకను కాలంలో ఒక ఘనపుటడుగు నీరు ప్రవహిస్తే, దాన్ని ఒక క్యూసెక్కు (cubic feet per second) ప్రవాహం అంటారు. సుమారు 28.316847 లీటర్లకు సమానం.. ఉదా:– సుంకేసుల నుండి కేసి కాలువకు, హంద్రీ–నీవా ఎత్తిపోతల నుండి ప్రధాన కాలువకు, శ్రీశైలం రిజర్వాయర్ నుండి కిందికి విడుదల నీటిని కొలిచేది క్యూసెక్కుల తోనే.

TMC (శతకోటి ఘనపుటడుగులు) :– ఒక ప్రదేశంలో నిల్వవున్న నీరును కొలవడానికి TMCని ప్రామాణికంగా తీసుకుంటారు.

ఒక TMCనీరు 2831,68, 46,592 లీటర్లు. అంటే రెండు వేల ఎనిమిది వందల ముప్ఫై ఒక్క కోటి, అరవై ఎనిమిది లక్షల నలభై ఆరు వేలా ఐదు వందల తొంభై రెండు లీటర్లు.

ఉదా:– శ్రీశైలంరిజర్వాయర్ నిల్వ సామర్థ్యం 215.81 TMCలు,
నాగార్జునసాగర్ రిజర్వాయర్ నిల్వ సామర్థ్యం 312.05 TMC లు,
వెలుగోడు రిజర్వాయర్ నిల్వ సామర్థ్యం 16.95 TMCలు,
గోరుకల్లు నిల్వ సామర్థ్యం 13.5 TMC లు
సుంకేసుల నిల్వ సామర్థ్యం 1.2 TMC లు

ఒక TMC నీరు నిల్వకావాలంటే , సెకనుకు 11,576 క్యూసెక్కుల చొప్పున ఒకరోజు (24గంటలు) (100,01,18,94,400 క్యూసెక్కుల నీరు) చేరాలి.

ఒక TMC నీరు 10వేల ఎకరాల వరికి, 15 వేల ఎకరాల ఆరుతడి పంటలకు సరిపోతాయని అంచనా. పోతే ఈ మధ్య కాలంలో వరి పంటకాలం దాదాపు రెండు నెలలు తగ్గింది కాబట్టి ఒక TMC నీటితో దాదాపు 12 వేల ఎకరాలు సాగు చేయవచ్చని చెబుతున్నారు.

(2016 జూలై 27 న, రాష్ట్రప్రభుత్వం గుంటూర్ మరియు ప్రకాశం జిల్లాల ప్రజల తాగునీటి అవసరంకై 7 TMCల నీటి KRMB (Krishna River Management బోర్డు) అనుమతిని పొంది శ్రీశైలంరిజర్వాయర్ నుండి రిజర్వాయర్ అడుగు తాకేదాక, 7 TMCల నీటిని కిందికి తీసుకు వెళ్ళింది. తాగునీటి అవసరాలకు నీటిని విడుదల చేయడానికి ఎవ్వరూ అభ్యంతరం పెట్టాల్సిన అవసరం లేదు. పోతే యిక్కడే

సీమవాసులకు రెండు అనుమానాలొచ్చాయి. ప్రకాశం, గుంటూర్ జిల్లాల ప్రజల అవసరం తాగునీటిని గుర్తించిన ప్రభుత్వం రాయలసీమ జిల్లాల ప్రజల అవసరం తాగునీటి అవసరం ఎందుకు గుర్తించలేదు?

మరొకటి కిందికి వదిలిన నీరు కేవలం వేసవి కాలం తాగునీటి అవసరం కోసమేనా?

ఒక TMC నీరు =28,316,846,592లీటర్లు (ఇరవై ఎనిమిది బిల్లియన్ల, మూడు వందల పదహారు మిలియన్లు, ఎనిమిదివందల నలభైయారు వేల, ఐదు వందల తొంభై రెండు) లీటర్లు అని తెలుసుకొన్నాం.

7 TMCల నీరు = 198,217,926,144 లీటర్లు. (నూటా తొంభై ఎనిమిది బిల్లియన్ల, రెండు వందల పదిహేను మిలియన్ల, తొమ్మిది వందల ఇరవై ఆరు వేలా నూటా నలభైనాలుగు).

మన దేశంలో ప్రతిఒక్కరికి అత్యధికంగా నీరందిస్తున్న నగరాలలో, రెండవ స్థానంలో నీటిని సరఫరా చేస్తున్నది హైదరాబాదు నగరం. ఆ నగరంలో ఒక వ్యక్తి రోజువారి అవసరాలకై సగటున వినియోగిస్తున్న నీరు 96 లీటర్లు.

(ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రకారం ఒక మనిషి అన్ని అవసరాలకు అవసరమైన నీరు రోజుకు 140 లీటర్లనేది మరో విషయం.)

ప్రకాశంగుంటూర్, జిల్లాల జనాభ 82,81,994.

మనిషికి రోజుకు 96లీటర్లు చొప్పున 82,81,994 కు కావాల్సిన నీరు 96×82,81,994=795,071,424 లీటర్లు/రోజుకు

మరి అలాంటప్పుడు 7TMCల నీరు=198,217,926,144 లీటర్లు ఎన్ని రోజులకు?

198,217,926,144 లీటర్లు/ 795,071,424 లీటర్లు=249.30 రోజులు లేక 8.3 నెలలు. అంటే సీమ ప్రజలను ఎండగడుతూ, ప్రకాశం, గుంటూర్, జిల్లాల ప్రజల తాగు నీటి అవసరాల పేరుతో సాగు నీటికి, రొయ్యల, చేప చేరువులకై నీటిని కిందికి ప్రభుత్వం తరలించింది. ప్రతిపక్షంతో సహా అన్ని రాజకీయ పార్టీలు మౌనంగా వుండిపోయాయి. ప్రజలు కూడా మౌనంగా ఉంటే ప్రతి సంవత్సరం అదే పరిస్థితిని ఎదుర్కొంటారు.)

**- అరుణ్**

వ్యాఖ్యానం..

## రాయలసీమ చట్టబద్ధంగా పొందవలసిన కనీస నీటి అవసరాలు.

సాధారణ వర్షపాతం కన్నా 25% తక్కువగా వుంటే ఆ ప్రాంతానికి కొంచెం నష్టం కలిగిస్తుందని, అయితే అదే 40%లోటు వుంటే ఆ నష్టం తీవ్రంగా ఉంటుందని, 1901లోనే ఇండియన్ సాగునీటి కమీషన్ ( INDIAN Irrigation Commission) తెల్పింది. అంతేగాక 20% లోటు వున్న సంవత్సరంను కరువు సంవత్సరంగా పేర్కొంటే, 40% లోటును తీవ్ర కరువుగా పేర్కొనింది.

పై కమీషన్ ఏ ప్రాంతంలోనైనా సాధారణ వర్షపాతం కన్నా 75% తక్కువ వర్షపాతం వుంటే దాన్ని క్షామంగా నిర్వచించింది. అంతేగాక సాధారణ వర్షపాతం కన్నా లోటు 25%-50% మధ్యన వుంటే అది మధ్యస్థ (moderate) కరువని, అదే లోటు 50% దాటితే అది తీవ్రమైన కరువుగా నిర్వచించింది. తాము అధ్యయనం చేసిన సంవత్సరాలలో 20% సంవత్సరాలలో కరువు సంభవించి వుంటే ఆప్రాంతాన్ని కరువు ప్రాంతంగా, 40% సంవత్సరాలలో కరువు సంభవించివుంటే ఆప్రాంతాన్ని నిరంతరం కరువు సంభవించే ప్రాంతంగా కమీషన్ అభిప్రాయపడింది.

ఇక రాయలసీమలో అందుబాటులో వున్న సమాచారాన్నిబట్టి ఇక్కడి కరువుకు కారణాలు రెండు. 1) వర్షపాత లోటు, 2) వర్షపు నీటి పంపకం.

రాయలసీమలో కరువు అనేది 4-7 ఏళ్ళ కాలంలో కనీసం ఒక ఏడాదయినా వస్తుంది. ఇండియన్ సాగునీటి కమీషన్ నిర్దేశించిన ప్రాతిపదికల ప్రకారం రాయలసీమ నాలుగు జిల్లాలలో దాదాపు 40% సం.లు వర్షపాతపు లోటు ఉండటంతో, రాయలసీమ నిరంతరం కరువు సంభవించే ప్రాంతంగా రూఢీకరించవచ్చు

వ్యవసాయ శాఖ ప్రకారం వర్షాధారిత పంటలకు 6 నుండి 8 సార్లు తడుల నీరందాలి. రాయలసీమలో 1000 మి.మీ. కన్నా తక్కువ వర్షపాతం వుంది. అంతేగాక ఆ వర్షమూ పడే వివిధ ప్రదేశాల మధ్య అంతరాలుండే రాయలసీమలో, వర్షం కురిసే కాలవ్యవధిలోని హెచ్చు తగ్గులుండే రాయలసీమలో, సరైన అదనులో ఒకటి, రెండు తడులు తక్కువయినా ఆ పంటలు పూర్తిగా దెబ్బతింటాయి. ఈ పరిస్థితి నుండి

తప్పించు కోవాలంటే సాగుకులాయికయిన భూమిలో కనీసం 33%-35% భూమికి సాగునీరు అందించాలి.

రాయలసీమ నాలుగు జిల్లాలో సాధారణ వర్షపాతం, కర్నూల్-670.5 మి.మీ., అనంతపురం- 552.0 మి.మీ., కడప-699.6 మి.మీ., చిత్తూర్ -918 మి.మీ. కాని, ఆ వర్షంపడే ప్రాంతం, కాల వ్యవధులలో (అంటే జిల్లాలో ఒకే ప్రాంతం లో ఎక్కువగా నమోదు కావడం, మరొక చోట వర్షమే లేకపోవడం. అంతేగాక పంటలకు అవసరమైన కాలంలోవాన పడక, అవసరం లేనప్పుడు వర్షించడం) చాలా తేడాల వల్ల వ్యవసాయానికి చాలా నష్టం జరుగుతున్నది. అందువల్ల పంటలదిగుబడికి అవసరమైన ఫలితాన్నిచ్చే ఉపయుక్తమైన వర్షపాతాన్ని లెక్కవేస్తే కర్నూల్-536. మి.మీ, అనంతపురం- 442 మి.మీ., కడప- 560 మి.మీ., చిత్తూర్ - 734 మి.మీ. మాత్రమేనని తేలుతుంది.

ఉపరితలంపై ప్రవహించే వాననీటిని అంచనా వేయాలంటే వాన సాంద్రత, వానకు-వానకు మధ్యగల కాలాన్ని పరిగణలోనికి తీసుకోవాలి. (అంటే కేవలం చినుకులు మాత్రమే పడితే భూమి తడవుతుందిగాని, భూమిపై నీరు పారదు. అదేవిధంగా పెద్దవర్షం పడినా, తిరిగి వర్షం చాలాకాలం తర్వాత పడితే భూమి అప్పటికే తడారి పోతుంది కాబట్టి ఆ నీరంత భూమే పీల్చుకుంటుంది. ఈ రెండు సందర్భాలలో వాగులూ, వంకలూ పారవు.)

**ఉపయుక్తమైన వర్షాధారిత నీటి గణాంకాలు..**

| 1. జిల్లా పేరు | కర్నూల్ | అనంతపురం | కడప | చిత్తూర్ | మొత్తం |
|---|---|---|---|---|---|
| 2. సాధారణ వర్షపాతం (మి.మీ) | 670.5 | 552 | 699 | 918 | 2840.1 |
| 3.ఉపయుక్త వర్షపాతం(మి.మీ) | 536. | 442 | 560 | 734 | 2272 |
| 4.ఉపయుక్త వర్షపాతం(అంగుళాలలో) | 21.10” | 17.40” | 22.05” | 28.90” | 28.886” |

| జిల్లా పేరు | కర్నూల్ | అనంతపురం | కడప | చిత్తూర్ | మొత్తం |
|---|---|---|---|---|---|
| 5.ఉపరితలం పై ప్రవహించే నీరు | 5.965 | 3.7 | 6.668 | 12.586 | 28.896 |
| | శతకోటి ఘన. అడుగులు/చదరపు మైలు | | | | |
| 6.భూ వైశాల్యం (ల.ఎలలో) | 43.63 | 47.28 | 37.95 | 37.44 | 166.30 |
| 7. భూ వైశాల్యం (చ.మైలు) | 6817 | 7388 | 5930 | 5850 | 25985 |
| 8. మొత్తంవర్షపు నీరు (టిఎంసీలలో) | 40.663 | 27.092 | 39.541 | 73.628 | 180.924 |

రాయలసీమ నాలుగు జిల్లాలలో ఆధారపడ్డ దగ్గ నీటి లభ్యత కేవలం 181 టిఎంసీలు మాత్రమేనని పై పట్టిక ద్వారా స్పష్టమవుతుంది. ఆ నీటి లభ్యత వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు బొటాబొటిన సరిపోతుంది. అయితే రాయలసీమలోని ఆరుతడి పంటలకు అవసరమైన నీరు దాదాపు 392 టిఎంసీలుగా గణాంకాలు చెబుతున్నాయి. అందువల్ల రాయలసీమకు కనీసం ఒక పంటకు నీరందించడానికి ఇప్పటికే పూర్తయిన మరియు ఇంకా పనులు కొనసాగుతున్న ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందించాలి. అందుకై తుంగభద్ర సబ్–బేసిన్‌లోని తుంగభద్ర డ్యాం మరియు శ్రీశైలం డ్యాంల మధ్య తగినన్ని రిజర్వాయర్లను నిర్మించాలి. రాయలసీమ ప్రాంతం పెన్నా పరివాహక ప్రాంతం (Penna Basin) మరియు తుంగభద్ర సబ్–బేసిన్‌ల క్రింద వస్తుంది. కేంద్ర జలవనరుల కమీషన్ (CWC) ప్రకారం పెన్నా బేసిన్‌కు ఇతర నదుల బేసిన్‌ల నుండి నీటిని మరలించాలి. అందువల్ల నదుల అనుసంధానం అవసరమని, తద్వారా కరువు పీడిత ప్రాంతాలకు హేతుబద్ధమైన నీటి పంపిణీ జరుగుతుందని  కమీషన్ అభిప్రాయపడింది.

రాయలసీమకు 1956 వరకు కేవలం 9.07 లక్షల ఎకరాలకే అంటే

సాగుకు లాయికయ్యే భూమిలో కేవలం 9.86%కు మాత్రమే సాగునీరు అందేది. ఆతర్వాత 2014 వరకు చూస్తే సీమలో నీరందే భూమి కేవలం 17.93 లక్షల ఎకరాలకే, అంటే సాగుకు లాయికయ్యే భూమిలో కేవలం 19.5%కు మాత్రమే సాగునీరు అందేది. యిక జలయజ్ఞం ప్రాజెక్టులు పూర్తయ్యాక కూడా సాగునీరందే భూములు 35.18 లక్షల ఎకరాలు. అంటే మొత్తం సాగుకు లాయికయ్యే భూమిలో కేవలం 38.25%కు మాత్రమే సాగునీరు అందే అవకాశం ఉంటుంది. అదే సమయంలో ఆంధ్రా ప్రాంతంలో దాదాపు 102.53 లక్షల ఎకరాలు. అంటే అక్కడి సాగుభూమిలో 80.90%కు సాగునీరు సరఫరా చేయబడబోతుంది. ఈ అసమానతకు కారణం బచావత్ కమీషన్ తన కృష్ణా జలాల పంపిణీకి ఎన్నుకున్న "నదీ పరివాహక క్రింది ప్రాంతాల హక్కులను సంరక్షించుట" అనే ప్రాతిపదిక... మరోమాటలో 1962 నాటి వరకు పూర్తయిన, పనులు కొనసాగుతున్న ప్రాజెక్టుల కింది సాగుభూములకు నీటి కేటాయింపులో ప్రథమ ప్రాధాన్యత నివ్వడం. మొదట అనుభవిస్తున్న వారికే, మొదటి హక్కు (First in Time, First in Right).

తెలుగు రాష్ట్రవిభజనకు ప్రధాన కారణం వివిధ ప్రాంతాలకు సాగునీటి సౌకర్యాలు కల్గించడంలో చూపిన వివక్షత మరియు కరువు పీడిత ప్రాంతాల కనీస తాగు మరియు సాగునీరు అవసరాలను నిర్లక్ష్యం చేయడం. 1935 నుండి నేటిదాకా రాయలసీమ కు చట్టబద్ధంగా రావాల్సిన కనీస నీటి సరఫరా లేక పోవడానికి కారణాలు ఈ కిందివిగా చెప్పవచ్చు.

## కృష్ణా-పెన్నార్ ప్రాజెక్టు.

ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో 1951లోనే ప్రణాళిక సంఘపు సమ్మతిని పొందిన క్రిష్ణా-పెన్నార్ ప్రాజక్టు కర్నూల్ జిల్లాలోని సిద్ధేశ్వరం వద్ద కృష్ణా నదిపై నిర్మించాలని, తద్వారా కృష్ణా జలాలను దాదాపు 400 టిఎంసీలను మళ్లించి రాయలసీమలోని నాలుగు జిల్లాలకేగాక నెల్లూర్, మద్రాస్‌కు తాగు, సాగు నీరు అందివ్వాలనే లక్ష్యంతో ప్రతిపాదింపబడ్డ సిద్ధేశ్వరం ప్రాజెక్టును ప్రాంతీయ వివక్షత వల్ల కోల్పోయాము. దాంతో బచావాత్ కమీషన్ ఎంచుకున్న ప్రాతిపదిక ప్రకారం సీమ కృష్ణా జల్లాలో తన వాటా కోల్పోయింది.

## 2. శ్రీబాగ్ ఒప్పందాన్ని అమలుచేయకపోవడం..

మద్రాస్‌లోని దేశోద్ధారక కాశినాథ నాగేశ్వరరావుగారి స్వగృహం (శ్రీబాగ్)లో రాయలసీమ మరియు కోస్తా ప్రాంతపు నాయకుల మధ్య 16-11-1937న ఒక ఒప్పందం జరిగింది. దాన్నే "శ్రీబాగ్ ఒప్పందం" అని పిలుస్తారు. మద్రాస్ నుండి ఆంధ్రప్రాంతం విడిపోయి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే, ఆ ఒడంబడిక ప్రకారం, కృష్ణ, పెన్నా, తుంగభద్ర జలాలలో రాయలసీమకు ప్రథమ ప్రాధాన్యత వుంటుందనే స్పష్టమైన హామీ వుంది. కానీ, ఆంధ్రరాష్ట్రమేర్పడ్డాక, పై హామీని తుంగలో తొక్కారు. అప్పటికే కృష్ణా-పెన్నార్ ప్రాజెక్టు నిర్మాణం గాకపోవడంతో నష్టపోయిన సీమ ప్రాంతానికి, నాగార్జునసాగర్ నిర్మాణంతో కృష్ణా జలాలను పూర్తిగా కోల్పోయే పరిస్థితి దాపురించింది. అంతేగాక నాగార్జునసాగర్‌కు బ్యాలేన్సింగ్ రిజర్వాయర్‌గా శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణ మయ్యింది. శ్రీశైలం రిజర్వాయర్ నుండి నీటి విడుదల ప్రాధాన్యతలలో రాయలసీమకు చివరిస్థానం ఇవ్వడం గమనార్హం. అందువల్ల కృష్ణా జలాలు సీమకు తాగునీటికి కూడా అందడం కష్టంగా వుంది.

## 3. 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు

రాష్ట్ర పునర్విభజన వల్ల బళ్ళారి జిల్లాను కోల్పోవడం జరిగింది. దాంతో తుంగభద్ర జలాలు 1956 వరకు 106 టిఎంసీలు / 212 టిఎంసీ వాటాగా పొందే సీమ ప్రాంతం, విభజన తర్వాత కేవలం 73.01 టిఎంసీ/ 212 టిఎంసీల వాటా మాత్రమే పొందుతున్నది. తుంగభద్రలో 75% ఆధారిత జలాలు పుష్కలంగా లభిస్తున్నా, వాటిని వినియోగించుకొనే వసతులు ప్రభుత్వాలు సమకూర్చక పోవడంతో ఆ నీరంతా మరల సాగర్ చేరి కడుపు నిండిన సంపన్నులకే మరింతగా విందవుతున్నది.

## 4. ప్రజా ప్రతినిధుల ప్రయత్నలోపం

కొత్త ప్రాజక్టుల నిర్మించుకోవడంలోనూ, కొనసాగుతున్న ప్రాజెక్టులను పూర్తి చేయించుకోవడంలో ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం కొట్టవచ్చినట్టు కనపడుతూంది.

## 5.సాగునీటి సదుపాయం వల్ల ఒనగూరే లబ్ధిని గురించి ప్రజలలో కొరవడిన అవగాహన.

రాయలసీమ ప్రాంతం దశాబ్దాలుగా తరచూ కరువుబారిన పడుతున్నా, 2004

సం.వరకు మిగులు జలాలనుపయోగించుకొని కనీస నీటి అవసరాలు తీర్చుకోవడానికి ఎలాంటి ప్రయత్నాలు జరగలేదు. ఇప్పుడు చేపట్టిన సాగునీటి ప్రాజక్టులను, కృష్ణా జలాల పంపిణి ట్రిబ్యునల్–1 తీర్పుకు ముందే చేపట్టి వుంటే రాయలసీమ ప్రాంతానికి ఎంతో మేలు జరిగేది. కరువుబారినుంది ఎప్పుడో సీమవాసులు బయటపడేవారు.

ఇప్పుడు ప్రభుత్వాలు చేపట్టవలసిన విధానం ఏమంటే ఇప్పుడు లభ్యమవుతున్న జలాలను అన్ని ప్రాంతాల కనీస అవసరాలు తీర్చేలా కృష్ణా జలాల పునః పంపిణి చేపట్టాలి. అంతేగాక నీరు సమృద్ధిగా లభ్యమవుతున్న నదీ బేసిన్‌ల నుండి నీటిని మరలించాలి. ఇప్పటికే నదీ సంగమాలపై తగినంత అధ్యయనం జరిగింది కూడా.

రాయలసీమ నాలుగు జిల్లాలలో కనీసం ఒక పంటకైనా సరైనకాలంలో తగినంత నీరు అందించాలంటే 400 టిఎంసీలు అవసరం. అందువల్ల తక్షణమే యిప్పుడు నిర్మాణంలో వున్న ప్రాజెక్టులకు, జలాల పునఃపంపిణీ ద్వారా నికర జలాలు అందివ్వాలి. వాటికి రాష్ట్రాల మధ్య జలవివాదాలతో లంకె వేయరాదు. అలా జరుగక పోతే ప్రాంతాల మధ్యగల జల వివాదాలు సమసిపోవు. సీమ ప్రజలు బతుకు తెరువుకై దగ్గరలోనున్న నగరాలకు వలస వెళ్ళడం ఆపలేము.

## రాయలసీమ జిల్లాల నీటి డిమాండ్.

| 1.జిల్లా పేరు | కర్నూల్ | అనంతపురం | కడప | చిత్తూర్ | మొత్తం |
|---|---|---|---|---|---|
| 2.మండలాలు | 54 | 63 | 51 | 66 | 234 |
| 3.గ్రామాలు | 898 | 964 | 972 | 1545 | 4379 |
| 4.జనాభా(లక్షలలో) | 40.53 | 40.83 | 28.85 | 42.71 | 152.92 |
| 5. భూ వైశాల్యం (ల.ఎలలో) | 43.63 | 47.28 | 37.95 | 37.44 | 166.30 |
| 6.వ్యవసాయ యోగ్యమైన భూమి (లక్షల ఎకరాలు) | 27.40 | 33.41 | 15.6 | 16.95 | 93.36 |

7.అటవీ ప్రాంతం

| | | | | | |
|---|---|---|---|---|---|
| (ల.ఏ)<br>8.వ్యవసాయేతర | 7.87 | 4.86 | 12.35 | 11.153 | 36.233 |
| వినియోగ భూమి(ల.ఎ)<br>9. సాధారణ | 8.36 | 2.96 | 4.07 | 3.515 | 18.905 |
| వర్షపాతంమీ.మీలలో<br>నీటి అవసరం టిఎంసీలలో | 670.5 | 552. | 699 | 918 | 2840.1 |
| అ. సాగునీరు | 115.08 | 140.32 | 65.62 | 71.19 | 392 |
| ఆ. తాగునీరు | 2.20 | 12.80 | 8.70 | 13.00 | 46.70 |
| ఇ. పరిశ్రమలకు | 6.9 | 8.42 | 3.93 | 4.27 | 23.52 |
| ~~ఈ~~. మొత్తం టిఎంసీలలో | 134.18 | 161.54 | 78.15 | 88.46 | 462.33 |
| | | | | | |

**వివరణ :** 10 వేల ఎకరాల ఆరుతడి పంటలకు ఒక టిఎంసీ (శతకోటి ఘనపుటడుగులు) నీరు అవసరమవుతుంది.

కావున ప్రభుత్వం మేల్కొని ఇప్పటికైనా రాయలసీమకు చట్టబద్ధంగా కనీసం 400 టిఎంసీల నికరజలాలను కేటాయించాలని సీమవాసుల డిమాండ్

**అనువాదం: అరుణ్,రాయలసీమ విద్యావంతులవేదిక.**

# సీమ రైతులకు వర ప్రధాయిని ఆర్డీఎస్ కుడి వరద కాలువ

బ్రిజేష్ కుమార్ కమిటీ ఆర్.డి.ఎస్. కుడి కాలువకు 4 టిఎంసిలు కేటాయించడం ద్వారా కరువుపీడిత కర్నూల్ జిల్లాలోని కొన్ని మండలాలకు ఉప శమనం కల్గించిందని చెప్పవచ్చు. అయితే, కరువు పీడిత కర్నూల్ జిల్లాలోని కొన్ని మండలాలకే గాక, మొత్తం రాయలసీమ మరియు నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు సాగు, తాగు నీరందించే పథకంగా ఆర్డిఎస్ కుడి వరదకాలువ పథకాన్ని రూపొందిం చాల్సిన అవసరం వుందని సీమ జలనిపుణులు ఎం.సుబ్బారాయుడుగారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దానికి సంబంధించిన వివరమైన నివేదికను ఆయన తయారుచేసి ప్రభుత్వానికి మార్చి 29, 2016న సమర్పించారు కూడా. ప్రముఖ దినపత్రిక 'ఈనాడు' మెయిన్ ఎడిషన్‌లో 'తుంగభద్రతోనే తీరేను బెంగ" అనే శీర్షికన 15.04.2016న ప్రచరించడం జరిగింది.

**ఆంధ్రప్రదేశ్** ప్రభుత్వం గతంలో ఆర్.డి.ఎస్. కుడి కాలువకు 12.9 టిఎంసిల నీటిని కేటాయించమని బచావత్ కమిటీని కోరగా, తగినన్ని నికర జలాలులేవని ఆ విజ్ఞప్తిని కమిటీ తోసిపుచ్చింది తుంగభద్ర సబ్-బేసిన్ (కే-8)లో ఆధారపడినంత నీటి లభ్యత లేదని, అందువల్ల అందుబాటులో వున్న మిగులు జలాలతో అవసరాలను తీర్చుకొమ్మని సలహానిచ్చింది. అయితే బ్రిజేష్ కుమార్ కేంద్ర జల కమీషన్ ఈ మధ్యకాలంలో పరిశోధనచేసి, విడుదలచేసిన నివేదిక తుంగభద్ర సబ్-బేసిన్(కే-8)లో గతంలో కనుగొన్నదానికన్నా ఎక్కువ నీటి లభ్యత వుందని తెల్పింది. దాని ఫలితంగానే బ్రిజేష్ కుమార్ కమిటీ ఆర్.డి.ఎస్. కుడి కాలువకు 4 టిఎంసిల నీరు కేటాయించడం, కర్నాటక రాష్ట్రానికి 36 టిఎంసిల నీటిని కేటాయించడం జరిగింది. అంతేగాక, 65% నీటి లభ్యత ఆధారంగా కర్నూల్ జిల్లా అవసరాలకై ఆర్.డి.ఎస్. కుడి కాలువకు 4 టిఎంసిలు కేటాయించడం తగినది; న్యాయమైనదని వ్యాఖ్యానించింది కూడా. **(బ్రిజేష్ కుమార్ నివేదిక పేజీ 228)**

ఈ నేపథ్యంలో కేవలం 4టిఎంసిల నీటినేగాక, అదనంగా లభ్యమ య్యే తుంగభద్ర వరదజలాలను రాయలసీమ, నెల్లూర్, ప్రకాశం జిల్లాల ప్రజలకు ఉప యోగపడేలా ఆర్.డి.ఎస్. కుడి వరద కాలువ నిర్మాణం చేపట్టడం అత్యవసరం.

## క్యారీ ఓవర్ రిజర్వాయర్ల నిర్మాణపు అవసరాలు

కృష్ణాజలాల వివాదాల పరిష్కార ట్రిబ్యూనల్-1 (బచావత్ కమీషన్) తన నివేదిక (వాల్యూం 1, పేజీ 155)లో రాష్ట్రాలు తమకు కేటాయించిన నీటికవసరమైన, తగిన సామర్థ్యంగల రిజర్వాయర్లు నిర్మించుకోవాలని సలహా నిస్తూ, అంతకన్నా ఎక్కువ సామర్థ్యంగల క్యారీ ఓవర్ రిజర్వార్ల నిర్మాణాలు చేసుకుని ఒక చుక్క నీరు కూడా వృధా కాకుండా చూడాలని సూచించింది.

75% మరియు 65% ఆధారిత జలాలంటే వంద సంవత్సరాలలో 74మరియు 64 సంవత్సరాలు 75% లేదా 65% కన్నా ఎక్కువ నీరు లభిస్తుందనీ, ఒక సంవత్సరం 75% మరియు 65% నీరు లభిస్తూందని, మిగిలిన 25, 35 సంవత్సరాలలో 75% మరియు 65% కన్నా నీటి లభ్యత తక్కువగా ఉంటుందని అర్థం. అంతేగాక, ఆర్.డి.ఎస్. పైభాగాన నీటిని నిల్వ వుంచుకొనే రిజర్వాయర్లు లేవని, ఆర్.డి.ఎస్. ఎడమకాలువ, కేసి కాలువలకు కేటాయించిన నీటిని సరైన సమయంలో విడుదల చేసేందుకు రిజర్వార్లు అవసరమని బచావత్ కమీషన్ తన నివేదికలో స్పష్టం చేసింది. దానికి అంగీకరిస్తూ హైదరాబాదు-మద్రాస్ రాష్ట్రాలమధ్య 1944లో వొప్పందం చేసుకున్నాయి కూడా.

అదేవిధంగా, అందుబాటులో వున్న ప్రతి చుక్క నీటినీ పదిలంగా దాచుకొని అవసరమున్నప్పుడు వినియోగించుకోవాలనీ, అందుకై క్యారీఓవర్ రిజర్వార్లను నిర్మించు కోవాలని బ్రిజేష్ కుమార్కమిటీ అభిప్రాయపడింది. (పే-323). అదే నివేదికలో (పే-324) " 50% ఆధారితంగా నీటి కేటాయింపులు జరిగినా కూడా కరువుపీడిత ప్రాంతాలలో క్యారీఓవర్ రిజర్వార్ల నిర్మాణం అవసరం" అని సిఫారసు చేసింది.

పై సూచనల దృష్ట్యా నేడు తుంగభద్రజలాలు కృష్ణలో కలిసి సముద్రంలో వృధా కాకుండా తగిన నీటి పథకాలను ఏర్పాటు చేసుకోవడం అవసరమని వేరే చెప్పనక్కర్లేదు. దానికితోడు తుంగభద్ర డ్యాంలో పూడిక చేరడంతో దాని నిల్వ సామర్థ్యం

తగ్గి డ్యాం నుండి వివిధ కాలువలకు కేటాయించబడ్డ నీటి విడుదల క్రమంగా తగ్గుతూ వుందని, కొత్త పథకాల ఆవశ్యకతను తెల్పుతూంది. కేసి.కాలువకు కేటాయించిన రెగ్యులేటెడ్ జలాలు 10 టిఎంసిల నుండి 6.5 టిఎంసిలకు, ఎల్.ఎల్.సి.కి 24.0కు గాను కేవలం 12-16 టిఎంసిలు, హెచ్.ఎల్.సి.కి 32.5కు గాను 16-18 టిఎంసిలు కూడా సరఫరా చేయలేని పరిస్థితివుంది. దానికి తోడు ఆర్డీఎస్‌కు బ్రిజేష్ కుమార్ కేటాయించిన 4 టిఎంసిలు కూడా డ్యాము ద్వారా పూర్తిగా వినియోగించుకొనే పరిస్థితి ఉండదు. అలా డ్యాం ద్వారా వినియోగించుకోలేని మిగిలిన నీరంతా నది ద్వారా కృష్ణలో కలిసి పోతున్నాయి. తమకు కేటాయించిన రేగ్యులేటేడ్ నీటిని వినియోగించు కోలేక రైతాంగం తీవ్రంగా నష్టపోతోంది.

అందువల్ల అలా కృష్ణలో కలిసి సముద్రంలో వృధా అవుతున్న వాటిని, కొత్తగా కేటాయించిన 4 టిఎంసిలను లాభదాయకంగా వినియోగించు కోవడానికి మరింత సామర్థ్యంగల జలాశయాలను నిర్మించుకోవడం తప్పనిసరి.

ఆర్.డి.ఎస్.ఆర్ పైభాగాన జలాశయపు నిర్మాణానికి అవకాశంలేదు. నేటి ఆర్డీఎస్ డ్యాం ఆంధ్రప్రదేశ్, కర్నాటక సరిహద్దుల్లో నిర్మించబడింది. అందువల్ల ఆ డ్యాం పైభాగాన కొత్తగా రిజర్వాయర్లను నిర్మించాలంటే కర్నాటక రాష్ట్ర భూభాగంలో భూసేకరణ అవసరమవుతుంది. అది కష్టతరమైన పని. కనుక ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల సరిహద్దులలో కొత్త రిజర్వాయర్ల నిర్మించే అవకాశంలేదు.

మరొక విషయం ఏమంటే- నేటి ఆర్డీఎస్ మళ్ళింపు పథకం మూడు రాష్ట్రాలకు నీరందించే ఉమ్మడి పథకం. తుంగభద్రలో నీటి ప్రవాహం తగ్గినప్పుడల్లా కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల రైతుల మధ్య ఘర్షణలు జరుగుతుండడం చేదు వాస్తవం. అందువల్ల 4 టిఎంసిల వినియోగం కోసం ఇప్పుడు తలపెట్టిన ఆర్డీఎస్ కుడి కాలువ స్థాయిలో నిర్మాణం, ప్రస్తుతమున్న ఆర్డీఎస్ డ్యాం దగ్గర ఎడమ కాలువ స్లూయిస్ లెవల్ స్థాయిలో నిర్మిస్తే, పై రెండు జిల్లాల రైతుల మధ్య ఘర్షణ మరింత పెరుగుతుంది. అందువల్ల ఆర్డీఎస్ కుడికాలువ నిర్మాణం ఎడమ కాలువ నీటి పారుదలకు ఎలాంటి ఆటంకం కల్గించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆర్డీఎస్ ఎడమ కాలువ. కేసి కాలువలకు దశాబ్దాలుగా 75% జలాల ఆధారితంగా నీటి కేటాయింపులు జరిగాయనే వాస్తవాన్ని గుర్తెరిగి నీటి విడుదల విషయంలో వాటికి ప్రాధాన్యత నివ్వడం తప్పనిసరి.

ఆర్డీఎస్ మళ్ళింపు పథకం సిల్ (గుమ్మం) లెవెల్ 332.50 మీ.కాగా, ఆర్డీఎస్ ఎడమకాలువ హెడ్‌రెగ్యులేటర్ గేట్ల లెవెల్ 329.80మీ. ఇప్పుడున్న ఆర్డీఎస్ ఆనకట్ట ముందు ప్రాంతంలో (foreshorearea) నిల్వవున్నా నీటిని ఏమాత్రం వినియోగించకూడదు కాబట్టి, ఆర్డీఎస్ కుడి వరదకాలువ హెడ్‌రెగ్యులేటర్‌ను మరింత పై భాగాన, ఆర్డీఎస్ ఎడమకాలువ ముందు ప్రాంతంలో (foreshorearea) దూరంగా ఏర్పాటు చేయడంవల్ల ఆర్డీఎస్ ఎడమకాలువ, కేసి కాలువలకు మరియు కర్నూల్ జిల్లా పశ్చిమ ప్రాంతానికి, ఉదాహరణకు కోసిగి మండలానికి న్యాయం జరుగుతుంది. అలా చేయకపోతే కోసిగి మండలానికి నీరందించే అవకాశాన్ని పూర్తిగా వదులుకున్నట్టే.

ఆర్డీఎస్ ఆనకట్ట పైభాగాన సుమారు 20 కి.మీ.దూరంలో కర్నూల్ జిల్లా సరిహద్దు తుంగభద్ర నది కుడివైపున ప్రారంభమవు తుంది. ఎడమవైపు రాయచూర్ జిల్లా ప్రాంతం. ఈ రెండు జిల్లాల సరిహద్దులో నదీ గర్భమట్టం (bed level) సుమారు 345 మీ. దానికి దగ్గరవున్న గ్రామం, కోసిగి మండలానికి చెందిన మ్యాలిగనూర్. మ్యాలిగనూర్ వద్ద ఆర్డీఎస్ కుడి వరద కాలువ హెడ్ రెగ్యులేటర్ ఏర్పరచడం ద్వారా తుంగభద్ర నదికి దూరాన ఎగువ ప్రాంతంలో వున్న భూములకూ నీరందించవచ్చు.

బచావత్ కమీషన్ ఆర్డీఎస్ ఎడమకాలువ, కేసి కాలువలకు తుంగభద్ర డ్యాంనుండి రేగ్యులేటెడ్ నీటిని కేటాయించింది. కాని కుడి కాలువకు నదీ జలాలనే పొందాలి. ఋతు పవనాలు లేని కాలంలో కుడి కాలువ ఆయకట్టుకు నీరందే ప్రసక్తే లేదు. అందువల్ల కుడి కాలువ ఆయకట్టుకు రబీ, ఖరీఫ్ పంటలకు నీరందించాలంటే నీటిని ఋతుపవనాల కాలంలో ఒడిసి పట్టుకొని తగిన ప్రదేశాలలో, కాలువ వెంట నిల్వచేసి క్యారీఓవర్ రిజర్వాయర్లుగా వినియోగించుకోవాలి.

## ప్రస్తుతమున్న ఆర్డీఎస్ ఆనకట్ట పైభాగాన ఆర్డీఎస్ కుడికాలువ ఏర్పాటువల్ల కలిగే ప్రయోజనాలు.

1) ప్రస్తుతమున్న ఆర్డీఎస్ ఆనకట్ట ప్రదేశం నుండి నీటిని తీసుకుంటే ఆ కాలువ తుంగభద్ర నదికి సమీపంలో, అంటే 200 నుండి 300 మీటర్ల దూరంలో సాగుతుంది. అదే కాలువను మ్యాలిగనూర్ నుండి ప్రారంభిస్తే దాదాపు 1 కి.మీ. దూరంలో సాగుతుంది. 2009లో సంభవించిన వరదలలో తుంగభద్రనది కుదివోడ్డున వున్న చాలా గ్రామాలు ముంపుకు గురయ్యాయి. అంతేగాక నదీ తీరాన వున్న భూములు

చాలావిలువైనవి, భూసేకరణ ఖర్చుతో కూడినది. అలాగాక ఆర్డీఎస్ కుడికాలువ హెడ్ రెగ్యులేటర్‌ను నదీ తీరానికి దూరంగా వున్న మ్యాలిగనూర్ వద్ద నిర్మిస్తే భూసేకరణ ఖర్చు తగ్గుతుంది. అంతేగాక, మ్యాలిగనూర్ వద్ద నిర్మించే హెడ్‌రెగ్యులేటర్ సిల్ లెవెల్ కుడి కాలువ లెవెల్‌కు ఒక మీటర్ పైభాగాన వుంటుంది. తుంగభద్ర నది మ్యాలిగనూర్ వద్ద ఆర్డీఎస్ వైపుకు మలుపు తిరుగుతుంది. ఇలా మలుపు తిరుగడం వల్ల ఆర్డీఎస్ కుడికాలువ ముంపుకు గురయ్యే అవకాశం ఉండదు. మ్యాలిగనూర్ వద్ద నది ఒడ్డు ఆర్డీఎస్ దగ్గరకన్నా ఎత్తుగా (ఏటవాటుగా) వుండటంతో సాంకేతికంగా అనుకూలం కూడా.

పై కారణాలవల్ల మ్యాలిగనూర్ వద్ద ఆర్డీఎస్ కుడి కాలువకై ప్రత్యేక హెడ్ రెగ్యులేటర్ నిర్మించడం అవసరం.

| నీటి లభ్యత | |
|---|---|
| కేసికేనాల్‌కు బచావత్ కమీషన్ కేటాయించిన తుంగబద్ర జలాలు | |
| తుంగభద్ర డ్యాం నుండి రేగ్యులేటెడ్ నీరు | 10.00 టిఎంసిలు |
| నదీ ప్రవాహం నుండి కేటాయింపులు | 29.90 టిఎంసిలు |
| **మొత్తం కేటాయింపులు** | **39.90 టిఎంసిలు** |

బచావత్ కమీషన్ మరియు భారత సాగునీటి సలహా మండలి సలహాల మేరకు కేసి కాలువల ఆయకట్టుదారుల వినియోగంకై 29.9 టిఎంసీలు లేక అంతకన్నా ఎక్కువ సామర్థ్యం గల రిజర్వాయర్లను నీటినిల్వకై ఏర్పాటు చేసుకొనే హక్కు వుంది. కాని యింతవరకు నిర్మించబడ్డ రిజర్వాయర్ల సామర్థ్యం కేవలం 4.165 టిఎంసీలు మాత్రమే. (సుంకేసుల ఆనకట్ట 1.20+ అలగానూర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ 2.965 టిఎంసీలు).

అంటే మనం యింకా నిల్వ చేసుకోదగ్గ నీరు 29.9 టిఎంసి–4.165 టిఎంసి=25.735 టిఎంసీలు. దశాబ్దాలుగా కేటాయించిన నీటిని నిల్వ చేసుకోవడానికి తగినంత సామర్థ్యంగల రిజర్వాయర్లను నిర్మించక పోవడంవల్ల కేసి కాలువ ఆయకట్టుదారులు నష్టపోతున్నారు. ఈ నీరంతా బనకచర్ల ఎస్కేప్ ఛానల్ ద్వారా

పెన్నలోచేరి సోమశిల రిజర్వార్‌ను చేరడం గమనార్హం.

అయితే గత 3 ఏళ్ళుగా గుండ్రేవుల రిజర్వాయర్ ప్రతిపాదనలు ప్రభుత్వం ముందున్నాయి. ఇక్కడకూడా ప్రజల వొత్తిడి తగినంత లేకపోవడంవల్ల, అటు ప్రభుత్వమూ పట్టించుకోవడం లేదు, ఇటు ప్రతిపక్ష రాజకీయ పార్టీ పట్టించుకోవడం లేదు. అయితే 2019లో జరగబోయే ఎన్నికలలో గెలుపు కోసం ఆ ప్రతిపాదన కార్యరూపం దాలిస్తే, ఇంకనూ కేసి కాలువల ఆయకట్టు దారులకు కేటాయించిన నీటిని నిల్వచేసుకునేందుకు (25.735 టిఎంసి-20టిఎంసిల) 5.235 టిఎంసిల నీటికి రిజర్వార్ నిర్మించాల్సిన అవసరం వుంటుంది.

అయితే గుండ్రేవుల రిజర్వార్ ఫల ప్రధమవడానికి మనకు తెలంగాణా రాష్ట్ర సహకారం అవసరమవుతుంది. అందుకే గుండ్రేవులలో నిల్వ చేయాలనుకున్న 20టిఎంసిలలో 10 టిఎంసిలు తెలంగాణాకు కేటాయించవలసి వుంటుంది. అంటే తెలంగాణా వాటా పోను గుండ్రేవులతో సహా మనం నిల్వచేసుకొనే కేసికి కేటాయించిన నీరు (గుండ్రేవుల10 టిఎంసి+ సుంకేసుల ఆనకట్ట 1.20+అలగనూర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ 2.965 టిఎంసిలు) 14.165టిఎంసిలు. అంటే మనమింకనూ (29.9-14.165) 15.735 టిఎంసిలను నిల్వ చేసుకోవలసి వుంటుంది. ఇది మన హక్కు.

అయితే అదే సమయంలో ఆర్.డి.ఎస్. కుడి కాలువకు కేటాయించిన నీటి వినియోగంకై కేసి కాలువల ఆయకట్టుదారుల ప్రయోజనాలను విస్మరించడం తప్పవుతుంది. అందువల్ల ఆర్.డి.ఎస్. కుడికాలువకు కేటాయిం చిన 4 టిఎంసీలు మరియు కేసికి కేటాయించిన నీటిలో 15.735 టిఎంసి లను కలిపి మొత్తం 19.735 టిఎంసిల నీటిని వినియోగించుకోనేందుకు అవసరమైన పథకాలను ఏర్పాటు చేసుకోవాలి.

అదే సమయంలో కేసికి కేటాయించిన నీటిలో 8 టిఎంసిలను ఎస్.ఆర్. బి.సి.కి కేటాయించినందువల్ల ఆ పరిమాణానికి రిజర్వాయర్ అవసరంలేదని వాదనలూ విన్పించవచ్చు. ఇప్పటివరకు ఎస్.ఆర్. బి.సి.కి కేటాయించిన నీటిని నిల్వ చేసుకొనే గోరుకల్లు (13.50) ఔక్ (4.50 టిఎంసి) రిజర్వాయర్లు పూర్తిగాకపోవడంతో కేసి కాలువ ఆయకట్టు దారులకు ఆ 8 టిఎంసిల లోటు కనపడడంలేదు. అవి పూర్తయితే కేసికాలువ ఆయకట్టుదారులు ఆందోళనపడక తప్పదు. ఆ 8 టిఎంసిలను నష్టాన్ని

భర్తీ చేసుకోవాలంటే బచావత్ మరియు భారత సాగునీటి కమీషన్ సూచనల మేరకు వరదలు వచ్చినప్పుడు నీటిని నిల్వచేసుకునేలా క్యారీఓవర్ రిజర్వాయర్ల నిర్మించు కోవాలి. అందువల్ల ఆర్‌డిఎస్ కుడికాలువకు కేటాయించిన 4 టిఎంసిలు మరియు కేసికి కేటాయించిన నీటిలో 15.735 టిఎంసిలను కలిపి మొత్తం 19.735 టిఎంసిల నీటిని వినియోగించుకోనేందుకు 19.735/20 టిఎంసిలకై రిజర్వాయర్లును తప్పని సరిగా ఏర్పాటు చేసుకోవాలి. వాటిని ఆర్.డి.ఎస్. కుడి కాలువ వెంట నిర్మించుకొని ఋతుపవనాల సమయంలో తుంగభద్ర జలాలను నిల్వచేసుకోవాలి.

## ఆర్.డి.ఎస్ కుడి వరద కాలువ ప్రవాహ సామర్థ్యం

2009లో వచ్చిన వరదల సమయంలో తుంగభద్ర, కృష్ణా నదులలో నీటి ప్రవాహం అంచనాలకు మించింది. శ్రీశైలం డాం స్పిల్‌వే నుండి విడుదల చేయగలిగే నీరు కేవలం 19.20లక్షల క్యూసెక్కులు మాత్రమే. కాగా నాటి వరద ప్రవాహం 25.55 లక్షల క్యూసెక్కులుగా అంచనా వేసారు. దానిపై అక్టోబర్ 28, 2014న సమావేశమైన నిపుణల కమిటీ, శ్రీశైలం డ్యాం పూర్తి రిజర్వాయర్ లెవెల్ +892 అని, అంతకన్నా పైన నీటిని నిల్వ చేసేందుకు అనుమతించరాదని తెల్పింది. అధికంగా వచ్చిన నీటిని విడుదల చేసేందుకు అన్ని అవకాశాలను అన్వేషించమని సలహా ఇచ్చింది.

నాటి శ్రీశైలం డ్యాం చీఫ్ ఇంజనీర్ శ్రీఅబ్దుల్‌బషీర్‌గారు వరద నియంత్రణపై సలహానిస్తూ, "శ్రీశైలం డ్యాంకు పైభాగాన వున్న ప్రధాన రిజర్వాయర్లు కిందిభాగాన వున్న పరీవాహక ప్రాంతాలలో కురిసిన అధిక వర్షపాతం వల్లనే వరదలు సంభవిం చాయని, అందుచేత వరద జలాల నియంత్రణ సాధ్యం కాదన్నారు. కర్నాటక మరియు ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలో మంత్రాలయం చుట్టుపక్క ప్రాంతాలలో (కర్నూల్ మరియు మహబూబ్ నగర్ జిల్లాల పరిధిలో) గతంలో ఎన్నడూ కనీవిని ఎరుగనంత వర్షపాతం సెప్టెంబర్ 29 నుండి అక్టోబర్ 2వ తేదీల మధ్యన నమోదయింది. ఆ వర్షం 344 నుండి 560 మిల్లీమీటర్లదాక పడిందని "నివేదికలో తెల్పారు. దాంతో గత శతాబ్ద కాలంలోనే ఎన్నడూ లేనంతగా శ్రీశైలం రిజర్వాయర్ వద్ద 25.55 లక్షల క్యూసెక్కుల ప్రవాహం నమోదయింది. గతంలో అత్యున్నత రికార్డు 07జూలై 1903లో 10.62

లక్షల క్యూసెక్కుల ప్రవాహం నమోదయిన్నట్టు రికార్డులు తెల్పుతున్నాయి.

సర్వే ఆఫ్ ఇండియా sheets పరిశీలించగా తుంగభద్ర నది కుడి వైపున ఆంధ్రప్రదేశ్, కర్నాటక సరిహద్దు నుండి ఆర్డీఎస్ ఆనకట్ట వరకు 20 కి.మీ. దూరంలో 4 ప్రధానమైన వాగులు, కుడ్లూర్ వంక, కటారిక వంక, కైడికి వంక లాంటివి వున్నాయని తెలుస్తున్నది. వాటి ప్రవాహం తుంగభద్ర నదిలోచేరడం గమనించవచ్చు. తుంగభద్ర నీటి ప్రవాహం ఉధృతం కావడానికి పైవాగుల నుండి నదిలోకి నీరుచేరడం ప్రధాన కారణంగా చెప్పవచ్చు. ఈ వాగులను క్యారీఓవర్ రిజర్వాయర్‌లుగా వినియోగించుకోవచ్చు, లేక తుంగభద్ర వరద నీటిని నిలుపుకొనే రిజర్వాయర్లలాగా వినియోగించుకోవచ్చు. అవి, కేసి కాలువ, ఆర్డీఎస్ కుడికాలువ ఆయకట్టుకు ఓవర్‌హెడ్ ట్యాంక్‌లుగా పనిచేస్తాయి.

వర్షపాతం అతి తక్కువగా వుండిన 2015–16లో కూడా పై ప్రాంతం నుండి తుంగభద్ర నదిలోకి 63 టిఎంసిల నీరు చేరడం గమనార్హం.

పైనేపథ్యంలో, శ్రీశైలం డ్యాం రక్షణ కోసం తుంగభద్ర నది వరద నీటిని మరల్చుడానికి మ్యాలిగనూర్ వద్ద ఒక హెడ్ రెగ్యులేటర్ నిర్మాణం, మరియు ఒక సరైన పెద్దకాలువ అవసరం. తద్వారా అధిక వర్షాలు పదినప్పుడు ఆ నీరు తుంగభద్ర నదిలో చేరకుండా యితర నదీ బేసిన్‌కు తరలించవచ్చు. అందుకై తగినన్ని క్యారీఓవర్ రిజర్వాయర్‌ల నిర్మాణం అవసర మవుతుంది.

## శ్రీశైలం డ్యాం రక్షణ కోసం మరి కొన్ని ప్రతిపాదనలు–పరిశీలన

శ్రీశైలం డ్యాం రక్షణకోసం పాములపాడు ప్రాంతం నుండి కృష్ణా వరద జలాలను కుందూనదికి తరలించుటకై సాధ్యాసాధ్యాల పరిశీలనకై జీవో ఆర్.టి.నెం. 621, సెప్టెంబర్ 22, 2015న ప్రభుత్వ పాలనా సంబంధమైన ఉత్తర్వుల జారీచేసింది. ఈ ప్రతిపాదన కుందూనది ముందు భాగం (foreshore) నుండి ఒకపెద్ద లోతైన (deepcut) కాలువను త్రవ్వాల్సివస్తుంది. ఈ కాలువ శ్రీశైలం కుడి ప్రధాన కాలువ (SRMC)కు సమాంతరంగా వుంటుంది. ఇది పెద్దలోతైన(deepcut) కాలువ కావడం వల్ల సేకరించేభూమి కేసికాలువ కింద అభివృద్ధి చెందిన ఆయకట్టు కావడంతో భూసేకరణ అంత సులభంకాదు. అదీగాక ఈ ప్రాంత రైతులు ఇప్పటికే శ్రీశైలం

కుడి ప్రధాన కాలువ (SRMC) నిర్మాణం కోసం సారవంతమైన భూముని కోల్పోయారు కూడా.

పై కష్టతరమైన ఎత్తిపోతల అవసరమైన పెద్ద లోతైన (deepcut) కాలువకు ప్రత్యామ్నాయంగా యిప్పటి ఆర్‌డిఎస్ కుడికాలువ ద్వారా వరదనీటిని వాలు (gravity) ద్వారా తరలించి కరువుపీడిత ప్రాంతాలకు అందచేయడం సబబుగా వుంటుంది.

బ్రిజేష్‌కుమార్ కమిటీ 25 టిఎంసీల వరదనీటిని తెలుగంగకు కేటాయించింది. అందువల్ల వరద జలాల ఆధారిత ప్రాజెక్టులలో తెలుగుగంగకు తొలి ప్రాధాన్యత యివ్వాల్సివుంటుంది. ఆ 25 టిఎంసీల నీటిని పొందడం ఆ ఆయకట్టుదారుల హక్కు కూడా. అయితే శ్రీశైలం రిజర్వాయర్ నుండి పోతిరెడ్డిపాడుద్వారా తెలుగంగకు నీరందడానికి జీఓ 69లోని నిబంధనలు, శ్రీశైలం రిజర్వాయర్‌లో తగినంతగా నీరు లేకపోవడం అడ్డంకిగా వున్నాయి. కానీ ఆర్‌డిఎస్ కుడి వరదకాలువ నిర్మాణం ద్వారా తెలుగుగంగకు నీరందించవచ్చు. ప్రతిపాదిత ఆర్‌డిఎస్ కుడి వరదకాలువ శ్రీశైలం కుడి ప్రధాన కాలువ (SRMC)కు వాలుద్వారా నీరందించగలదు.

దానికై ఆర్‌డిఎస్ కుడి వరదకాలువ నుండి తీసుకోవాల్సిన నీటి పరిమాణం ఆర్‌డిఎస్ కుడి కాలువకు బ్రిజేష్ కుమార్ కమిటీ కేటాయించింది 4 టిఎంసీలు మరియు కేసికి కేటాయించిన నీటిలో 15.735 టిఎంసీలను కలిపి మొత్తం 19.735 టిఎంసీలు తెలుగు గంగకు కేటాయించబడ్డ 25 టిఎంసీలను కలుపుకొని మొత్తం 44.735 అంటే 45 టిఎంసీలుగా చెప్పవచ్చు. బ్రిజేష్ కుమార్ కమిటీ తన నివేదిక 58 పేజీలో తుంగభద్ర నదిలో వరద ప్రవాహం సుమారు 15 నుండి 20 రోజుల వరకు వుంటుందని అంచనా వేసింది. అందువల్ల ఆ 45 టిఎంసీల వరదనీటిని తీసుకోవాలంటే రోజుకు 45/20=2.25 టిఎంసీలను తీసుకోవల్సి వుంటుంది.

అందువల్ల శ్రీశైలం డ్యాం వరద బారినుండి రక్షించేందుకు ఆర్‌డిఎస్ కుడి కాలువను వరదకాలువగా నిర్మించుకొని రోజుకు కనీసం 3 టిఎంసీల నీటిని పొందేందుకు అవసరమైన 35,000 క్యూసెక్కుల సామర్థ్యంలేక అంతకన్నా ఎక్కువ సామర్థ్యంతో నిర్మించాల్సి వుంటుంది.

ఈ వరదకాలువ పెద్దలోతైన(deepcut) కాలువ కాకపోవడంతో పెద్దఖర్చుతో కూడినపనికాదు. ఈ వరదకాలువ త్రవ్వకం ద్వారా తుంగ భద్ర నదిని

కర్నూల్ జిల్లాలోని గాలేరు, కుందూ నదులకు, ప్రకాశం జిల్లాలోని తీగలేరు నదులకు అనుసంధానం చేయవచ్చు. ఈ వరదకాలువ త్రవ్వకం ద్వారా బయటికి తీసే మట్టిని ప్రతిపాదిత కర్నూల్- మంత్రాలయం రైల్వే లైన్ నిర్మాణానికి వినియోగించవచ్చు. అంతేగాక ఈ వరదకాలువను రవాణ సౌకర్యంకై వాడుకోవచ్చు. హంద్రీ-నీవా కాలువకు 3వ ఎత్తిపోతల దగ్గర. ఈ వరదకాలువను అనుసంధానం చేయడం ద్వారా విద్యుత్‌ఖర్చు తగ్గించవచ్చు. ఈ వరదకాలువ పారకంతో కర్నూల్ జిల్లాలోని మంత్రాలయం, నందవరం, సి.బెళగల్, గూడూర్, కొడుమూర్, కల్లూర్, నందికోట్కూర్, జూపాడు బంగళా, మిడ్తూర్, పాములపాడు, ఆత్మకూర్, కొత్తపల్లి మండలాలు లబ్దిపొందుతాయి.,

**ఈ వరదకాలువప్రయోజనాలు**

1) ఈ వరదకాలువ వెంట అనేక క్యారీ ఓవర్ రిజర్వాయర్ల నిర్మాణం వల్ల, తుంగభద్ర నదిని కర్నూల్ జిల్లాలోని గాలేరు, కుందూ నదులకు, ప్రకాశం జిల్లాలోని తీగలేరు నదులకు అనుసంధానం చేయడంతో, శ్రీశైలం డ్యాంను వరదముప్పు నుండి తప్పించవచ్చు.

2) కర్నూల్ జిల్లాలోయింతవరకు తాగు, సాగు నీరందని ప్రాంతాలకు నీరందించ వచ్చు.

3) గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాలకు ఈ వరద కాలువ నుండి నీరందించవచ్చు.

4) దీనివల్ల చాలాకాలం కిందటనే ప్రతిపాదించబడి, యిప్పటికీ చేపట్టని కర్నూల్-మంత్రాలయం రైల్వేలైన్ నిర్మాణం సులభతరమవుతుంది. వరదకాలువకై చేసే భూసేకరణ మరియ త్రవ్విన మట్టి రైల్వేలైన్ నిర్మాణంకు ఉపయోగపడుతుంది. అందువల్ల రైల్వేలైనుకు అయ్యే ఖర్చును కొంత కేంద్ర ప్రభుత్వం నుండి రాబట్టవచ్చు.

5) దీనిద్వారా కర్నూల్, కడప, నెల్లూర్, ప్రకాశం జిల్లాలలో భూగర్భ జలాలు పెరుగుతాయి.

6) యింతవరకు సముద్రంలో వృధా అవుతున్న నదీజలాల వృధాను అరికట్టవచ్చు.

7) హంద్రీ-నీవ కాలువకు 3వ ఎత్తిపోతల దగ్గర. ఈ వరద కాలువను అనుసంధానం

చేయడం ద్వారా హంద్రీ-నీవా కాలువ నిర్వహణ ఖర్చును కొంతమేరకు తగ్గించవచ్చు.

8) ఈ వరదకాలువను శ్రీశైలం కుడి ప్రధాన కాలువ అను సంధానం చేయడం ద్వారా ఎస్.ఆర్.బి.సి, తెలుగుగంగ, గాలేరు-నగరిలకు తుంగభద్ర వరద నీళ్ళను అందించవచ్చు

9) నెల్లూర్ మరియు ప్రకాశం జిల్లాలకు తాగు, సాగునీటి సౌకర్యం కల్పించవచ్చు. రాష్ట్రప్రభుత్వం తుంగభద్ర నదిపై మ్యాలిగనూర్ వద్ద బ్రిడ్జిని నిర్మించాలని నిర్ణయిం చింది. ఈ వరదకాలువ అక్కడ నుండే ప్రారంభమవుతుంది. కాబట్టి ఆ ప్రదేశాన్ని ఆకర్షణీయమైన విహారయాత్రా కేంద్రంగా రూపొందించవచ్చు.

10) కర్నూల్ జిల్లాలో హంద్రీ నదికి పాలహంద్రీ అనేది ఒక ముఖ్యమైన ఉపనది. పాలహంద్రీ లద్దగిరి గ్రామం వద్ద హంద్రీలో కలుస్తుంది. ఆ సంగమంలో 1.5 టిఎంసీల సామర్థ్యంతో ఒక రిజర్వాయరును నిర్మించవచ్చు. మ్యాలిగనూర్ నుండి లద్దగిరి మధ్య దూరం 110కి.మీ. దూరం. వరద కాలువ నీటిని యిక్కడ నిల్వచేయడం ద్వారా లద్దగిరి-కర్నూల్ మధ్యనున్న గ్రామాలకు తాగు, సాగు నీరునందించవచ్చు

11) ఆర్‌డిఎస్‌కుడి వరద కాలువ హంద్రీ నదిని 113కి.మీ. దగ్గర దాటుతుంది. అక్కడ ఒక రిజర్వాయరును నిర్మించడం ద్వారా చుట్టుపక్కల గ్రామాలకు నీరందించ వచ్చు.

12) కర్నూల్ జిల్లాలో మిద్తూర్ గ్రామం తుంగబద్ర సబ్ బేసిన్ మరియు కుందూ సబ్ బేసిన్‌ల మధ్య ఎత్తైన ప్రదేశంలో వుంది. మిద్తూర్ గ్రామం దగ్గర 2 లేక 3 టిఎంసీల సామర్థ్యంగల ఒక రిజర్వాయర్ నిర్మించి వరద నీటితో నింపవచ్చు. ఆ నీటిని ఓర్వకల్ చుట్టుపక్కల ప్రాంతంలో సాగునీటికి మరియు నూతనంగా ఏర్పాటుచేయబోయే పరిశ్రమలకై వినియో గించవచ్చు.

13) కుందూ-పెన్నాకు ఉపనది. అందువల్ల కుందూద్వారా తుంగ భద్ర వరద జలాలను పెన్నాకు, దాని నుండి నెల్లూర్ జిల్లాకు నీరునివ్వవచ్చు.

14) గాలేరు నదిపై వెలుగోడు వద్ద 16.95 టిఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్‌ను నిర్మించారు. కాని యింతవరకు దాన్ని పూర్తి సామర్థ్యంతో నింపలేదు. ఈ వెలుగోడు రిజర్వాయర్‌కు ప్రధాన జలవనరు బనకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుండి ప్రారంభమయ్యే

తెలుగుగంగ ప్రాజెక్ట్ అనుసంధాన (లింక్)కాలువ. ఈ అనుసంధాన (లింక్) కాలువ నిండుగా పారితేతప్ప వెలుగోడు రిజర్వాయరును పూర్తిగా నింపడం సాధ్యంకాదు. అందులోనూ ఈ తెలుగుగంగ ప్రాజెక్ట్ అనుసంధాన(లింక్) కాలువకు నీరు పోతిరెడ్డి పాడు ద్వారా రావాలంటే శ్రీశైలం రిజర్వాయర్‌లో నీటిమట్టం 854 అడుగుల పైన వుండాలి. కేవలం కృష్ణా నది వరదల సమయంలోనే అది సాధ్యం.

ఆర్‌డిఎస్ కుడి వరదకాలువ 185కి.మీ. వద్ద గాలేరు నదిని దాటుతుంది. అందువల్ల వరద కాలువ నీటిని గాలేరునదిలోకి మళ్ళించడం ద్వారా వెలుగోడు రిజర్వాయర్ను దాని సామర్థ్యం మేరకు 16.95 టిఎంసీల నింపవచ్చు.

14) కర్నూల్ జిల్లాలోని సిద్దాపురం చెరువు చాలా ప్రాముఖ్యం గలది. దీనికింది ఆయకట్టు సుమారు 20 వేల ఎకరాలు. అదేవిధంగా సిద్ధాపురం ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం చేపట్టింది. దీనికీ నీరు వెలుగోడు రిజర్వాయర్ నుండే 65 కి.మీ. కాలువ ద్వారా ఎత్తిపోయాల్సి వుంది. ఈ రెండింటికి వరదకాలువ ద్వారా నీరందించవచ్చు, ఆర్‌డిఎస్ కుడి వరద కాలువ సిద్ధాపురం చెరువు పైభాగాన పోతుంది కాబట్టి వాలుద్వారా ఆ చెరువుకు నీరందించవచ్చు. కాని దానికి ఎత్తైన గట్టు నిర్మించాల్సి వుంటుంది. అలాగాక కేవలం 20/25 మీ. ఎత్తిపోతల ద్వారా సిద్ధాపురం చెరువుకు నీరు ఎత్తిపోయవచ్చు. ఇక, సిద్దాపురం ఎత్తిపోతల పథకానికి వెలుగోడు రిజర్వాయరు నుండి ఎత్తిపోయాల్సిన అవసరం లేకుండా వాలు ద్వారా నీరందీయవచ్చు..

15) ఆర్‌డిఎస్ కుడి వరదకాలువను కొత్తపల్లి వరకు పొడిగించడం వల్ల ఆ ప్రాంత భూగర్భజలాలను పెంచవచ్చు.

16) హంద్రీ నదిని దాటిన తర్వాత సిద్దాపురం చెరువు వరకు దాదాపు 100 కి.మీ. నీరందని పొలాలు ఎన్నో వున్నాయి. ఆర్‌డిఎస్ కుడి వరద కాలువ ద్వారా వాటిని కొత్తగా సాగులోనికి తీసుకరావచ్చు.

ఈ పథకాన్ని చేపట్టేందుకు మన ప్రభుత్వం కృష్ణా నదీ జలాల నిర్వహణ బోర్డు మరియు కేంద్ర జలకమీషన్ అనుమతి పొందాలని తెలంగాణా ప్రభుత్వం అభ్యంతరాలను తెల్పింది, కాని పై అనుమతులు ప్రాజెక్టు నిర్మాణానికే గాని, వివరమైన ప్రాజెక్టు నివేదిక తయారీకి అవసరం లేదు.

బచావత్ కమిటీ తననివేదిక (పే 43) **" పూర్తిగా పరిశీలన చేయకుండా,**

**అవసరమైన, వివరమైన అంచనాలను సిద్ధం చేసుకోకుండా, వాటిని పరిశీలించకుండా, ఏ పథకనిర్మాణాన్ని ఏ రాష్ట్రమూ చేపట్టరాదు"** అని స్పష్టం చేసింది.

అందువల్ల, వరద కాలువ వివరమైన ప్రాజెక్టు నివేదిక తయారు చేయకుండా మనం అపెక్స్ కమిటీ అంగీకారం అడగలేము.

ఈ కాలువ విషయంలో అదీ కేటాయించిన 4 టిఎంసీల వినియోగం విష యంలో కూడా మనం ప్రాథమిక దశలో వున్నాం. జీ.ఓ 72 తేదీ జనవరి 23, 2016లో ప్రభుత్వం కేవలం పరిశోధనకు, వివరమైన ప్రాజెక్టు నివేదిక తయారుకు అనుమతినిచ్చింది. అంతేగాని నిర్మాణానికికాదు. అందువల్ల తెలంగాణా లేవదీసిన అభ్యంతరాలు నిలబడవు.

అయితే ఆర్‌డిఎస్ కుడి వరద కాలువ నిర్మాణం అపెక్స్ కమిటీ అంగీకారం తర్వాతనే చేపట్టాల్సివుంటుంది. కాని, ఆర్‌డిఎస్ కుడి వరద కాలువకు ట్రిబ్యూనల్ కేటాయించిన నీటినే వినియోగిస్తాం కాబట్టి ఈ పథకానికి ఎలాంటి అభ్యంతరాలు వుండవు.

## కర్నాటక రాష్ట్ర అభ్యంతరాలు

కర్నాటక ప్రభుత్వం బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్,తాము కోరినట్టుగా 72 టిఎంసీల బదులు 68 టిఎంసీల మాత్రమే కేటాయిస్తూ, ఆంధ్రప్రదేశ్‌కు మాత్రం కేటాయింపులను 39 టిఎంసీల నుండి 43 టిఎంసీలకు పెంచిందని, యిలా పెంచడానికి 65% నీటి లభ్యతఆధారంగా చేయడానికి ఎలాంటి ఆధారాలు లేవని ట్రిబ్యునల్‌కు తన అభ్యంతరాలను తెల్పింది.

అయితే ఆర్‌డిఎస్‌కుడి  కాలువకు 4 టిఎంసీల నీటిని బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్  కేటాయించడానికి తగిన కారణాలున్నాయి. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తన నివేదిక పేజీ 328లో వాటిని స్పష్టం చేసింది కూడా. తాను 4 టిఎంసీల నీటిని కేటాయించిన ప్రాంతం కర్నూల్ జిల్లాలోని నీటి లభ్యతలేని ప్రాంతమనీ, అంతేగాక, ఆ ప్రాంతానికి తుంగభద్ర ఎగువ కాలువ నీరందించే అవకాశం లేదని చెప్పింది. పై వాస్తవాలను, అంశాలను పరిగణలోనికి తీసుకుంటూ కర్నూల్ జిల్లాలోని నీటి లభ్యత

లేని ప్రాంతానికి 65% నీటి లభ్యతఆధారంగా 4టిఎంసీలను కేటాయించడం న్యాయమైనది, సబబైనదని స్పష్టం చేసింది. అందువల్ల కర్నాటక ప్రభుత్వఅభ్యంతరాలు న్యాయస్థానాలలో నిలబడవు.

## ఆర్‌డిఎస్ కుడి వరదకాలువ నిర్మాణము మరియు నిర్వహణపై పాటించాల్సిన షరుతులు...

1) తుంగబద్ర నుండి కృష్ణా నదికి కేటాయించిన 31.45 టిఎంసీల జలాలకు (సుంకేసుల ఆనకట్ట నుండి 21 టిఎంసీల సుంకేసుల కిందిభాగం నుండి తుంగబద్ర, కృష్ణా నది సంగమం దాకా లభించే 10.45 టిఎంసీ)అధిక ప్రాధాన్యత నివ్వాలి.

2) ఆర్‌డిఎస్ కుడి వరద కాలువ, ఆర్‌డిఎస్ ఎడమ కాలువ నుండి తెలంగాణాకు కేటాయించిన నీటిని ఎట్టిపరిస్థితులలో ఆటంక పరచకూడదు.

3) అదేవిధంగా, కేసి కాలువ ఆయకట్టుకు ఎలాంటి యిబ్బందులు కలగకూడదు.

4) మ్యాలిగనూర్ దగ్గర నిర్మించబోయే రెగ్యులేటర్ సిల్ లెవెల్, నదీ గర్భాన (river bed level)కి 1 మీ. పైభాగాన ఉండేలా చూడాలి. అందువల్ల నదిలో తక్కువ నీరు ప్రవహిస్తున్న కాలంలో నదీ ప్రావాహానికి ఈ వరద కాలువ వల్ల ఆటంకం ఏర్పడదు.

5) రుతుపవనాల కాలంలో తప్ప యితర కాలాల్లో తుంగభద్ర నీటిని ఈ వరద కాలువ ద్వారా వాడుకొనకూడదు.

అవసరమైన నీటిని వరదల సమయంలో కాల్వ వెంబడి నిర్మించ బడ్డ రిజర్వార్లలో నిల్వ చేయబడ్డ నీటిని వినియోగించుకోవచ్చు.

## సుంకేసుల నుండి కృష్ణా నదికి విడుదలైన తుంగభద్ర జలాలు

| వ.నెం. | నీటి.సం. | నీటి పరిమాణం (టిఎంసీలలో) |
|---|---|---|
| 1. | 2004-05 | 209 |
| 2. | 2005-06 | 147 |
| 3. | 2006-07 | 397 |
| 4. | 2007-08 | 221.49 |
| 5. | 2008-09 | 443.78 |
| 6. | 2009-10 | 250.16 |
| 7. | 2010-11 | 138.34 |
| 8. | 2011-12 | 50 |
| 9. | 2012-13 | 260 |
| 10. | 2013-14 | 275 |

మొత్తం పది సం.లలో కృష్ణకు సుంకేసుల నుండి చేరిన తుంగభద్ర జలాలు = 2,391.17 టిఎంసీ

అంటే సగటున సం.కు 239.177 టిఎంసీలు అంటే తుంగభద్ర నుండి కృష్ణలో ప్రతి సం. సగటున 239.117 టిఎంసీ–21టిఎంసీ=218.117 టిఎంసీలు అధికంగా చేరుతున్నాయని స్పష్టమవుతున్నది. దాంతో వరద కాలువకు అవసరమైన నీరు తగినంతగా తుంగభద్రలో లభ్యమవుతున్నదని ఖచ్చితంగా చెప్పవచ్చు. అంతేకాదు, ఎవ్వరూ వినియోగం చేసుకోలేక సముద్రంలోకి వృధాగా పోతున్న కృష్ణా జలాల విషయమూ మరవరాదు. వాటి వివరాలు చూద్దాం.

| వ.నెం | నీటి.సం. | సముద్రంలో కలుస్తున్నవి (టిఎంసీలలో) |
|---|---|---|
| 1. | 2004-05 | 17.00 |
| 2. | 2005-06 | 1,225.00 |
| 3. | 2006-07 | 968.00 |
| 4. | 2007-08 | 907.00 |
| 5. | 2008-09 | 299.00 |
| 6. | 2009-10 | 507.00 |
| 7. | 2010-11 | 431.00 |
| 8. | 2011-12 | 56.00 |
| 9. | 2012-13 | 214.00 |
| 10. | 2013-14 | 399.00 |

10 సం.లలో మనంవినియోగించుకోలేక సముద్రం చేరిన కృష్ణా జలాలు 5,023 టిఎంసీలు. సంవత్సరంకు సగటున 500 టిఎంసీలు. యివి మన ప్రభుత్వ గణాంకాలైతే, బ్రిజేష్‌కుమార్ కమిటీ తన నివేదిక పేజీ 334లో దాదాపు 300 టిఎంసీల జలాలు అదనం కావడంవల్ల ప్రకాశం బ్యారేజి పైన పొర్లి పోతున్నాయని స్పష్టం చేసింది.

అందుచేత, అలా వృధా పోతున్న జలాలను ఆర్‌డిఎస్ కుడి వరద కాలువ ద్వారా వినియోగించుకొని రాయలసీమ 4 జిల్లాలతో పాటు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు సాగు, తాగునీటిని సరఫరా చేయవచ్చు. వాటిని కరువు రహిత జిల్లాలుగా మార్చవచ్చు.

అల్మట్టి ఎత్తుపెంచడం వల్లనూ, కృష్ణా నదిపై కొత్తగా ప్రతిపాదిత పథకాల నిర్మాణం వల్లనూ కృష్ణా వరద రోజులు 30నుండి 20/15 రోజులకు తగ్గుతాయి. దాంతో ప్రకాశం జిల్లాకు వెలిగొండ ప్రాజెక్టుకు రెండు సొరంగాల ద్వారా నీరందించడం దుర్లభమవుతుంది. అందువల్ల ఆర్‌డిఎస్ కుడి వరద కాలువను ప్రకాశం జిల్లాలోని తీగలేరు నదివరకు పొడిగించడం తప్పనిసరి.

## బడ్జెట్ అంచనా

| | |
|---|---|
| కాలువ పొడవు. 250 కి.మీ. | |
| భూసేకరణతో సహా కాల్వత్రవ్వకానికి (250× రు. 4 కోట్లు/ కి.మీ) | రు.1,000 కోట్లు |
| క్యారీ ఓవర్ రిజర్వాయర్లు ( 20 టిఎంసీ× రు. 1.5 కోట్లు / టిఎంసీ) | రు. 3,000 కోట్లు |
| కట్టడాల నిర్మాణపు పనులు | రు. 2,000 కోట్లు |
| సిద్దాపురం నుండి తీగలేరు వరకు టన్నెల్ | రు. 3,000 కోట్లు |
| మొత్తం ఖర్చు. | రు. 9,000 కోట్లు |

కరువు పీడిత ప్రాంతాల తాగు,సాగు నీటి అవసరాల దృష్ట్యా ఈ ఆర్‌డిఎస్ కుడి వరద కాలువ నిర్మాణం అత్యవసరం. అందుచేత అమూల్యమైన వరద జలాలు సముద్రంలో వృధాకాకుండా కరువుప్రాంత అవసరాలను తీర్చేందుకు, 4 టిఎంసీల ప్రతిపాదిత ఆర్‌డిఎస్ కుడి కాలువ ను ఆర్‌డిఎస్ కుడి వరద కాలువగా రూపుదిద్ది ప్రజలను ఆదుకోవడం ప్రజాస్వామ్య ప్రభుత్వాల బాధ్యత.

పై పథకాన్ని సాకారం చేసుకోవడానికి సీమ ప్రజలు ఉద్యమానికి సిద్ధం గాక తప్పదు.

**( విశ్రాంత ఇంజనీర్ శ్రీ సుబ్బారాయుడుగారు**

**రాష్ట్ర ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనకు వ్యాస రూపం –అరుణ్ )**

# తుంగభద్ర, పెన్నా నదుల అనుసంధానం

## ( హెచ్.ఎల్.సి.కి సమాంతర కాలువ)

రాయలసీమకు కృష్ణా, తుంగభద్ర, పెన్నా నదులు ప్రధాన జల వనరులు. అందులోనూ కృష్ణకు ప్రధాన ఉపనది అయిన తుంగభద్ర, రాయలసీమకు, వెన్నెముక లాంటిది.

1945–1953 మధ్య కాలంలో బళ్ళారి జిల్లాలో తుంగభద్ర నదిపై డ్యాం నిర్మించబడింది. కాని 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటుతో బళ్లారి జిల్లాను తెలుగువారు కోల్పోయారు. దాంతోపాటు తుంగభద్ర వల్ల పొందే లబ్ధి కొంతమేరకు తగ్గింది. తుంగభద్ర రిజర్వాయర్, కాలువల నిర్వహణ తుంగభద్ర బోర్డు అధీనంలో వుంటాయి. దీనిసభ్యులు ఇరు రాష్ట్రాలవారు వుండగా, చైర్మన్‌ను కేంద్రం నియమిస్తుంది.

తుంగభద్ర రిజర్వాయర్ నిర్మాణ సమయంలో వరద జలాలను పరిగణలోకి తీసుకొనలేదు. అందువల్ల అది మరుగుజ్జు రిజర్వాయర్‌గా తయారయ్యింది. పూర్తి రిజర్వాయర్ సామర్థ్యం, గరిష్ట నీటి స్థాయి ఒకటిగా 497.74మీ./1633 అడుగులుగా వుంది. ఆ స్థాయిలో నీటి పరిమాణం 132.47 టిఎంసీలు కాగా, ఒకటిన్నరమారు రిజర్వాయర్ నిండుతుందనే అంచనాతో, నీటి వినియోగం 230 టిఎంసీలుగా లెక్క వేసారు.

**నిర్వహణ కాలం:**

నీటిని,మే,జూన్ నెలలో విడుదల చేయరాదు.జూలై 1నుండి నీటి విడుదల ప్రారంభమవుతుంది.తుంగభద్ర డ్యాం నుండి మన రాష్ట్ర సరిహద్దువరకు దూరం. సుమారు 105.కి.మీ. అదలావుంటే తుంగభద్ర రిజర్వాయర్ నుండి అటు ఎగువ కాలువకు గానీ, ఇటు దిగువ కాలువకుగానీ కొన్ని దశాబ్దాలుగా ఏనాడు కేటాయించిన మేరకు నీరు విడుదల కాలేదు.

కేటాయించిన నీరు పూర్తిగా విడుదలగాక పోవడానికి రెండు ప్రధాన కారణాలున్నాయని చెప్పవచ్చు.

| కాలువ పేరు. | కర్నాటక | ఆంధ్రప్రదేశ్ | వాఖ్యలు. |
|---|---|---|---|
| తుంగభద్రకుడి ఎగువకాలువ<br>4 వేల క్యూసెక్కులు | 17.5 టిఎంసీలు | 32.5 టిఎంసీలు<br>(అనంతపూర్,కర్నూల్,కడప) | ఆంధ్రప్రదేశ్ సరిహద్దువరకు ఉమ్మడి కాలువ 105.437 కి.మీ ఆంధ్రప్రదేశ్‌లో 99.993 కి.మీ, మొత్తం 196.430 కి.మీ. |
| తుంగభద్ర కుడిదిగువకాలువ<br>18000 క్యూ.సె | 22.5 టిఎంసీలు | 29.50టిఎంసీలు<br>( అనంతపూర్,కర్నూల్ )<br>ఆవిరినష్టం.5.5 టిఎంసీలు | కాలువ పరిధులు:<br>కర్నాటక, 0-131.5, 135.7 -147.8, 148-156, 188-190.8<br>ఆంధ్రప్రదేశ్ 131.5 -135.7, 147.8 - 148, 156-188, 190.8-348.20 |
| తుంగభద్ర ఎడమఎగువకాలువ మరియు ఎడమదిగువకాలువ | 102 టిఎంసీలు | ----- | కర్నాటక పరిధులో |
| కే.సి.కాలువ | -------- | 10 టిఎంసీలు<br>(కర్నూల్,కడప) | రబీ అవసరాలకై డ్యాం నుండి రేగ్యులేటేడ్ నీరు |

| కాలువ పేరు. | కర్నాటక | ఆంధ్రప్రదేశ్ | వాఖ్యలు. |
|---|---|---|---|
| ఆర్ డి ఎస్ డ్యాం నుండి రేగ్యులేతేడ్ నీరు | **0.49**టిఎంసీలు | **6.51** టిఎంసీలు (తెలంగాణా) | రబీ అవసరాలకై |
| విజయనగర కాలువలు | **2.00** టిఎంసీలు | ---- | రబీ అవసరాలకై డ్యాం నుండి రేగ్యులేటెడ్ నీరు |
| రాయనబసవ కాలువ | **7.00** టిఎంసీలు | ----- | రబీ అవసరాలకై డ్యాం నుండి రేగ్యులేటెడ్ నీరు |

**మొత్తం 230టిఎంసీలులు**
**ఆవిరినష్టం 18 టిఎంసీలు**
**నికర కేటాయింపులు 212 టిఎంసీలులు**
**తుంగభద్రడ్యాం డెడ్ స్టోరేజ్ 1550 అడుగుల (472.44 మీ.) వద్ద 1.16 టిఎంసీలు**

1) తుంగభద్ర రిజర్వాయర్‌లో పూడిక చేరడంతో దాని నిల్వ సామర్థ్యం తగ్గుతూ వస్తూంది. ఆ మేరకు ఎగువ కాలువ, దిగువ కాలువలకు కేటాయించిన నీటి మొత్తంలో తగ్గించి విడుదల చేస్తున్నారు.

**2) జలచౌర్యం:** తుంగభద్ర ఎగువ కాలువ, దిగువ కాలువలు రెండూనూ ఇరు రాష్ట్రాల ఆయకట్టుకు నీళ్ళివ్వాలి. ఈ వుమ్మడి కాలువను కర్నాటక రైతాంగం తమకు అనుకూలంగా మార్చుకొని, తమ రాష్ట్ర పరిధిలో అనధికారికంగా సాగుకు నీటిని వాడుకుంటున్నారు. తుంగభద్ర దిగువకాలువ చాలాపొడవైనది. (348.20కి.మీ). అందులోనూ ఈ కాలువ కర్ణాటకలో నాలుగు విడతలుగా (stretches) పారుతుంది. ఆ భాగాలలో జలచౌర్యం ఎక్కువ. అత్యంత కరువు పీడిత ప్రాంతమైన ఆలూర్ ప్రాంతం ఈ జలచౌర్యం వల్లఎక్కువగా నష్టపోతుంది. కారణం అది తుంగభద్ర ఎగువ కాలువ, దిగువ కాలువల రెండింటికి చివరి భాగాన ఉండటమే.

పై ఇబ్బందులకు తోడు కర్నూల్ పార్లమెంటరీ నియోజక పరిధిలో తుంగభద్ర జలాల వాడకంలో అదనపు ఇబ్బందులూ వున్నాయి.

అ) కర్నూల్-కడప కాలువ సుంకేసుల బ్యారేజ్ నుండి ప్రారంభమవుతుంది. ఈ కాలువ తొలిభాగం (0 నుండి 30 కి.మీ) కర్నూల్ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో వుంది. కర్నూల్- కడప కాలువకు కేటాయించిన 10 టిఎంసీల రేగ్యులేటెడ్ జలాలను అనంతపూర్ జిల్లాలోని తుంగభద్ర ఎగువ కాలువకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేటాయించింది. అత్యంత క్లిష్టమైన సమయంలో మాత్రమే కర్నూల్ - కడప కాలువ ఆయకట్టుకు, కర్నూల్ నగర తాగునీటి అవసరాలకు ఆర్‌డిఎస్‌కు కేటాయించిన రేగ్యులేటేడ్ జలాలతో పాటు తుంగభద్ర జలాలను విడుదల చేస్తున్నారు. అలా ఒకే సమయంలో కర్నూల్-కడప కాలువ ఆయకట్టుకు, ఆర్‌డిఎస్ ఆయకట్టుకు నీరు విడుదల చేయడంతో ఇరు ప్రాంతాల రైతుల మధ్య ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. అంతేగాక కే.సి కాలువ ప్రారంభంలో వున్నా భూములకు ముచ్చుమర్రి నుండి నీటిని ఎత్తిపోసే పథకం యింకా కార్యరూపం దాల్చలేదు.

ఆ) తుంగభద్ర రిజర్వాయర్, ఆర్‌డిఎస్‌ల మధ్య ప్రాంతం కర్నాటక రాష్ట్రంలో వుంది. అక్కడి రైతుల అనధికార నీటి వినియోగంతో కే.సి కాలువకు కేటాయించబడ్డ నీరు పూర్తిగా అందడం లేదు.

ఇ) కర్నూల్ జిల్లా పశ్చిమ ప్రాంతానికి తుంగభద్ర దిగువ కాలువ ఒక్కటే జలవనరు. దానికి బచావత్ కమిటి 29.5 టిఎంసీలు కేటాయించింది. అందులో ఆవిరినష్టం 5.5 టిఎంసీలు పోగా ఇక మిగిలింది 24టిఎంసీలు మాత్రమే. అందులోనూ ఆనీరు ఆ కాలువలో 348.20 కి.మీ. ప్రవహించాలి కాబట్టి ప్రవాహ నష్టమూ వుంటుంది.

తుంగభద్ర రిజర్వాయర్‌లో నీరు పూర్తిసామర్థ్యం మేరకు నిల్వ ఉండక పోవడానికి కారణం పూడిక చేరడమే. ప్రాజెక్టు నిర్మాణ కాలంలో దాని రూపకల్పన ప్రకారం రిజర్వాయర్‌లో ప్రతి ఏడాది దాదాపు అర టిఎంసీ నీరు పూడికవల్ల తగ్గుతుందని అంచనా వేసారు. అందువల్ల గత 60 ఏళ్ళలో పూడికవల్ల దాదాపు 30 టిఎంసీల మేరకు రిజర్వాయర్‌లో నీటినిల్వ తగ్గిందని. దాంతో అదే నిష్పత్తిలో తుంగభద్ర ఎగువ, దిగువ కాలువలకు, ఆర్‌డిఎస్, కేసీ కెనాల్‌కు కేటాయించిన నీటివాట తగ్గింది కూడా. కాని రైతాంగం తమకు కేటాయించిన నీరు వస్తుందని ఆశతో పంటలు వేసుకోవడం, సరైన సమయంలో నీరు అందక పోవడంతో, పంట నష్టమయి అప్పుల పాలవుతున్నారు. అందువల్ల ఆ ప్రాంతం ప్రజలు జీవనోపాధికై వివిధ ప్రాంతాలకు వలస పోతున్నారు. ఒక్కొక్కసారి, జీవనోపాధికై అసాంఘీక శక్తులుగా మారడం, అది ముఠాకక్షలు పెరగడానికీ దారితీస్తుంది.

ఇలాంటి పరిస్థితి నుండి బయట పడాలంటే తుంగభద్ర రిజర్వాయర్‌లో పూడికవల్ల కోల్పోతున్ననీటిని, కరువు ప్రాంతాలైన ఎగువ, దిగువ, ఆర్‌డిఎస్ ఆయకట్టు దారులకు అందేలా చూడక తప్పదు.

## కర్నాటక ప్రాంతంలో కొత్త జలాశయాల నిర్మాణ ప్రతిపాదనలు

ఈ నేపథ్యంలో తుంగభద్ర రిజర్వాయర్‌లో పూడిక తగ్గించేందుకై కర్నాటక రాష్ట్రం తుంగభద్ర రిజర్వాయర్ పైభాగాన 35 టిఎంసీల సామర్థ్యంతో కొత్త జలాశయాన్ని నిర్మించుకొనడానికి ప్రతిపాదనలు చేసింది. అయితే రిజర్వాయర్‌లలో పూడిక చేరడం సర్వసాధారణమైన విషయం. అలాంటి సమస్య ప్రతి నదీపరీవాహక ప్రాంతం(basin)లోనూ వుంటుంది. కనుక దానికి పరిష్కారంగా రిజర్వాయర్ పైభాగాన కొత్త జలాశయాన్ని నిర్మించు కొనడం వల్ల కింది ప్రాంతాల నీటి హక్కులకు భంగం

కల్గుతుంది. అందుచేతనే ఆ ప్రతిపాదనలను తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు వ్యతిరేకిస్తున్నాయి. అంతేగాక, కర్నాటక రాష్ట్ర ప్రతిపాదనల వల్ల పూడిక సమస్య తీరకపోగా, తుంగభద్ర రిజర్వాయర్ పైభాగాన మరింత అనధికార ఆయకట్టు యేర్పడేందుకు దోహదపడుతుంది. తద్వారా కింది ప్రాంతాల ఆయకట్టుకు నీరందడం మరింత కష్టమవుతుంది.

పై సమస్యల పరిష్కారంకై దశాబ్దాలుగా కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య చర్చలు జరుగుతూనే వున్నాయి కాని ఫలితం మాత్రం శూన్యం. అయితే పూడిక మరియు అనధికార ఆయకట్టు– ఈ రెండు సమస్యల పరిష్కారానికై అందరికీ ఆమోదయోగ్యమైన ప్రతిపాదనలూ వున్నాయి. ఈ పరిష్కార ప్రతిపాదన కృష్ణ ట్రిబ్యూనల్ పరిధిలోనే వుంది.

## ఆ పరిష్కారాన్ని వివరంగా పరిశీలిస్తే...

బచావత్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలకు కేటాయించిన తుంగభద్ర నికరజలాలను తుంగభద్ర డ్యాంలో నిల్వచేసుకొనే హక్కు ఆ రాష్ట్రాలకు వుంది. వాటిని రాష్ట్రాల ఇండెంట్ ఆధారంగా తుంగభద్రబోర్డ్ విడుదలచేయాలి. ఈ వాస్తవాలనటుంచి, ఇప్పుడు తుంగభద్ర జలాలు తుంగభద్ర రిజర్వాయర్ నుండి కాకుండా డ్యాం స్పిల్‌వే నుండి నదిద్వారా పారిన నీటి పరిమాణాన్ని చూద్దాం.

| వ.నెం. | సంవత్సరం | స్పిల్ వే నుండి పారిన నీరు టిఎంసీలలో |
|---|---|---|
| 1. | 1990-91 | 102.163 |
| 2. | 1991-92 | 159.282 |
| 3. | 1992-93 | 267.915 |
| 4. | 1993-94 | 90.141 |
| 5. | 1994-95 | 311.414 |

| వ.నెం. | సంవత్సరం | స్పిల్ వే నుండి పారిన నీరు టిఎంసీలలో |
|---|---|---|
| 6. | 1995-96 | 0.00 |
| 7. | 1996-97 | 28.704 |
| 8. | 1997-98 | 130.887 |
| 9. | 1998-99 | 85.597 |
| 10. | 1999-2000 | 114.930 |
| 11. | 2000-2001 | 96.642 |
| 12. | 2001-2002 | 0.000 |
| 13. | 2002-2003 | 0.000 |
| 14. | 2003-2004 | 0.000 |
| 15. | 2004-2005 | 23.10 |
| 16. | 2005-2006 | 119.411 |
| 17. | 2006-20007 | 110.916 |
| 18. | 2007-2008 | 252.121 |
| 19. | 2008-2009 | 98.168 |
| 20. | 2009-2010 | 159.993 |
| 21. | 2010-2011 | 121.416 |
| 22. | 2011-2012 | 99.638 |
| 23. | 2012-2013 | 13.947 |
| 24. | 2013-2014 | 211.116 |

మొత్తం స్పిల్‌వే నుండి నదీలోకి పారినవి, 24 సం.లలో 2597.50 టిఎంసీలు.

సగటున సం.కి స్పిల్ వే నుండి నదీలోకి పారినవి

2597.50 టిఎంసీ/24=108.229 టిఎంసీలు

ఇంకా నిశితంగా పరిశీలిస్తే 24 ఏళ్ళలో సగటున ఏడాదికి స్పిల్ వే నుండి నదీలోకి పారిన 108.229 టిఎంసీలకన్నా ఎక్కువుగా గత 11 ఏళ్ళలో సగటున ఏడాదికి పారిన నీరు ఎక్కువని తేలుతుంది.

అలా నదీ ద్వారా పారిన నీటిలో సుంకేసుల నుండి కిందికి పారిన తుంగభద్రనీటి పరిమాణం తెలుసుకుందాం.

| వ.నెం. సం. | సుంకేసుల నుండి నదిలోకి పారినవి (టిఎంసీలలో) | వాఖ్యానం |
|---|---|---|
| **1 1990-1991** | **58.96** | **బచావత్ కమీషన్ ప్రకారం** |
| **2. 1991-1992** | **68.69** | **అ) కృష్ణలో చేరవలసిన తుంగభద్ర నీరు** |
| **3. 1992-1993** | **74.36** | **కేవలం 31.45 టిఎంసీలు మాత్రమే** |
| **4. 1993-1994** | **58.69** | **------** |
| **5. 1994-199** | **589.46** | **------** |
| **6. 1995-1996** | **124.18** | **-----** |
| **7. 1996-1997** | **11.42** | **------** |
| **8. 1997-1998** | **98.91** | **------** |
| **9. 1998-1999** | **122.24** | **------** |
| **10. 1999-2000** | **102.61** | **ఆ) సుంకేసుల నుండి కృష్ణ సంగమం మధ్య** |
| **11. 2000-01** | **89.96** | **చేరే నీరు 10.45 టిఎంసీలు** |
| **12. 2001-2002** | **41.29** | **-----** |

| వ.నెం. సం. | సుంకేసుల నుండి నదిలోకి పారినవి (టిఎంసీలలో) | వాఖ్యానం |
|---|---|---|
| 13. 2002-2003 | 42.12 | ------ |
| 14. 2003-2004 | 53.00 | ----- |
| 15.2004-2005 | 209.00 | ----- |
| 16.2005-2006 | 147.00 | అందువల్ల సుంకేసుల నుండి కిందికి |
| 17.2006-2007 | 397.00 | (కృష్ణలో) చేరవలసిన 31.45-10.45= |
| 18. 2007-2008 | 221.49 | 21 టిఎంసీ మాత్రమే |
| 19. 2008-2009 | 448.78 | |
| 20. 2009-2010 | 250.16 | |
| 21. 2010-2011 | 138.34 | |
| 22. 2011-2012 | 50.00 | |
| 23. 2012-2013 | 260.00 | |
| 24. 2013-2014 | 275.00 | |

మొత్తం 24 ఏళ్ళలో సుంకేసుల నుండి కిందికి (కృష్ణా నది) పారిన తుంగభద్ర నీటి పరిమాణం = 3,545.66 టిఎంసీలు.

అంటే ప్రతి సంవత్సరం సగటున సుంకేసుల నుండి కిందికి (కృష్ణ నది) పారిన తుంగభద్ర నీటి పరిమాణం = 3,545.66/24= 147.74టిఎంసీ లు.

మరింత నిశితంగా పరిశీలిస్తే 24 సం.లలో సగటున సంవత్సరానికి తుంగభద్రనదిలోకి పారినవి. డ్యాం స్పిల్ వే నుండి నదీలోకి పారిన నీటి (2597.50 టిఎంసీల) కన్నా మొత్తం 24 సం.లలో సుంకేసుల నుండి కిందికి (కృష్ణ నది) పారిన తుంగభద్ర నీటి పరిమాణం(3,545.66 టిఎంసీలు) ఎక్కువగా వుండటం

చూడవచ్చు. అంటే తుంగభద్ర డ్యాం పైభాగానికన్నా డ్యాం కింది భాగాన నదిలో ఎక్కువ నీరు చేరుతుందని స్పష్టమవుతున్నది. ఆ నీరూ కర్నూల్ జిల్లాల పరిసర ప్రాంతంలో, మరీ ముఖ్యంగా మంత్రాలయం చుట్టుపక్కల కురిసే అధిక వర్షాల వల్ల, మరియు వేదవతి, హంద్రీ లాంటి నదుల నీటి చేరిక వల్ల సుంకేసుల నుండి కిందికి (కృష్ణ నది)పారిన తుంగభద్ర నీటి పరిమాణం ఎక్కువుగా వుందని చెప్పవచ్చు.

అయితే బచావత్ కమీషన్ ప్రకారం కృష్ణలో చేరవలసిన తుంగభద్ర నీరు కేవలం 31.45 టిఎంసీలు మాత్రమే. అందులోనూ సుంకేసుల నుండి కృష్ణ సంగమం మధ్య పరీవాహక ప్రాంతంనుండి 10.45 టిఎంసీల నీరు చేరుతుందని బచావత్ కమీషన్ అంచనా వేసింది. అంటే వాస్తవంగా సుంకేసుల నుండి కిందికి (కృష్ణలో) చేరవలసిన నీటి పరిమాణం 21 టిఎంసీలు కాగా, చేరుతున్నది దాదాపు 148 టిఎంసీలు. అంటే 128 టిఎంసీల ఎక్కువ నీరు శ్రీశైలంచేరి, అక్కడ నుండి సాగర్, ఆతర్వాత కృష్ణా డెల్టాను సుసంపన్నం చేయడమే గాక, చేపల రొయ్యల చేరువులను నింపుతూ చివరకు సముద్రంలో సగటున ప్రతి సం.దాదాపు 500 టిఎంసీల మేరకు వృధా అవుతుందని ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. ఆ నీటిలో తుంగభద్ర నీటి వాటా వుందని అర్థం చేసుకుంటే, సీమలో నీళ్లున్నా కరువుకు కారణాలేమిటో అర్థం చేసుకోవచ్చు.

## బంగాళాఖాతంలో వృధాగా చేరుతున్న కృష్ణా నీరు

| సంవత్సరం | సుంకేసుల నుండి నదిలోకి పారినవి | వాఖ్యానం |
|---|---|---|
| **2004-05**<br>**2005-06** | **17 టిఎంసీలు**<br>**1225.00టిఎంసీలు** | **కృష్ణా జలాల వివాద ట్రిబ్యూనల్ 1&2 అందుబాటులోవున్న ఒక్క చుక్కనీరు వృధా చేయకూడదని సలహాలనిచ్చింది** |

| సంవత్సరం | సుంకేసుల నుండి నదిలోకి పారినవి | వాఖ్యానం |
|---|---|---|
| 2006-07 | 968.00 టిఎంసీ | |
| 2007-07 | 907.00 టిఎంసిలు | |
| 2009-10 | 507.00 టిఎంసీలు | ప్రకాశం బ్యారేజి నుండి సముద్రం తీరం వరకు కృష్ణా బేసిన్‌లో కృష్ణా పరీవాహక ప్రాంతం 3% గా వుంది. మంచి వర్షపాతం కలది. అందువల్ల ఆ నీరు ఆ ప్రాంతంలో నీటిలోని ఉప్పుశాతాన్ని తగ్గించేందుకు సరిపోతుంది. |
| 2010-11 | 431.00 టిఎంసీలు | |
| 2011-12 | 56.00 టిఎంసీలు | |
| 2012-13 | 214.00 టిఎంసీలు | |
| 2013-14 | 399.00 టిఎంసీలు | |

మొత్తం 10 సంవత్సరాలలో

సముద్రం పాలైన కృష్ణా జలాలు =5,023 టిఎంసీలు

అంటే సంవత్సరానికి సగటున సముద్రం

పాలవుతున్న కృష్ణా జలాలు =502.03 టిఎంసీలు.

తుంగభద్ర పరీవాహక ప్రాంతంలో తగినంత నీరు లభ్యం అవుతుం దనీ,వాటిని వినియోగించుకొనడంలో మనం వైపల్యం చెందుతున్నామని, అందువల్లే వందల టిఎంసీల నీరు సముద్రం పాలవుతున్నాయనే చేదు వాస్తవాన్ని పై గణాంకాలు

మనకు తెల్పుతున్నాయి. మరో విధంగా చెప్పాలంటే, రాయల సీమ కరువుకు ప్రకృతి చిన్నచూపు కారణంకాదని, ఈ ప్రాంతం పట్ల దశాబ్దా లుగా పాలకులు చూపుతున్న నిర్లక్ష్యమే కారణమని చెప్పాలి.

పైన చూపిన వృధా అవుతున్న వందల టిఎంసీల జలాలను తుంగభద్ర, పెన్నా నదుల అనుసంధానంతో వినియోగించుకొని సీమను కరువు రహిత ప్రాంతంగా మార్చగలం. దీనికి నేడున్న తుంగభద్ర ఎగువకాలువ పైభాగాన సమాంతర కాల్వ నిర్మాణమే ఏకైక మార్గం. ఈ సమాంతర కాల్వ ద్వారా నీటిపారుదలకు ఎలాంటి ఎత్తిపోతల అవసరమూ ఉండదు. కేవలం తుంగభద్ర డ్యాంకు సమాంతరకాల్వను అనుసంధానం చేయడం ద్వారా నీటిని వినియోగించుకోవచ్చు.

ఖరీఫ్ తొలిరోజుల్లో, అంటే జూన్/ జూలై మాసాల్లో కర్నాటకలోనో పశ్చిమ ప్రాంతంలో పడే అధిక వర్షాలవల్ల తుంగ, భద్ర అనే నదుల సంగమంతో తుంగభద్ర నదికి వరదలు వస్తాయి. ఆ నీటిని తుంగభద్ర ఎగువ సమాంతర కాల్వ ద్వారా ఉపయోగించుకోవచ్చు. వివరాల్లోకి వెళితే..

ఇంతవరకు తుంగభద్ర డ్యాంలో చేరిన పూడిక 30 టిఎంసీలు, కాగా దానివల్ల డ్యాంలో తగ్గిన నీటినిల్వ సామర్థ్యం ఒకటిన్నర రెట్లు = 45 టిఎంసీలు.

తుంగభద్ర ఎగువ కాలువకు కేటాయించిన నీటిలో పూడికవల్ల తగ్గిన నిష్పత్తి మేరకే ప్రతిపాదిత తుంగభద్ర ఎగువ సమాంతర కాల్వ ద్వారా నీటి తీసుకోకుండా, మనకు కేటాయించిన నీటి మొత్తం టిఎంసి (32.5)లను, మరియు కర్నాటకలోని పారిశ్రామిక అవసరాలకు (6 టిఎంసీ) మొత్తం అంటే (32.5+ 6.00) టిఎంసీలను ఆవిరినష్టంతో (05.5) సహా 44 టిఎంసీలను తుంగభద్ర ఎగువ సమాంతర కాల్వద్వారా తీసుకోవాలి.

1. హెచ్ఎల్సికి కేటాయించిన నీరు 32.5 టిఎంసీలు.

2. తుంగభద్ర డ్యాం కింది ప్రాంతంలోని కర్నాటక రాష్ట్ర పరిశ్రమలకు అవసరమైన నీరు. 06.00 టిఎంసీలు

3. రవాణా,ఆవిరి నష్టం 05.50 టిఎంసీలు

**మొత్తం తీసుకోవలసినది. 44 టిఎంసీలు**

ఈ 44 టిఎంసీలు ఖరీఫ్ సీజన్ తొలిభాగంలోనే తీసుకొని పెన్నార్ బేసిన్‌లో ఎగువ కాలువ ప్రాంతంలో వున్న రిజర్వాయర్లలో, కర్నాటకలో కట్టబోయే కొత్త రిజర్వాయర్లలో నిలువచేకోవాలి. అయితే ఆంధ్రప్రదేశ్‌కు తనకు కేటాయించిన 32.5 టిఎంసీలకు మాత్రం ఎలాంటి నెలవారీ ఇండెంట్ పెట్టే హక్కు వుండదు. ఎందుకంటే ఖరీప్ మొదట్లోనే ఆ నీటిని తీసుకుంటాం గనుక, అందువల్ల ఈ 32.5 టిఎంసీల నీటిని కర్నాటక వినియోగించుకోవచ్చు.

## ప్రతిపాదిత ఎగువ సమాంతర కాల్వను నేడున్న తుంగభద్ర ఎగువ కాలువకు పై భాగాన నిర్మించాల్సిన అవసరం ఎందుకు?

ఇప్పుడున్న తుంగభద్ర ఎగువ కాలువ వ్యవస్థలో నీటిని నేరుగా తుంగభద్ర డ్యాం నుండి తీసుకుంటున్నారు..కాని ప్రతిపాదిత ఎగువ సమాంతర కాలువ వ్యవస్థలో తీసుకున్న నీటిని మొదట పెన్న ఆహోబిలం రిజర్వాయర్‌లో నిల్వ ఉంచుకోవాల్సి వుంటుంది. అదే సమయంలో కర్నాటక-ఆంధ్రప్రదేశ్ సరిహద్దు నుండి, పెన్న ఆహోబిలం రిజర్వాయర్ వరకు గల 25000-35000 ఎకరాలకు కొత్తగా సాగు నీరందించాల్సి వుంటుంది. దానికై, నేడున్న ఎగువకాలువ పైభాగం నుండి 3 టిఎంసీల నీరు తీసుకోవాల్సి వుంటుంది. ఆ నీటికి ఒక రిజర్వాయర్‌ను నిర్మించుకోవాలి. దానికి వాలు (గ్రావిటీ) ద్వారా నీరందించాలంటే ప్రతిపాదిత ఎగువ సమాంతర కాలువను నేడున్న ఎగువ కాలువ పైభాగాన త్రవ్వాలి.

ఆవిరి నష్టంతో సహా మొత్తం తీసుకోవాల్సిన నీరు 44 టిఎంసీలు

తుంగభద్రానదికి వరద రోజులు సుమారు 15 నుండి 20 రోజులు.

15 రోజులను వరద రోజులుగా పరిగణలోకి తీసుకుంటే ప్రతి పాదిత ఎగువ సమాంతర కాలువ సామర్థ్యం రోజుకు 44/15=2.33 టిఎంసీలు/3 టిఎంసీలు.

ఎగువ సమాంతర కాలువ చర్చ బ్రిజేష్ కుమార్ కమిటీ ముందుకు వచ్చింది. (సమస్య నెం.24). అయితే నిర్ణయం వ్యతిరేకంగా వుంది.

(సమస్య 24,పేజీలు 581-592)

"ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తనకు కేటాయించిన జలాలను పూర్తిగా వినియో గించుకొనుటకై కొత్తగా సమానాంతర కాలువను నిర్మించుకొనడానికి అనుమతి నిచ్చారా?" అనే ప్రశ్నకు, లేదని సమాధానమిస్తూ, దానికి ఈకింది కారణాలను తెల్పింది.

1. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించినట్టుగా పెన్నా బేసిన్‌లో నీటిని నిల్వచేయడంవల్ల కర్నాటక రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం ఉండదు.

దీనికి మన రాష్ట్రమిచ్చిన జవాబు,"తమఎగువ కాలువకు కేటాయించిన నీటిలో తక్కువయిననీటి వినియోగంకు మాత్రమేతమ ప్రతిపాదన" అనే జవాబు సరిపోదు

2. ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించినట్టుగా తుంగభద్ర డ్యాం నీరు పెన్నా బేసిన్ లోని కరువుపీడిత ప్రాంత అవసరాలకు ఉద్దేశించినది కాదు. ఈ అభిప్రాయం సరైనదే కాబట్టీ, అంగీకరించాల్సింది. కాని, సవరించిన వాదన మరియు నదుల అనుసంధానం పేరిట పై బ్రిజేష్ కమిటీ వాదనకు సరైన సమాధానమివ్వొచ్చు.

3.పూడికవల్ల తుంగభద్ర డ్యాం లో నీటి నిల్వ 57 టిఎంసీలు తగ్గిందని మన ప్రభుత్వం తెల్పితే దానికి కమిటీ పూడికవల్ల తగ్గినది కేవలం 28.13 టిఎంసీలు మాత్రమేనని మిగతా నీటి వినియోగం తగ్గడానికి యితర కారణాలుండవచ్చని అభిప్రాయపడింది.

మనకు తక్కువ నీరు రావడానికి ప్రధాన కారణం కర్నాటకలో అనధికార ఆయకట్టని మన ప్రభుత్వం గట్టిగా వాదించలేకపోయింది. (ఇందుకు కారణం ఆ అనధికార ఆయకట్టు దారులంతా ఆ ప్రాంతలాలో స్థిరపడ్డ కృష్ణా, గుంటూర్ జిల్లాలకు చెందిన వారు కావడం కావొచ్చు)

4. పూడిక అనేది అన్ని రిజర్వాయర్లలో సాధారణమే. అందులోనూ ఈ డ్యాంలో మొదట అంచనా వేసిన దానికి, యిప్పటి కనపడుతున్న పూడిక పరిమాణానికి పెద్ద తేడా లేదు. అవసరమైతే పూడిక ప్రభావాన్ని తగ్గించేందుకు వేరే మార్గాల అనుసరించాలిగాని, సమాంతర కాలువ జవాబుకాదు, అని బ్రిజేష్ కుమార్ కమిటీ అభిప్రాయపడింది. దానికి జవాబుగా ఈ విధంగా వివరణ యివ్వాల్సివుండింది.

డ్యాం నిర్మాణ సమయంలో, పూడిక తీతకై 1550 అడుగులు (472.40 మీటర్లు (మీసిల్ లెవల్ వద్ద) రెండు నదీ స్లూయిస్లు 6'×12' (1.83మీ×3.66మీ)గా నిర్మించారు. కాని నిర్వహణ సమస్యసల వల్ల, వాటిని మొదట అనుకున్నట్టుగా వినియోగించుకోలేక పోయారు.అంతేగాక వాటి పాత్ర పూడికతీతలో చాలా పరిమితమైనది. అవి బాగా పనిచేయాలంటే, ఋతుపవనాలకు ముందే, డ్యాం ముందు భాగంలో భూమి బాగా వదులయ్యేటట్టుగాదున్నాలి. అప్పుడే మొదటిసారి వరదలు వచ్చునప్పుడు ఆ పూడిక స్లూయిస్‌ల ద్వారా బయటికిపోతుంది. ఇది అలవికాని పని. అంతేగాక దీనికి ప్రవాహ దిగువ భాగనున్న వారు అభ్యంతరాలు తెల్పుతారు కూడా. ఇక పూడికను త్రవ్వి ఎత్తిపోసి వేరేచోటికి తరలించడం సాధ్యమ య్యేపని కాదు. అత్యంత ఖర్చుతో కూడినది కూడా.

5. సమాంతర కాలువ వల్ల కర్నాటకాకు ఒరిగే లబ్ధి ఏమిటి? ఆ రాష్ట్రం పూడిక వల్ల కోల్పోతున్న నీటిని ఎలా భర్తీ చేయగలరు? అని బ్రిజేష్ కుమార్ కమిటీ ప్రశ్నించింది. మన రాష్ట్రం వాటికి సరైన జవాబు లివ్వలేకపోయింది.

6. పూడిక వల్ల కోల్పోతున్న నీటిని భర్తీ చేసుకునెందుకు తాను సమాంతర కాలువను నిర్మించుకోవాలనుకున్నామని మన ప్రభుత్వం చెప్పింది. అయితే పూడిక వల్ల కోల్పోతున్న నీరు కేవలం 6 టిఎంసీలు మాత్రమేనని, దానికి 266 కి.మీ.ల పొడువునా కాలువ, అదీ 15–20 రోజుల్లో వినియోగ పడే కాలువను నిర్మించుకోవడం సమర్థనీయం కాదని బ్రిజేష్ కుమార్ కమిటీ అభిప్రాయం వ్యక్తం చేసింది.

అనంతపురం జిల్లాను కరువు కోరల నుండి కాపాడడానికి సమాంతర కాలువ నిర్మాణం తప్ప వేరే ప్రత్యామ్నాయం లేదని మన ప్రభుత్వం కమిటీకి నివేదించలేక పోయింది. తాగు, సాగు నీరందివ్వడమనేది ప్రభుత్వ బాధ్యత. వాటి తర్వాతే పరిశ్రమలకు ప్రాధాన్యత.. అంతేగాక, ఈ పథకానికి పూర్తి సామర్థ్యంతో కాలువ త్రవ్వాల్సింది మన రాష్ట సరిహద్దువరకే (150 కి.మీ) మాత్రమే. ఆ పైన అవసరం మేరకు దాన్ని పొడిగించుకోవచ్చు. కాలువ ఎంతమేరకు త్రవ్వాల్సి వస్తుందో పూర్తి క్షేత్రస్తాయి పరిశీలన ద్వారా తేలుతుంది.

7. మన ప్రభుత్వం వివరమైన ప్రాజెక్టు నివేదికను కమిటికి సమర్పిం చకపోవడమే సమాంతర కాలువ ప్రతిపాదనను కమిటీ తిరస్కరించడానికి మరొక

కారణం. ఏ పథకం మంజూరు చేయాలన్నా వివరమైన ప్రాజెక్టు నివేదిక(డిపిఆర్)ను అందించడం ప్రాథమిక అవసరం. అందువల్ల మన ప్రభుత్వం అందుబాటులోవున్న డేటాతో సుమారు అంచనానైనా కమిటీకి అర్పించవలసి వుండేది.

8. సమాంతర కాలువ కేవలం మన రాష్ట్ర అవసరాలకై మాత్రమే మనం ప్రతిపాదించామని, బ్రిజేష్ కుమార్ కమిటీ కర్నాటక రాష్ట్రం అభిప్రాయ బద్ధాయి. కనీసం ఆ దశలోనైనా సమాంతర కాలువ వల్ల ఉభయ రాష్ట్రాలు లబ్ధి పొందుతాయనే విషయాన్ని మన ప్రభుత్వం తెలిపి వుండాల్సివుంది.

9. 5 లేక 6 టిఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్లను సమాంతర కాలువద్వారా అనుసంధానం చేయడంవల్ల కర్నాటక రాష్ట్రంకు ఎంతో ప్రయోజన కరమని మన రాష్ట్రం తగిన రీతిలో వారికి చెప్పలేక పోయింది.

10. ఈ సమస్యపై యిరు రాష్ట్రాల మధ్య ఎలాంటి ఉపయోగకరమైన చర్చలు జరగలేదని బ్రిజేష్ కుమార్ కమిటీ అభిప్రాయపడింది.

11. జలాలను తుంగభద్ర డ్యాం కుడివైపునపూర్తి సిల్ స్థాయి 497 మీటర్ల స్థాయి నుండి ఎగువ సమాంతర కాలువకు తీసుకోవచ్చని తెల్పినా, నీటిని రిజర్వాయర్ నుండి సైఫన్ చేయాల్సివుంటుందని బ్రిజేష్ కుమార్ కమిటీ అభిప్రాయపడింది.

ఈ విషయం పై కింది విధంగా వివరణ యిచ్చివుండాల్సింది.

తుంగభద్ర రిజర్వాయర్ పూర్తి సిల్‌లెవెల్ +1633 అడుగులు / 497.70 మీ.

ఎగువ కాలువ హెడ్ రెగ్యులేటర్ సిల్ లెవెల్+1585 అడుగులు / 483.10మీ.

గేట్ల సైజు 6×12 అడుగులు / 1.8×3.66 మీ.

అందువల్ల పూర్తి సరఫరా లోతు (ఫుల్ సప్లై డెప్త్) 12 అడుగులు / 3.66 మీ.

ప్రారంభ స్థానంలో పూర్తి సరఫరా లోతు (ఫుల్ సప్లై డెప్త్)

483.10మీ +3.6 మీ.=486.70 మీ.

ఎగువనకాలువ సరఫరా సామర్థ్యం 4వేల క్యూసెక్కులుగా వుంటుంది.యిది సాధారణంగా విడుదల చేసే సామర్థ్యమే. అందువల్ల అవసరమైతే ఖర్చు

తగ్గించుకోనేందుకు కాలువ మరింత వాలుగా ఉండేలా చూడవచ్చు.

ఎగువ సమాంతర కాలువ సిల్ లెవెల్ (వరదకాలంలో నీటిని తీసుకొనేం దుకు) 497 మీ. దగ్గర ఏర్పాటు చేయాలి. తుంగభద్ర రిజర్వాయర్ పూర్తి సిల్‌లెవెల్ +1633 అడుగులు/497.70 మీ. కనుక సిల్ లెవెల్ పైభాగాన నీటి తోపుడు శక్తి 0.70 మీ. గా వుంటుంది.

సిల్ లెవెల్ మరియు దాని పరిమాణాన్ని(సైజు) దాని రూపకర్తలు నిర్ణయిం చాల్సి వుంటుంది. దానితో ఇప్పుడున్న కాలువల సరఫరాకు ఏమాత్రం ఆటంకం కలుగకుండా, ఎగువ కాలువ రిజర్వాయర్లను ఎంత ముందుగా సాధ్యమయితే అంత ముందుగా నింపవచ్చు.

ఎగువ సమాంతర కాలువ ద్వారా ఎక్కువ పరిమాణంలో నీటిని, రోజుకు దాదాపు 3 టిఎంసీల నీటిని తీసుకోవాలనుకుంటున్నాం కాబట్టి కాలువ సురక్షితంగా ఉండేందుకు అది సమతల ప్రదేశంలో ప్రవహించేలా చూడాలి. అలా ఈ ఎగువ సమాంతర కాలువ యిప్పటి ఎగువ కాలువ పైభాగాన పోతుంది కాబట్టి రెండు రాష్ట్రాలలో కొత్త ఆయకట్టుకు నీరందించ వచ్చు. అంతేగాక కొత్త ప్రాంతాలలో భూగర్భజలాలు పెరుగుతాయి కూడా. వాలు ద్వారా నీరు ప్రవహిస్తుంది కాబట్టి సైఫన్‌తో పనివుండదు.

12. కమీషన్ అభిప్రాయం ప్రకారం వరద కాలంలో కర్నాటక రాష్ట్ర సరిహద్దు లోపలి ప్రాంతం 89 కి.మీ. పరిధిలో సమాంతర కాలువ ద్వారా నీరు తీసుకోకపోయినా ఈ వరద జలాలు కాలువ గుండానో, లేక పొంగి పొర్లడం ద్వారానో ఆంధ్రప్రదేశ్‌లోనే పారుతాయి. కనుక సమాంతర కాలువ అవసరం లేదు.

పై దానికి ఈ విధంగా వివరణ యిచ్చివుండవచ్చు.

తుంగభద్ర రిజర్వాయర్ నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సరిహద్దు బావాపురం వరకు దూరం 105 కి.మీ. బావాపురం దగ్గర నది అడుగు భాగం(Bed Level) 315 మీ.అందువల్ల బావాపురం నుండి అనతపురం జిల్లాకు నదీ జలాల వినియోగించు కోవాలంటే ఎత్తిపోతల పథకం (150మీ.) అవసరమవుతుంది. అంతేగాక .....అనంతపూర్‌కు కొత్త కాలువల త్రవ్వాల్సి వుంటుంది. అందువల్ల ఖర్చు ఎక్కువ. దీనికంతా ప్రత్యామ్నాయమే ఎగువ సమాంతర కాలువ.

13. బ్రిజేష్ కుమార్ కమిటీ అభిప్రాయంలో ఇప్పటికే నిర్వహించ బడుతున్న ఏర్పాట్లపై ఎగువ సమాంతర కాలువ దుష్ప్రభావం చూపుతుంది.

తుంగభద్ర రిజర్వాయర్, దానికి సంబంధించిన కాలువలు పకడ్బందీగా ఏర్పాటు చేయబడడం నిజమే. కానీ, పూడిక మరియు అనధికార ఆయకట్టువల్ల దిగువ రాష్ట్రాల ప్రజలు నష్టపోతున్నారనే వాస్తవాన్ని గమనంలోకి తీసుకోవల్సి వుంటుంది. ఆ నష్టాన్ని ఎగువ సమాంతర కాలువ నిర్మాణం ద్వారా భర్తీ చేయాల్సి వుంది. లేకపోతే ప్రతి సంవత్సరం దిగువకు విడుదలయ్యే నీరు తగ్గుతూ తుంగభద్ర రిజర్వాయర్ వల్ల ఒనగూడే ప్రయోజనం తగ్గుతూ వస్తుంది. ఈ నష్టం కేవలం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలకే గాక కర్నాటకకు కూడా వుంటుంది. అందువల్లే సమాంతర కాలువ అవసరమని చెప్పక తప్పదు.

14. చర్చలో 24 అంశంగా కర్నాటక ప్రభుత్వం ఈ కింది వాదనను ముందుకు తెచ్చింది. అదేమిటంటే, తుంగభద్ర వరద నీరు 15/20 రోజులు ఉంటాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుకుంటుందని, కానీ అలా జరిగేది కేవలం తుంగభద్ర డ్యాం పైభాగాన తమ కొత్త ప్రాజక్టుల నిర్మాణం జరగనంత వరకేనని కమీషన్‌కు నివేదించింది. (పే 585)

కర్నాటక ప్రభుత్వ వాదన మనల్ని నిరుత్సాహ పరిచేదిగా వుంది. అంతేగాక తుంగభద్ర డ్యాం పైభాగాన కొత్త ప్రాజెక్టుల తాను  నిర్మించాలను కున్నట్టు కూడా పరోక్షంగా తెల్పింది. దీనికి మనం అభ్యంతరం చెప్పి తీరాలి. కర్నాటక ప్రభుత్వం మనకు వరదనీరు రాకుండా  తుంగభద్ర డ్యాం పైభాగాన కొత్త ప్రాజెక్టుల నిర్మిస్తే, దిగువ రాష్ట్రాలలో భూగర్భజలాలు అడుగంటి పోతాయి. అంతేగాక  అది పర్యావరణానికి, వాతావరణానికి తీవ్రనష్టం కల్గిస్తుంది. అందువల్ల మనం ఈ విషయాన్ని కమీషన్ దృష్టికి తెచ్చి ఎట్టి పరిస్థితులలోనూ తుంగభద్ర డ్యాం పైభాగాన కొత్త ప్రాజెక్టుల నిర్మాణం జరగకుండా చూడాలి. అదే విధంగా 27వ అంశంలో కర్నాటక ప్రభుత్వ కొత్త ప్రాజక్టులకు నీటి కేటాయింపులపై చర్చ జరిగింది.

" కర్నాటక ప్రభుత్వం ఇప్పటికే తనకు కేటాయించిన నీటికన్నా ఎక్కువ నీటిని వినియోగించుకొనిందా, అలా అయితే అది అప్పర్ తుంగ, సింగటూర్, బసాపూర్, సఫల్ వాడ స్టేజ్ 1&2, గుడ్డమల్లాపూర్ ఎత్తిపోతల, వరద, చెన్నూర్

బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, అప్పర్ భద్ర, లాక్స్ డ్యాం మరియు ఎత్తిపోతల పథకాలను తుంగభద్ర డ్యాం పైభాగాన కొత్త ప్రాజక్టులు నిర్మించుకొనే హక్కు వుందా?" అని కమీషన్ కర్నాటకాను ప్రశ్నించింది. దానికి, తాను నేడు వినియోగిస్తున్న నీటిలో కొంత అదాచేసుకొని, ఆ నీటిని కొత్త అవసరాలకు వాడుకుంటానని తెల్పింది.

( క్రింద ఉన్న టేబుల్ చూడండి)

| వ.నే. | ప్రాజెక్టు | కె.డబ్ల్యుడిటి నీటి వినియోగం (టిఎంసీలలో) | కె.డబ్ల్యుడిటి నీటి వినియోగం(2002) మాస్టర్‌ప్లాన్ (టిఎంసీలలో) | సేవింగ్స్ | పునరుత్పత్తి (టిఎంసీలలో) | మిగులు |
|---|---|---|---|---|---|---|
| 1. | తుంగభద్ర | 102.00 | 92 | ----- | ----- | 10 |
| 2. | విజయనగర కాలువలు | 12.06 | 12.05 | 0.01 | ------ | ----- |
| 3. | అంబిగోల | 1.40 | 1.10 | 0.30 | ------- | ----- |
| 4. | ధర్మా | 2.20 | 1.10 | 1.10 | ------- | ------ |
| 5. | కనకాల | 0.40 | 0.27 | 0.13 | ------ | ------ |
| 6. | చిన్నతరహా నీటిపారుదల | 59.11 | 35.58 | 23.53 | ------- | -------- |
| 7. | పునరుత్పత్తి | ----- | ------ | ------ | 12.03 | ------ |
| | మొత్తం | 177.17 | 142.10 | 25.07 | 12.03 | 10 |
| | | | | మొత్తం : 47.10 | | |

మొత్తం ఆదా అయ్యేవి. సేవింగ్స్ = 142.10టిఎంసీ

+పునరుత్పత్తి 12.03 టిఎంసీలు+10 మిగులు = 47.10టిఎంసీలు.

పే.530. తమ నూతన పథకాలకు పైన కనబరిచిన 47.10 టిఎంసీలు చాలని కర్నాటక ప్రభుత్వం చెప్పింది. బ్రిజేష్ కుమార్ కమీషన్ కూడా కర్నాటకలోని కొత్త పథకాలకు నీటి కొరత లేదని, అందువల్ల తుంగభద్ర నుండి కృష్ణ కు ప్రవహించే నీటిలో తగ్గుదల ఉండదని స్పష్టం చేసింది. అంతేగాక, బ్రిజేష్ కుమార్ కమిటీ తుంగభద్ర సబ్–బేసిన్లో నీటిప్రవాహాన్ని 1965–66 నుండి 2007–08 మధ్యకాలం లో 75% ఆధారితంగా కొత్తగా పరిశీలన జరిపింది. గతంలోకన్నా తుంగభద్రలో ఎక్కువగా లభ్యమవుతాయని, 488 టిఎంసీలని తేల్చి చెప్పింది.

**కృష్ణా జలాల వివాద ట్రిబ్యూనల్ !(బచావత్)**

**తుంగభద్ర జలాల కేటాయింపులు.**

**కర్నాటక 290 టిఎంసీలు**

**ఆంధ్రప్రదేశ్ 127 టిఎంసీలు**

వీటికి అదనంగా కృష్ణాజలాల వివాద ట్రిబ్యూనల్–2 (బ్రిజేష్) కర్నాటకాకు కొత్తగా కేటాయించినవి 40టిఎంసీలు. అంటే మొత్తం కేటాయింపులు 457 టిఎంసీలు కాగా, లభ్యత 488 టిఎంసీలు.. మిగులు 488 టిఎంసీలు–457 టిఎంసీలు = 31 టిఎంసీలు. తుంగభద్ర నుంచి కృష్ణకు ఇవ్వవలసిన నీరుకూడా 31 టిఎంసీలు మాత్రమే. అందువల్ల కొత్తగా కర్నాటకకు 40 టిఎంసీలు కేటాయించినా ఇబ్బందేమీ ఉండదన్నారు.

## తుంగభద్ర ప్రవాహ వివరాలలోకి వెళితే

1990–91 నుండి నేటివరకు 1995–96, 2001–02, 2002–03, 2003–04లలో మినహా ప్రతి సంవత్సరం తుంగభద్ర డ్యాం స్పిల్‌పై నుండి నీరు పొంగి పొర్లుతూనే వున్నాయి. అంతేగాక, ప్రతి సంవత్సరం తుంగభద్రకు దాదాపు 15/20 రోజులపాటు వరదలు వస్తూనే వున్నాయి.

పై వివరాల ఆధారంగా బ్రిజేష్ కుమార్ కమిటీకి ఎగువ సమాంతర కాలువ గురించి తిరిగి ప్రతిపాదన  సమర్పించాలి.

**పునః సమీక్షతో ప్రతిపాదన**

ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 32.5 టిఎంసీలు, ఆవిరి నష్టం 5.5 టిఎంసీలు మరియు కర్ణాటక పరిశ్రమలకు అవసరమంటున్న 6 టిఎంసీలు  మొత్తం 44 టిఎంసీలను ఖరీఫ్ ప్రారంభంలో (జూన్/జూలై), వరద కాలంలోనే తీసుకోవాలి. ఆ 44 టిఎంసీలను తీసుకున్నాక ఎగువ సమాంతర కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను మూసివేయవచ్చు. కేవలం పెద్ద వరదలు సంభవించి నప్పుడే, డ్యాం స్పిల్‌వే ద్వారా నీటిని విడుదల చేయాల్సిన అవసరం వచ్చినప్పుడు మాత్రమె ఎగువ సమాంతర కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను తెరచివుంచాలి. ఆ విధంగా కొంత వరద నీటిని పెన్నార్ బేసిన్‌కు వినియోగించాలి. అయితే నదీ ఒడ్డు ప్రాంతాల (Riparian) హక్కులను ఏమాత్రం భంగం కల్గించరాదు. అదే సమయంలో ఒకచుక్క నీటిని సముద్రంలో వృధా చేయరాదు.

పై విధంగా ఖరీఫ్ ప్రారంభంలో విడుదల చేసుకున్న నీటిని అనతపురం, కడప జిల్లాలలో వినియోగించుకోనేందుకు 30/35 టిఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్లను తగినన్ని నిర్మించుకోవాలి. ఖరీఫ్ రోజుల్లోనే తమకు కేటాయించిన మొత్తం నీటిని అంధ్రప్రదేశ్ పొందుతూంది కాబట్టి, ఆంధ్రప్రదేశ్ మరల ఇండెంట్ పెట్టి నీటిని పొందేందుకు హక్కును కోల్పోతుంది. దీంతో ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 32.5 టిఎంసీల నీరు డ్యాంలోనే వుంటుంది. కాబట్టి కర్నాటక  ప్రభుత్వం తమ ప్రాంతంలోని అనధికార, అధికార ఆయకట్టులకు వాటిని వినియోగించుకోవచ్చు. ఆ విధంగా కర్నాటక  రైతాంగమూ లబ్ధిపొందుతుంది. అదేసమయంలో కేసి కాలువ, తుంగభద్ర దిగువ కాలువ, ఆర్‌డిఎస్‌లకు కేటాయించిన నీటినిపూర్తిగా విడుదల చేసేందుకు తుంగభద్ర బోర్డ్‌కు అవకాశముంటుంది. వాటికి నిష్పత్తి మేరకు నీటిని విడుదల చేసే అవసరముండదు.

**తుంగభద్ర డ్యాం పైభాగాన కొత్త రిజర్వాయర్ల ప్రభావం**

తుంగభద్ర డ్యాం పూడిక నష్టాన్ని భర్తీ చేసుకొనేందుకై డ్యాం పై భాగాన

35 టిఎంసీల సామర్థ్యంతో కొత్త రిజర్వాయర్లను నిర్మించాలని కర్నాటక ప్రభుత్వం ఆతురత పడుతూంది. ఆవిరి మరియు ప్రవాహ నష్టాన్ని తీసివేస్తే కొత్త రిజర్వాయర్లలో నిల్వ వుండేది కేవలం 32.5 టిఎంసీలు మాత్రమే. అది తుంగభద్ర ఎగువ కాలువ కేటాయింపుకు సమానం. కాని ఆంధ్రప్రదేశ్ రైతాంగానికి కర్నాటక ప్రాంత అనదికారా ఆయకట్టు వల్ల జరుగుతున్న నష్టాన్ని ఈకొత్త రిజర్వాయర్లు పూడ్చలేవు. అవి కేవలం కర్నాటక ప్రాంతానికి వుపయోగ పడుతాయే. ఇక ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రైతాంగం మరిన్ని ఇబ్బందులకు గురికావాల్సి వస్తుంది.

## ఎగువ సమాంతర కాలువ నిర్మాణం

## కర్నాటక ప్రాంతం పొందే ప్రయోజనాలు.

ఎగువ సమాంతర కాలువ నిర్మాణం వల్ల పైన తెల్పినట్టుగా కర్నాటక ఒక్క నయాపైసా ఖర్చుచేయకుండా తమకు కావాల్సిన 32.5 టిఎంసీల నీటిని డ్యాం నిల్వచేసుకొని తమకవసరమున్నప్పుడు ఋతుపవనాల మరియు ఋతు పవనాలు లేనికాలంలో ఆ ప్రాంత అవసరాలకు వినియోగించుకోవచ్చు.

యిక్కడ గమనించాల్సిన విషయమేమంటే ఆంధ్రప్రదేశ్ తనకు ఇప్పటివరకు కేటాయింపబడ్డ 32.5 టిఎంసీల కేటాయింపులపై హక్కు కోల్పోతుంది. యిది భాదాకరమైన విషయమే. అయినా తప్పనిసరి. కాని, దీనివల్ల దశాబ్దాలుగా నష్టపోతున్న రాయలసీమకు మేలు జరుగుతుందనే విషయం మరువరాదు. దీన్ని మనం హక్కును కోల్పోయినట్టుగా భావించరాదు. ఈ ప్రతిపాదన రెండు రాష్ట్రాల మధ్య పరస్పర సర్దుబాటుగా పరిగణించాలి.

### చెన్నై తాగునీటి కేటాయింపులో కర్నాటక వాటా

కర్నాటక రాష్ట్రానికి తగినంత నీటిని కేటాయించిందని బ్రిజేష్ కమిటీ చెప్పింది.అందువల్ల  కర్నాటక చెన్నైకి తమవంతు వాటా అయిన 5 టిఎంసీలను తుంగభద్ర ఎగువ కాలువ ద్వారా అందించవచ్చు. ఈ 5 టిఎంసీలను అనతపురం జిల్లాలో వినియోగించుకోవచ్చు. కర్నాటక ప్రభుత్వం తమ ప్రాంతంలో ఎగువ సమాంతర కాలువను త్రవ్వడానికి అనుమతించాలి. నీటిని ఋతుపవనాల ప్రారంభం నుండి

విడుదల చేయాలి. తుంగభద్ర డ్యాం స్పిల్ వే నుండి వరద ప్రవాహపునీరు వృధా కాకుండా దానిలో కొంత పరి మాణం ఎగువ సమాంతర కాలువ ద్వారా అనంతపురం, కడప, చిత్తూర్ జిల్లాలు వినియోగించుకునెందుకు అనుమతించాలి. అనంతపూర్ జిల్లాకు తగినంత నీరు లభ్యమయినపుడు కే.సి కాలువనుండి ఈ జిల్లాకు కేటాయించిన నీరు 10 టిఎంసీలను నిలిపివేసి వాటిని కర్నూల్, కడప జిల్లాల ఆయకట్టుకు తరలించవచ్చు.

**చిత్తూర్ జిల్లాకు ప్రయోజనాలు**

చిత్తూర్ జిల్లాకు ఎగువ సమాంతర కాలువనుండి కొంతమేరకు నీరందించ వచ్చు. కాబట్టి హంద్రీ–నీవా ఎత్తిపోతల పథకంపై కొంత భారం తగ్గించవచ్చు. ఎగువ సమాంతర కాలువను హంద్రీనీవ కాలువకు అనుసంధా నించి చిత్తూర్‌జిల్లా ఆయకట్టును స్థిరీకరించవచ్చు. యిలా రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం వల్ల అన్ని ప్రాంతాలు లబ్ధి చెందుతాయి.

**శ్రీశైలం రిజర్వాయర్‌కు రక్షణ**

2009 సం.లో కృష్ణా నదిలో గతంలో ఎన్నడూ చూడనంతగా వరద లొచ్చాయి. శ్రీశైలం డ్యాం స్పిల్ వే సామర్థ్యం 13.5 లక్షల క్యూసెక్కులు కాగా, వచ్చిన వరద నీటి పరిమాణం 25.55 లక్షల క్యూసెక్కులుగా నమోదయింది. అయినా ఆ డ్యాం సురక్షింగా ఉన్నందుకు దాన్ని నిర్మించిన ఇంజనీర్లకు కృతజ్ఞతలు తెలపాలి.

పై సందర్భంలో రాష్ట్ర మరియు కేంద్ర అధికారులు శ్రీశైలం డ్యాంను పరిశీలించి, భవిష్యత్తులో భారీ వరదల వల్ల డ్యాం దెబ్బతినకుండా శ్రీశైలం డ్యాంలోకి వరద కాలం వచ్చేనీటిని మరలించేందుకు అనువైన స్థలాలలో జలాశయాల నిర్మించడం ద్వారా డ్యాంపై వరద ఒత్తిడిని తగ్గించాలని సూచించారు.

శ్రీశైలం డ్యాంలోకి తుంగభద్ర వరదనీరు చేరకుండా వరద సమ యంలో ఆ నీటిని దాదాపు 45000 నుండి 50000 క్యూసెక్కుల జలాలను ఎగువ సమాంతర కాలువకు తరలించవచ్చు. ఆ విధంగా తుంగభద్ర–పెన్నా అనుసంధానం, అంటే తుంగభద్ర ఎగువ సమాంతర కాలువ శ్రీశైలం డ్యాంపై వరద ఒత్తిడిని తగ్గిస్తుంది.

**తుంగభద్రా డ్యాం పరిరక్షణ**

తుంగభద్రా డ్యాం పరిరక్షణ కమిటీ డ్యాంను పరిశీలించి, తుంగభద్రా నది వరదలను పునఃసమీక్షించాక, గతంలో సంభవించిన అత్యధిక వరదనీటి (Past Maximum Flood) పరిమాణపు స్థాయిని తట్టుకోగల స్థాయిలో తుంగభద్ర డ్యాం మరియు జలాశయం లేవని తెల్పుతూ, అలాంటి సందర్భంలో నీటి పునరావాసానికి (Hydrological redistrbution) ఈ సూచనలచేసింది.

1.కొత్త స్పిల్ వే (ప్రవాహ మార్గం) ఏర్పాటుకై తగిన స్థలాల గుర్తించి స్పిల్ వే (ప్రవాహ మార్గపు)సామర్థ్యాన్ని పెంచాలి.

2. ఇప్పుడు పూర్తి రిజర్వాయర్ స్థాయి మరియు కనీస నీటి మట్టపు స్థాయిలు ఒకే విధంగా వున్నాయి. కనీస నీటి మట్టపు స్థాయిని 499.70 మీ.లకు పెంచడం ద్వారా గతంలో సంభవించిన అత్యధిక వరదనీటి ( Past Maximum Flood) పరిమాణపు స్థాయిని నియంత్రించవచ్చు. నేటి ప్రత్యేక పరిస్థితులలో డ్యాం ఎత్తును 4.82 మీ.పెంచాలి. గేట్లను ఆధునీకరించాలి.

అందువల్ల తుంగభద్రా డ్యాం పరిరక్షణ కమిటీ సూచనల మేరకు అత్యధిక వరదనీటి ప్రమాదాన్ని తప్పుకునేందుకు డ్యాం ఎత్తునైనా పెంచాలి లేక కొత్త స్పిల్ వే (ప్రవాహ మార్గం)లనన్నా నిర్మించు కోవాలి. అయితే బ్రిజేష్ కుమార్ కమిటీ డ్యాం ఎత్తును పెంచేందుకు అంగీకరించలేదు. కనుక కొత్త స్పిల్ వే (ప్రవాహ మార్గం) నిర్మాణమే తుంగభద్రా డ్యాం పరిరక్షణకు మిగిలిన ఏకైక పరిష్కారం.

మనం ప్రతిపాదిస్తున్న 50,000 క్యూసెక్కుల సామర్థ్యం గల ఎగువ సమాంతర కాలువ, కొత్త స్పిల్ వే (ప్రవాహ మార్గం)లో భాగంగా పనిచేస్తూ వరద నీటిని పెన్నార్ బేసిన్ కు తరలిస్తుంది.ఆ విధంగా ఎగువ సమాంతర కాలువ నిర్మాణం అటు శ్రీశైలం డ్యాంను ఇటు తుంగభద్ర డ్యాంను వరదల బారినుండి రక్షించడమేగాక కరువు ప్రాంతమైన అనంతపూర్ జిల్లాకు జలనిదిగా రూపొందుతుంది.

**నౌకాయానం**

ప్రతిపాదించిన ఎగువ సమాంతర కాలువ యొక్క పూర్తి ప్రవాహపులోతు (Full Supply Depth) మరియు వెడల్పు 5 మీ.మరియు 35 మీ.లుగా వుంటుంది

కాబట్టి ఆ కాలువను నౌకాయానంకు వినియోగించి సరుకుల రవాణ ఖర్చును తగ్గించుకోవచ్చు.

**వర్షపులేమి సం.ల కాలంలో.**

వర్షాలు తక్కువుగా వున్న సంవత్సరాలలో యిప్పటిలాగే, నేడున్న ఎగువ కాలువ ద్వారా నీటి నిల్వ138 టిఎంసీలుగా పరిగణిస్తూ, నిష్పత్తి ప్రకారం నీటిని విడుదల చేసుకోవాలి. (క్రింది టేబుల్‌ను చూడండి)

**కృష్ణా జలాల వివాద ట్రిబ్యూనల్ కేటాయింపులు**

| | |
|---|---|
| కర్నాటక | 138.99 |
| ఆంధ్రప్రదేశ్ | 66.50 |
| + తెలంగాణా | 06.51టిఎంసీలు |
| మొత్తం | = 212.00 టిఎంసీలు |

**నిష్పత్తుల ప్రకారం**

| | |
|---|---|
| కర్నాటక | 90.474 |
| +అంధ్రప్రదేశ్ | 43.288 |
| + తెలంగాణా | 4.238 టిఎంసీలు |
| మొత్తం= | 138 టిఎంసీలు |

తేడా 212.00 టిఎంసీ – 138 టిఎంసీ = 74టిఎంసీలు.

దీన్ని 75% ఆధారిత కేటాయింపులతో పోలిస్తే

74/212.00×100+ 34.9% / 35%

**క్యారీ ఓవర్ రిజర్వాయర్ల అవసరాలు**

తన నివేదిక (323 & 324 పేజీల)లో రైతాంగానికి నాలుగు సంవత్సరాలలో, రెండు సంవత్సరాలపాటు తగినంత సాగునీరు అందివ్వ కుండా వుంచడం మంచిదికాదని బ్రిజేష్ కమిటీ, అభిప్రాయం వెలిబుచ్చింది. అందువల్ల

భారీగా వర్షాలు పడిన సంవత్సరాలలో అధికంగా లభ్యమయ్యే నీటిని నిలవచేసు కోవాలని, దానికి క్యారీఓవర్  రిజర్వాయర్ల నిర్మించుకోవాలని సలహానిచ్చింది. కరువుపీడిత ప్రాంతాలలో 50% ఆధారిత కేటాయింపులు జరిపినప్పటికీ కమిటీ క్యారీ ఓవర్ రిజర్వాయర్ల నిర్మాణపు అవసరమని తెలిపింది.

అయితే రాయలసీమలో 75% ఆధారిత కేటాయింపులలో కూడా ఏనాడు రైతులకు పూర్తిగా కేటాయించిన నీరూ అందలేదు. సగటున 35% నీరు తగ్గుతూ వస్తూంది. ఈనేపథ్యంలో రైతుల పరిస్థితి దుర్భరంగా వుంటుంది. అందువల్ల పూడిక సమస్యకు తక్షణ శాశ్వత పరిష్కారం కనుగొని సీమ రైతాం గానికి కేటాయించిన మొత్తం నీరు అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వా నికుంది. తుంగభద్ర వరద జలాలను పెన్నాబెసిన్‌కు తరలించకుండా సీమ ప్రజల్ని కరువు నుంచి కాపాడలేము.

## ఎగువ సమాంతర కాలువకు అనుమతిపొందే అవకాశాలు

ఎగువ సమాంతర కాలువ ప్రతిపాదన విన్నాక కర్నాటక ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదన నీటి ప్రతిపాదనేకాదని వాదించింది. అయితే బ్రిజేష్ కుమార్ కమిటీ కర్నాటక ప్రభుత్వ వాదనను తోసి పుచ్చింది.

యిప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం "కర్నాటక, , ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల ప్రజలు పూడికవల్ల కోల్పోయిన తుంగభద్ర జలాలను పొందేందుకు, తుంగభద్ర రిజర్వాయర్ ముందుభాగాన, నేటి ఎగువకాలువ పైభాగాన ఎగువ సమాంతర కాలువ నిర్మాణానికి అనుమతిస్తారా? లేదా" అనే వాదనను కర్నాటక ప్రభుత్వం ముందువుంచాలి. తమకు పైసా ఖర్చు కాకుండా లబ్ధి జరుగుతుంది కాబట్టి కర్నాటక ప్రభుత్వం అంగీకరిస్తుందిని చెప్పవచ్చు.

**ముగింపు :**ఎగువ కాలువ ఆయకట్టు తుంగభద్ర,పెన్నా నదుల పరీవాహక ప్రాంతంలో ఉంది. తుంగభద్రా నదిలో తగినంత నీరు లభిస్తూంది. పెన్నా ఎండిపోయింది. పెన్నానదీ పరీవాహక ప్రాంతం ప్రజలను కరువు బారినుండి కాపాడాలంటే తుంగభద్ర జలాలను ఎగువ సమాంతర కాలువ ద్వారా పెన్నా బేసిన్‌కు మరలించక తప్పదు. అందువల్ల సంబంధిత మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు పరస్పర సహకారంతో ఎగువ సమాంతర కాలువ నిర్మాణానికి అంగీకరించి రాయల సీమలో రైతుల ఆత్మహత్యలు

| వ.నం. | కాలువ | కేటాయించినది టిఎంసీలలో | నేటి విడుదల టిఎంసీలలో | వాఖ్యానం |
|---|---|---|---|---|
| 1. | తుంగభద్ర కుడిఎగువ కాలువ (కర్నాటక) | 17.5 | 10.977 | అనంతపురం జిల్లా గత 139 సం.లలో 69 సం.లు కరువుకు గురయినది. |
| 2. | తుంగభద్ర కుడిఎగువ కాలువ(అం.ప్ర) | 32.5 | 21.156 | |
| 3. | తుంగభద్ర కుడి దిగువ కాలువ (కర్నాటక) | 19.00 | 11.918 | |
| 4. | తుంగభద్ర కుడి దిగువ కాలువ(అం.ప్ర) | 29.50 | 15.623 | |
| 5. | తుంగభద్ర ఎడమ దిగువ కాలువ (కర్నాటక) | 93.00 | 58.336 | |
| 6 | కే.సి.కాలువ | 10.00 | 06.509 | |
| 7. | ఆర్ డి ఎస్ ంవాని విలాస్ (కర్నాటక) | 02.49 | 01.562 | |
| 8. | ఆర్ డి ఎస్(తెలంగాణా) | 06.51 | 04.238 | |
| 9. | రాయబసంన కాలువలు (కర్నాటక) | 07.00 | 04.391 | |
| 10. | ఎత్తిపోతల పథకాలు | ------ | 02.00 | |
| 11. | M/ JUSLలకు నీళ్ళు. | ------ | 01.290 | |
| | మొత్తం | 212.00 | 138.00 | |

ఆపేందుకు కృషి చేయాలి. అంతేగాక ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వమే చేపట్టడం ద్వార తక్కువ కాలంలోనే పూర్తిచేసే అవకాశం వుంటుంది. ఈ కాలువ ద్వారా తరచు కరువులకు గురయ్యే రాయలసీమ నాలుగు జిల్లాల ప్రజలేగాక , మహబూబ్ నగర్ జిల్లాకు, కొంతమేరకు బళ్లారి జిల్లా ప్రజలకు మేలు చేకూరుస్తుంది,

ఈ ఎగువ సమాంతర కాలువకు శ్రీకృష్ణదేవరాయల కాలువ అని నామకరణం చేస్తే సముచింగా వుంటుంది

**( విశ్రాంత ఇంజినీర్ ఎం.సుబ్బారాయుడిగారి**

**ప్రతిపాదనకు అరుణ్ వ్యాసరూపం)**

# గుండ్రేవుల వర్సెస్ ముచ్చుమర్రి

**- ఎం.సుబ్బరాయుడు**

**రాయలసీమను** ప్రతి ఏటా కరువు కాటేస్తోంది, కళ్ళ ముందే ప్రవ హిస్తున్న కృష్ణా, తుంగభద్ర నదుల నీళ్ళు దిగువ ప్రాంత పొలాలను తడిపి రాయలసీమ రైతుల కళ్ళల్లో కన్నీళ్ళు తెప్పిస్తున్నాయి. దిగువకు భారీగా తరలిపోతున్న జలాలకు ఆనకట్టలు వేసే అవకాశాలున్నా, మనలో చైతన్యం లేకపోవడం మనకు కష్టాలు, పక్కవారికి భారీగా లాభాలు తెచ్చి పెడుతోందని వాపోతున్నారు. నీరు ప్రాణాధారం అని తెలిసినా రాయలసీమ ప్రజలు కరువుకు తల వంచుతున్నారు. నీళ్ళు లేక నోళ్ళు తెరచి బీళ్ళవు తున్న మట్టి తల్లిని, నమ్ముకున్న మూగజీవులను కబేళాలకు తరలించేందుకు సిద్ధపడి వలసపోతున్నారు. నీళ్ళపై బచావత్, బ్రిజేష్ ట్రైబ్యునళ్ళు ఇచ్చిన హక్కును నీటి మీద రాతలు చేస్తున్నా ఏమి చేయలేక సతమతమవుతున్నాడు రైతన్న. హక్కుగా కేటాయించబడ్డ జలాలను నిల్వ చేసుకునేందుకు అవసరమైన రిజర్వాయర్లు ప్రభుత్వం ఎందుకు నిర్మించలేక పోతున్నారని తనలో తాను నీరసిస్తున్నాడు. నిస్పృహలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నాడు. తనను నమ్ముకున్న కుటుంబాలను దిక్కూమొక్కూ లేనివిగా చేసి తన దారి తాను చూసుకుంటున్నాడు. ఎంతకాలం ఇలా ఉండాలి. అందినట్లు అంది, అందకుండాపోతున్న గుండ్రేవుల రిజర్వాయర్ సాధనకు చేయిచేయి కలపాలని అప్పుడే మన పంట పొలాలకు నీళ్ళు వస్తాయి. మన కష్టాలు గట్టెక్కుతాయి అని రైతన్నలు దృఢ సంకల్పంతో ముందుకు అడుగు వేస్తున్నారు.

మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌లోని వర్షపాతం, నేల స్వభావం, నీటి అవసరాలు మొదలగు అనేక విషయాలను పరిశీలించి, క్రిష్ణా బేసిన్‌లో నికరజలాలను, 75% అధారితంగా 2060 టిఎంసిలుగా నిర్ణయించి సెప్టెంబరు 1960 వరకు నిర్మించిన, నిర్మాణంలోనున్న ప్రాజెక్టులకు ప్రాధాన్యతనిచ్చి, మహారాష్ట్రకు 560, కర్నాటకకు 700, ఆంధ్రప్రదేశ్‌కు 800 టిఎంసీలను 1976లో బచావత్ కమిషను కేటా యించింది. మిగులు జలాలను కూడా హక్కులేకుండా చివరి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ వాడుకోవచ్చని తెల్పింది. 75% అధారితంగా అంటే నూరు సంవత్స రాలలో 74 సంవత్సరాలు గణించిన దాని కంటే ఎక్కువగాను, ఒక సంవత్సరం గణించిన దానికి

సమానంగాను, మిగతా 25 సంవత్సరాలలో గణించిన దానికంటే తక్కువగా ఉంటుంది. నీటి లభ్యత తక్కువగా నున్న 25 సంవత్సరాలలో రైతులు రిజర్వాయరు కట్టుకోమని సలహా ఇచ్చింది బచావత్ కమిషన్. వారి మాటలలోనే..

" We consider that the farmer should be assured of getting the designed supply of 75 % of the years and the existing practice of planning irrigation scchemes on the basis of 75 % dependability shoud continue"

" In our opinion in the Krishna Basin, the genuine demands for irrigation are out stripping the supplies and a serious attempts should be made on storages wherever possible.

The more precious the water in an area as in drought areas the greater is the justification for providing carryover"

75% అధారిత కంటే 50% ఆధారితంగా గణించినప్పుడు నీటి లభ్యత ఎక్కువగా ఉంటుంది. రాష్ట్రాలకు ఎక్కువ కేటాయింపులు జరుగుతాయి. 50% ఆధారితంగా నీటి కేటాయింపులు జరిగినప్పటికీ క్యారీఓవర్ రిజర్వాయర్లు కట్టుకోమని బ్రిజేష్ కుమార్ కమిషన్ సలహా ఇచ్చింది.

తొలకరి వానలు ఆలస్యమయితే సకాలంలో నాట్లు వేసుకోవడానికి క్యారీ ఓవర్ రిజర్వాయర్లు అవసరం. ప్రతి సంవత్సరం రిజర్వాయర్లలోని నీటినిల్వను మరియు నదిలోరాబోవు లభ్యతను దృష్టిలో ఉంచుకొని ఏ పంటలు వేసుకోవాలో రైతులకు ఖరీఫ్ ప్రారంభంలోనే ప్రభుత్వం తెల్పాలని కూడా సలహా ఇచ్చింది కమిషన్. అసలు రిజర్వాయర్లే కట్టకపోతే, రైతులకు ప్రభుత్వం ఏమి సలహా ఇవ్వగలదు. రాయలసీమలోని కర్నూలు, కడప జిల్లాలకు, తెలంగాణలోని మహ బూబ్‌నగర్ జిల్లాకు కెసిసి, ఆర్డీఎస్ పథకాలే ఆధారం. బచావత్ కమిషను పై ప్రాజెక్టులకు నికర జలాలను కేటాయించి నప్పుడు కె.సి. కెనాల్‌కు 10టిఎంసిలు, ఆర్డీఎస్‌కు 5.9 టిఎంసీలు తుంగభద్ర డ్యాము నుండి రెగ్యులేటెడ్ వాటర్‌గాను, మిగిలిన 29.9 టిఎంసీలు కెసిసికి 10 టిఎంసీలు ఆర్డీఎస్‌కు తుంగభద్రనది ప్రవాహం నుండి తీసుకో వాలని ఆదేశించింది. తుంగభద్ర డ్యాము నిల్వ సామర్థ్యం తగినంత లేనందున అలా జరిగింది.

బచావత్ కమిషను సలహా ప్రకారం కె.సి.సి.కి 29.9 టిఎంసీ లు లేదా

అంతకంటే ఎక్కువ నీటిని నిల్వ చేసుకునేందుకు క్యారీఓవరు రిజర్వాయర్లును కట్టుకోవలసి ఉంది. అలానే ఆర్డీఎస్‌కు కేటాయించిన 10.0 టిఎంసీలు లేదా అంతకంటే ఎక్కువ నీటిని నిల్వ చేసుకొనేలా రిజర్వాయర్లు కట్టుకోవచ్చు.

కానీ, కెసి కెనాల్ వాటానీటిలో తుంగభద్రపైన 1.2 టిఎంసీల సామర్థ్యంతోను, ఆయకట్టు ప్రాంతంలో అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు 2.985 టిఎంసిల సామర్థ్యంతోను, నిర్మాణాలు జరిగాయి. ఆర్డీఎస్ వియర్(అలుగు) కేవలం డైవర్షన్‌ను కట్టడం జరిగింది. ఇక్కడ ఆర్డీఎస్ సామర్థ్యము అతితక్కువ లెక్కలోకి తీసుకో వలసినంత లేదు. కె.సి.సి. మోడ్రనైజేషన్ చేస్తే లభించే 8 టిఎంసీలను, యస్.ఆర్. బి.సి.కి కేటాయించినా ఆర్టీఎస్‌కు కేటాయించిన 10 టిఎంసీలు కలుపుకొని (29.9-1.2-2.985-8+10-27.715) మిగిలి పోయిన 27.715 టిఎంసీల నీటిని రిజర్వు చేసుకునేందుకు రిజర్వాయర్లు కట్టుకోవలసిన అవసరం, రైతులను అన్ని వేళలా కాపాడ వలసిన బాధ్యత కమిషను సూచనల ప్రకారం ప్రభుత్వానిదే కదా.

ఈ నీటిని నిల్వ చేసుకునేందుకు వీలుగా కర్నూలు జిల్లాలో గుండ్రేవుల దగ్గర 20 టిఎంసీల సామర్థ్యంతో ఒక రిజర్వాయర్ నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి గారికి ప్రస్తుత రాజ్యసభ్యులు టి.జి.వెంకటేష్, మాజీ మంత్రివర్యులు ఏరాసు ప్రతాప్ రెడ్డిగార్ల ద్వారా 2011, మే నెలలో నివేదిక సమర్పించగా, సమగ్ర సర్వేకు ఆదేశాలిచ్చారు. 2013లో ఇందుకు సంబంధించి నిర్వహించిన సమగ్ర సర్వేలో 20 టిఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మిస్తే, దీనివల్ల కర్ణాటక రాష్ట్రంలోని గ్రామాలు, కట్టడాలు ఏవీ మునకకు గురికావని తేల్చిచెప్పారు. డి.పి.ఆర్. (డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు) అంచనా రూ.2400 కోట్లుగా నిర్ణయించారు. గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణం కారణంగా కర్ణాటక రాష్ట్రంలో భూగర్భ జలాలు పెరుగుతాయి.

అయితే వారి రాష్ట్ర భూభాగంలోనిపొలాలు, కట్టడాలు మునక క్రిందకు వస్తుందని ఈ రిజర్వాయర్ నిర్మాణానికి కర్ణాటక ప్రభుత్వం అడ్డు చెప్పింది. రిజర్వాయర్ నిర్మాణం కారణంగా ఆ రాష్ట్రానికి ఎలాంటి నష్టం లేకపోగా, లాభం ఉన్న అంశాన్ని వారికి తెలియ జేయాలి. డి.పి.ఆర్.ని అందజేయాలి అప్పుడు వారినుండి ఎలాంటి అడ్డంకులురావు. ఈ విషయంగా మన రాష్ట్రప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ, వాటర్ రీసోర్సస్‌గార్కి తగు వివరాలతో 02.12.2015న లేఖ సమర్పించాను.

ఇక మూడేళ్ళ క్రితం విడిపోయి ఏర్పడిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు

తుంగభద్ర నదిలో సగం హక్కుంది. గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణం కారణంగా రెండు రాష్ట్రాల్లోనూ కొన్ని గ్రామాలు, పొలాలు మునకకు గురవుతాయి. 2009లో తుంగభద్రలో వచ్చిన వరదలవల్ల, పైగ్రామాలు, పొలాలు చాలావరకు వరదకు గురి అయినవే. ఈవిషయం తెలంగాణ రాజకీయనాయకులు, రైతులతో నేను స్వయంగా చర్చించాను. గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణానికి వారి నుండి ఎలాంటి అడ్డంకులురావు. వారు సుముఖంగాఉన్నారు. అయితే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్ళకపోవడంపైనే వారు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్మాణం కారణంగా తెలంగాణకు కూడా లాభం చేకూరుతుందని ఆర్డీఎస్‌కు ఇదే శాశ్వత పరిష్కారమని వారు విశ్వసిస్తున్నారు. ఇరు రాష్ట్రాలు ఒకరినొకరు సహకరించుకొంటే తప్ప తుంగభద్రపై రిజర్వాయరు కట్టడం ఏ ప్రభుత్వానికైనా అసాధ్యం. రాయలసీమ రైతన్నల బాగుకోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముందడుగు వేయవలసిన అవసరముంది. ప్రభుత్వం చొరవ చూపాలి.

బచావత్ కమిషన్ నిర్ణయించిన మేరకు తుంగభద్ర నది నుండి కృష్ణా నదికి ఇవ్వాల్సింది కేవలం 31.45 టిఎంసీలు మాత్రమే. అయితే ప్రతి సంవత్సరం తుంగభద్ర నది నుండి వందలాది టిఎంసీల నీటిని ఇస్తున్నాం. 2004-05 సంవత్సరం నుండి 2013-14 వరకు లెక్కలు చూస్తే సగటున ప్రతి ఏటా సుమారు 240 టిఎంసీల తుంగభద్ర నదీ జలాలు కృష్ణానదిలో కలుస్తున్నాయి. వీటిని నిల్వ చేసుకునే హక్కు మనకు, తెలంగాణ వారికి ఉంది. గుండ్రేవుల వద్ద రిజర్వాయర్ నిర్మాణం కారణంగా ఆర్డీఎస్, కెసి కెనాల్‌కు జలాలు పుష్కలంగా అందే అవకాశం ఉండడంతో తెలంగాణ రాష్ట్రం దానికయ్యే రు.2400 కోట్లతో సగం భరించేందుకు వెనుకాడదు.

గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణాన్ని వెంటనే ప్రారంభిస్తామని రాష్ట్రం విడిపోయిన తరువాత వచ్చిన తొలి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను (15.08.2004) కర్నూలులో నిర్వహించిన సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారు హామీ ఇచ్చారు. దీంతో రాయలసీమ వాసులు ఊపిరి పీల్చుకున్నారు. కానీ ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించిన సమయంలో (02.01.2017) ఇదే ముఖ్యమంత్రి ఈ ఎత్తిపోతలతోనే రాయలసీమ సస్యశ్యామల మవుతుందని, గుండ్రేవుల ఆవశ్యకతను పరిశీలిస్తున్నా మని చేసిన ప్రకటన మన గుండెల్లో అనుమానాన్ని రేకెత్తించింది.

భయం పుట్టించింది. ఆ అనుమానం భయం ఇప్పుడు బలంగా మారుతోంది. రిజర్వాయరును సాధించుకోవాలనే పట్టుదలను పెంచుతోంది. శ్రీశైలం ఫోర్ షోర్ నుండి కర్నూలు- కడప కాలువ 81.8 కిలోమీటరుకు అక్కడి నుంచి 0 కిలోమీటర్ వరకు ఎగువకు నీటిని, కర్నూలుజిల్లా నందికొట్కూరు మండలం, ముచ్చుమర్రి ఎత్తి పోతల నుండి ఎత్తిపోసే దిశగా పనులు జరుగుతున్నాయి. గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణం పూర్తిచేస్తే సులభంగా గ్రావిటీ మీద కెసి కెనాల్‌కు నీటినిచ్చే అవకాశాలున్నా, ముచ్చుమర్రి నుండి ప్రవాహానికి అభిముఖంగా నీటిని పంపింగ్ చేయాలని నిర్ణయించ డంలో ఉన్న ఔచిత్యం ఏమిటో కెసి కెనాల్ రైతాంగానికి అర్థంకావడంలేదు. గుండ్రేవుల రిజర్వాయర్‌ను ఆలస్యం చేయడం ఎందుకన్న ప్రశ్నకు తుంగభద్ర నది నుండి కృష్ణకు ఏఅడ్డంకి లేకుండా కేటాయించిన దానికంటే భారీగా నీటిని తీసుకెళ్ళడమే ఉద్దేశ్యంగా కనిపిస్తోంది. ముచ్చుమర్రి నుండి ప్రవాహానికి అభిముఖంగా నీటిని ఎత్తిపోసేందుకు మూడు రెగ్యులేటర్లు నిర్మించాల్సి ఉండగా, ముచ్చుమర్రి పథకం ముగింపు దశకు చేరింది. ఫోర్ షోర్ నుండి తవ్వే అప్రోచ్ ఛానల్ పనులు జరుగుతున్నాయి.

ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టింది. శ్రీశైలం రిజర్వాయర్ ఫోర్‌షోర్ ఏరియా నుండి 5 టిఎంసీలను కె.సి.సి. 81.8 కిలోమీటరుకు ఎత్తిపోసి అందులో ఒక టి.ఎం.సి. నీళ్ళు సుంకేసుల రిజర్వాయర్‌కు మళ్ళించి 0 నుండి 120 కిలోమీటర్ల మధ్యన ఉన్న 7,350 ఎకరాలకు సాగునీరు అందిస్తామని ప్రభుత్వం జీవోలో ప్రకటించింది. శ్రీశైలంలో నీటి మట్టం 790 అడుగుల వరకు కూడా ముచ్చుమర్రి ద్వారా నీటిని మళ్ళించ వచ్చని చెబుతున్నా అవి తుంగభద్ర నికర జలాలా? కృష్ణా నికర జలాలా? వరద జలాలా? అన్నది డి.పి.ఆర్.లో ప్రభుత్వం స్పష్టం చేయక పోవడంపై అనుమానాలున్నా, 790 అడుగుల నుండి ఎత్తి పోస్తున్న కారణంగా అవి నికరజలాలేనని భావించాల్సి వస్తుంది.

బచావత్ కమిషన్ కృష్ణా బేసిన్‌ను 12 సబ్‌బేసిన్లుగా విభజించి శ్రీశైలం రిజర్వాయర్, దిగువన కృష్ణానదిని కె-7 సబ్‌బేసిన్‌గా, తుంగభద్ర నదిని కె-8 సబ్ బేసిన్‌గా పరిగణించింది. కె-7 నుండి కె-8కు సాగు నీటిని ఎత్తిపోసేందుకు కృష్ణా మేనేజ్‌మెంట్ బోర్డుకు డిపిఆర్‌ను సమర్పిస్తే అనుమతి వస్తుందా అన్నది అనుమానమే. ముచ్చుమర్రి నుంచి కె-8కు మళ్ళించేందుకు తీసుకుంటున్న చర్యలను

కె–7 పరిధిలోకి వచ్చే తెలంగాణా, కోస్తా ప్రజల నుండి వ్యతిరేకత వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. దీన్ని ప్రభుత్వం పరిగణలోకి తీసుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అంతేకాదు ముచ్చుమర్రి ఎత్తిపోతల కేవలం 15 సంవత్సరాలు మాత్రమే పని చేస్తుందంటున్న ప్రభుత్వం ఆ తర్వాత కె.సి. కెనాల్ ఆయకట్టు పరిస్థితి ఏమిటి, ఇప్పుడు చేపట్టే ఎత్తిపోతల పంపులను తిరిగి చేపట్టాలా? ప్రతి 15 సంవత్సరాలకు ఒకసారి ఇలా మార్చుకుంటూ పోవాలా. అంతటి తప్పని సరి అవసరమవుతుందా.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని పూర్తి చేసిన పట్టిసీమ శ్లాగించదగ్గ విషయం. గోదావరి జలాలు కృష్ణా నదిలో కలుస్తున్నాయి. ఈ కారణంగా కృష్ణలో మిగిలిపోతున్న 80 టిఎంసీల నీటిలో వాటా కోసం రాయలసీమ ప్రజలు కళ్ళు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు. ఇందులో మహారాష్ట్రకు 14, కర్ణాటకకు 21 టిఎంసీలు పోతే, మిగిలే 45 టిఎంసీలు, పులిచింతల ప్రాజెక్టు కార ణంగా మిగిలే 54 టిఎంసీలు కలిపి 99 టిఎంసీలు నికర జలాలుగా నిర్ధారించి రాయల సీమలోని ప్రాజెక్టులకు కేటాయించాల్సి ఉంది. ప్రస్తుత ప్రభుత్వం దీనిపై రాయలసీమ ప్రజలకు శ్రీశైలంలో 100 టిఎంసీలు నిల్వ చేస్తామనే హామీ కూడా ఇచ్చింది. అమలు ఎప్పుడు అన్నది ప్రభుత్వం తెలియజేయాలి. 99 టిఎంసీల్లో తెలంగాణా తన వాటా కూడా అడిగే పరిస్థితి ఉంది. తెలంగాణాకు గోదావరి నుండి అవరసమైన నీరు తీసుకునే అవకాశం ఉన్నందున మొత్తం జలాలను రాయలసీమకు సాధించుకునే అవకాశాలను పరిశీలించాలని, విజయం సాధించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకానికి కృష్ణా బోర్డు అనుమతికి నివేదిక సమర్పించే సమయంలో కె–7 సబ్ బేసిన్‌లోని నికర జలాలను మాత్రమే ఎత్తిపోసు కోవచ్చని తుంగభద్ర నీటితో సంబంధం లేదని బోర్డు తేల్చింది. 99 టిఎంసీల్లో 5 టిఎంసీలు నీటిని కె.సి.కెనాల్‌కు కేటాయించాల్సి వుంటుంది. మెండుగా నీటి లభ్యతవున్న తుంగభద్ర పై నిర్మించే గుండ్రేవుల నుండి గ్రావిటీ మీద కేటాయింపులు లేని ఎత్తిపోతలకు ప్రాధాన్యతనివ్వడం అందరూ ప్రశ్నించే విధంగాఉంది. అలాగని ముచ్చుమర్రి ఎత్తిపోతలను నేను వ్యతిరేకించడంలేదు. ముచ్చు మర్రి, గుండ్రేవుల పథకాలను వేర్వేరుగా చూడాల్సిన అవసరం ఉందన్నదే నా అభిప్రాయం.

శ్రీశైలం ప్రాజెక్టును నిర్మించిన తొలినాళ్ళలో రిజర్వాయర్ నుండి నీటిని మళ్ళించేందుకు కనీస నీటి మట్టం 854 నిర్ణయించగా, 1996లో జీవో 69 ద్వారా

దాన్ని 834కు తగ్గించింది. శ్రీశైలంలో ఎండిడిఎల్ 834గా ఉన్నా తాగడానికి ఆ నీటిని వినియోగించుకునేలా వీలుకల్పించారు. అయితే, రాయలసీమకు నీటిని అందించే పోతిరెడ్డి పాడు హెడ్‌రెగ్యులేటర్ సిల్ లెవెల్ 841గా ఎత్తులో ఉంటే 834 వద్ద తీసుకోవడం ఎలా సాధ్యమన్న ప్రశ్నకు త్రాగు నీటి విషయంలో ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం సమాధానంగా నిలుస్తోంది. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటిని మళ్ళించే వీలుఉన్నా పోలవరం ప్రాజెక్టుద్వారా గ్రావిటీ మీద గోదావరి జలాలను కృష్ణాకు అనుసంధానం చేయడానికి ప్రాధాన్యత ఇస్తోన్న రాష్ట్ర ప్రభుత్వం మన దగ్గరకు వచ్చేసరికి సాగునీటికి కూడా ఎత్తిపోతల గురించి ప్రస్తావించడం, రాయలసీమలో శాశ్వత నీటి కరువు నివారణపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని ప్రశ్నించేలా ఉందన్నది నా అభిప్రాయం.

పోలవరం లాగానే గుండ్రేవుల నిర్మించడంద్వారా గ్రావిటీ మీద రాయల సీమకు నీటిని అందించే అంశాన్ని ప్రభుత్వం వెంటనే పరిగణలోకి తీసుకోవాలని నేను కోరుతున్నాను. గుండ్రేవుల వద్ద విద్యుత్ కూడా ఉత్పత్తి చేసుకోవచ్చు. గుండ్రేవుల నిర్మాణం కారణంగా వరద సమయంలో శ్రీశైలం డ్యాంపై పడే భారాన్ని తగ్గించు కోవచ్చు కూడా. కె.సి. కెనాల్‌కు టి.బి.డ్యాము నుండి కేటాయించిన 10 టిఎంసీల నీటిని త్రాగు, సాగు నీటిగా వాడుకునే అవకాశం ఉండగా జీవో 69 ప్రకారం శ్రీశైలం రిజర్వాయర్‌లో 834 కంటే దిగువన ఉన్న నీటిని కేవలం తాగునీటికే వాడాల్సి ఉంది. అలా కాకుండా వ్యవసాయానికి కూడా ఇవ్వాలంటే జీవో 69లో మార్పులు నీటి కేటాయింపులు చేయాల్సి ఉంటుంది.

ముచ్చుమర్రి ఎత్తిపోతలతో పాటు గుండ్రేవుల రిజర్వాయర్, హెచ్.ఎన్. ఎస్.ఎస్., జీఎన్.ఎస్.ఎస్. ప్రాజెక్టులు, వేదవతి ఎత్తిపోతల పథకం, సిద్ధేశ్వరం అలుగు వంతెన, హెచ్.ఎల్.సి.కి సమాంతర వరద కాలువ, ఆర్డీఎస్ కుడి వరద కాలువ వంటి ప్రాజెక్టులు ఎన్నో పూర్తిచేస్తేనే కరువుల నెలవు, దగాపడ్డ రాయలసీమ సస్యశ్యామలం అవుతుంది.

శ్రీశైలం నిర్మాణ సమయంలో డ్యాం పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 308 టిఎంసీలుకాగా, పూడిక కారణంగా ప్రస్తుతం అది 215 టిఎంసీలకు తగ్గింది. ప్రతి సంవత్సరం 3 టిఎంసీల పూడిక చేరుతున్నట్లు అంచనాకాగా, ఇది ఇలాగే కొనసాగితే నీటినిల్వ సామర్థ్యం భారీగా తగ్గిపోతుంది. ఈ ఉపద్రవం ఎదురుకాకుండా

ఉండాలంటే శ్రీశైలం డ్యాం పైభాగంలో వీలైనన్ని రిజర్వాయర్లు కట్టుకోవాలి. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నా విన్నపము. భవిష్యత్ తరాల కోసం ఆ చర్యలు ఎంతో అవసరం.

తెలంగాణ వారి అభిప్రాయం ప్రకారం వారి ప్రాంతంలో పడ్డ వర్షపు నీటిని కోసాంధ్ర వాళ్ళు దోచుకుపోతున్నారని, రాయలసీమ వారి అభిప్రాయం ప్రకారం వారి నోటికాడికొచ్చిన క్రిష్ణా పెన్నా ప్రాజెక్టును మద్రాసు బూచిచూపి, కోస్తావారు తన్నుకపోయి నాగార్జునసాగర్ కట్టుకున్నారని, శ్రీబాగ్ ఒడంబడికను, కోసాంధ్ర ఏమాత్రం లెక్క చేయడంలేదని, రాయలసీమకు నష్టం కలుగజేసే జీవో 69 కోస్తావారి ప్రోద్భలంతోనే వచ్చిందని, ప్రకాశం బ్యారేజి నుండి ప్రతి సంవత్సరం వందల టిఎంసీలు సముద్రంలోకి వృధాగా పోనిస్తారే కాని రాయలసీమలో ప్రాజెక్టులు కట్టుకొని ఆవృధా నీటిని వాడుకుంటామంటే ఒప్పు కోరనే బాధతో ఉన్నారు. మరి కోస్తావారి అభిప్రాయం ప్రకారం అనాదిగా వారు క్రిష్ణానది నీటిని వాడుకొంటు న్నామని ఇందులో ఏ మాత్రం తేడా రాకూడదని భీష్మించుచూ. ఒకరిపై ఒకరు ద్వేషభావంతో ఉన్నారు. ఈ ముగ్గురికి సంబంధించిన శ్రీశైలం రిజర్వాయరు నుండి ముగ్గురికి సమన్యాయం చేయడం రెండు ప్రభుత్వాలకు సులభ సాధ్యమా? నాగార్జునసాగర్ నుండి ఒక టిఎంసి విడుదల కోసం ఇరు రాష్ట్రాల మధ్య చెలరేగు తున్న వివాదాన్ని మనం చూస్తూనే ఉన్నాం.

తుంగభద్ర నదిపైనున్న సుంకేసుల గరిష్ట ప్రవాహ పరిమాణం 5.25 లక్షల క్యూసెక్కుల ప్రకారం ఒక రోజు వరద ప్రవహిస్తే లభించే నీరు సుమారు 45 టిఎంసీలు, తుంగభద్ర డ్యాము నుండి క్రిష్ణ సంగమం వరకు దూరం సుమారు 285 కిలోమీటర్లు. అలాంటి నదిలో నీటిని నిల్వ ఉంచుకునేందుకు ఉన్న రిజర్వాయర్ సుంకేసుల ఒక్కటే. దాని సామర్థ్యం కేవలం 1.2 టిఎంసిలని గుర్తించాలి. కోస్తాలో పట్టిసీమను ఏడాదిలో పూర్తిచేసిన ప్రభుత్వం డి.పి.ఆర్. సిద్ధంగాఉన్న గుండ్రేవుల రిజర్వాయర్‌పై నిర్ణయం తీసుకునేందుకు రెండు సంవ త్సరాల సమయం కూడా సరిపోవడం లేదన్నది రాయలసీమ వాదులను తీవ్రంగా వేధిస్తోంది. గుండ్రేవుల నిర్మాణాన్ని వాయిదా వేయడం ద్వారా రాయలసీమ ప్రజల మనోధైర్యాన్ని దెబ్బతీస్తున్నారు. పట్టిసీమను ఏడాది లో పూర్తిచేసి జాతికి అంకితంచేసి గుండ్రేవులపై నిర్ణయానికి మూడేళ్ళ తీసుకోవడం సరైందేనా? అన్నది ప్రభుత్వం ప్రశ్నించుకోవాలి.

రాయలసీమ ప్రజలను సమాధాన పరచాలి. లేనిచో ప్రభుత్వం తమపట్ల పక్షపాత ధోరణితో ఉందని భావించే ఆస్కారం లేదా?

గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణానికి బచావత్ అనుమతి ఉంది. తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలు కలిసి గుండ్రేవుల నిర్మించినా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే ఎక్కువ హక్కు ఉంటుంది. ఆర్డీఎస్ ఆయకట్టు కేవలం 87,500 ఎకరాలు మాత్రమేనని గుర్తించాలి. మన ఆయకట్టు 2.65 లక్షల ఎకరాలు. గ్రావిటీతో లక్షలాది ఎకరాలకు నీటిని అందించే అవకాశం మన రాష్ట్రానికే ఉంది. ముందు చూపుతో తగినంత తాగునీటిని నిల్వచేసుకునే అవకాశం గుండ్రేవులతో ఉంది. ఖరీఫ్ ప్రారం భంలోనే సాగుకు నీటి అందించవచ్చు. తాగు సాగు నీటికి ఏటా కష్టాలు పడాల్సిన అవసరం తప్పుతుందన్నది ప్రభుత్వం గుర్తించాలి.

శ్రీశైలంలోని నీటిని పూర్తిగా ఖాళీ చేసే వరకు గ్రావిటీ మీద నాగార్జున సాగర్‌కు మళ్ళించుకునే అవకాశం తెలంగాణా, కోస్తాంధ్రకు ఉండగా, రాయలసీమకు మాత్రం ఎత్తిపోతల ద్వారానే నీటిని మళ్ళిం చుకునే పరిస్థితి ఉంది. నాగార్జునసాగర్‌లో ఎత్తిపోతల ద్వారా కావల్సినంత త్రాగునీటిని వాడుకునే వీలుఉన్నా వేసవిలో కొద్ది పాటిగా నిల్వ ఉండే నీటిని కూడా రాయలసీమ వారు ఎత్తిపోసుకొనే వీలులేకుండా అటు తెలంగాణా, ఇటు కోస్తాంధ్ర ప్రజలు తాగునీటి కోసమని చెపుతూ రాయల సీమను పూర్తిగా నిర్లక్ష్యంచేస్తూ శ్రీశైలం నుండి దిగువకు 760 వరకు నీటిని మళ్ళించిన పరిస్థితి(దుస్థితి) మనం చూస్తున్నాం. క్రిష్ణా మ్యానేజ్‌మెంట్ బోర్డు గాని ప్రభుత్వంగాని రాయలసీమను ఏ మాత్రం ఆదుకోలేక పోయాయికదా? కళ్ళెదుటే నీళ్ళు కనిపిస్తున్నా, చుక్కనీరు అందక కన్నీళ్ళు పెట్టుకునే రాయలసీమ ప్రజల కన్నీళ్ళు తుడిచే వారెవ రన్నదే ప్రశ్న. నిజంగా శ్రీశైలం రిజర్వాయరు దేవాలయం లాంటిదే, కానీ యండిడిఎల్ పాటించకపోవడం వలన ఓటి కడవలా మారుస్తున్నారు. శ్రీశైలంలోనే నీళ్లు లేకపోతే ముచ్చుమర్రి ద్వారా నీటిని ఎలా ఇస్తారు. గుండ్రేవుల కడితే ఖరీఫ్ ప్రారంభంలోనే సాగునీటిని విడుదల చేయవచ్చునన్నది ఖచ్చితమైన పరిష్కారంగా కనిపిస్తుండగా, ఆగాధము లాంటి శ్రీశైలంలోకి నీరు వచ్చేదెప్పుడు. గ్రావిటీద్వారా కిందకు నీళ్ళ తరలిస్తూ ఉంటే, 854 అడుగుల మట్టము చేరేదెప్పుడు. అనగా సుమారు 100 టిఎంసీల నిల్వ జరిగేదెప్పుడు. కెసిసికి సాగునీరు ఇచ్చేదెప్పుడు. 790కు నీరు చేరిన వెంటనే రాయలసీమకు సాగునీరు తరలింపునకు

క్రిష్ణా మేనేజ్‌మెంట్ బోర్డు అనుమతిస్తారా. అతి ముఖ్య మైన విషయం ఏమిటంటే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము బ్రిజేష్ కుమార్ కమిషన్‌కు ముచ్చుమర్రి ఎత్తిపోతల రాయలసీమకు త్రాగునీటి అవసరాల కోసం నిర్మిస్తున్నదేతప్ప కొత్తప్రాజెక్టు కాదని తెల్పింది. (5.5. 2017 ఈనాడు పత్రిక). 20 టిఎంసీలను గ్రావిటీ ద్వారా ఏ అడ్డంకులు లేకుండా తరలించగలిగే గుండ్రేవులతో కేవలం 5 టిఎంసీలు ఎత్తిపోస్తే అడ్డంకులతో కూడిన ముచ్చుమర్రిని సరిపోల్చడం సాగు, త్రాగు నీటికి పూర్తిగా దానిపైన ఆధారపడము ఏమాత్రం విజ్ఞత కానేకాదు.

మన రాష్ట్ర ప్రభుత్వం ఇతర రాష్ట్రాలతో చర్చలు జరిపే దిశగా ఒక్కఅడుగు కూడా ముందుకు వేయకుండా వాటిని బూచిగా చూపిస్తూ కాలయాపన చేస్తూ, ఒకవేళ గుండ్రేవుల రిజర్వాయర్ వద్దని నిర్ణయిస్తే రాయలసీమకున్న హక్కులను కాలరాసినట్లే. బచావత్ కమిషన్ చేసిన సూచనను బుట్టదాఖలు చేసినట్లే. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారు స్వయంగా హామీ ఇచ్చినా, అదింకా కార్యాచరణలోకి రాకపోవడానికి తెంగాణాకి, కర్ణాటక రాష్ట్రాలు కానే కాదని సొంత రాష్ట్రంలోని వారే కారణమని, గుండ్రేవులకు కొందరు అడ్డుపడుతూ కుట్రను కొనసాగిస్తున్నారని రాయలసీమ వారు భావించాల్సి వస్తుంది. అలాంటి భావాలకు ఆస్కారం ఇవ్వడం ఏమాత్రం అభిలషణీయం కాదు. ప్రాంతీయ విభేదాలు వస్తాయి. అందుకే కదా తెలంగాణా ఆవిర్భవించింది.

కర్నూలు, కడప జిల్లాతో పాటు అనంతపురం జిల్లా కూడా కరువు పీడిత ప్రాంతమే. గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణం కారణంగా అనంతపురం జిల్లా తుంగభద్ర డ్యాం నుండి కె.సి.కెనాల్‌కు విడుదల చేసే 10 టిఎంసిలు కేటాయించిన నీటిలో కొంత భాగాన్ని గ్రావిటీ ద్వారా ఇవ్వవచ్చు. గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణంతో తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య నెలకొన్న ఆర్డీఎస్ వివాదానికి చర్చల ద్వారా పరిష్కారం లభిస్తుంది. తెలంగాణాతో సయోధ్య కారణంగా ఆర్డీఎస్ కుడి వరద కాలువను కూడా సామరస్యంగా సాధించుకునే అవకాశం ఏర్పడుతుంది. ఇది ముమ్మాటికీ రాయలసీమకు ఎంతో ప్రయోజన కారిగా ఉంటుంది.

ఎవరిని గాని ఏ ప్రభుత్వాన్ని గాని విమర్శించాలన్నది నా భావన కానేకాదు. నా జన్మభూమి రాయలసీమ ప్రజల కష్టాలను కొంతయినా తగ్గించాలన్నదే నా తపన. అందుకే ఇంత వివరంగా తెలియజేయడం జరిగింది.

పై విషయాలను రాజకీయ నాయకులు, ప్రభుత్వం సహృదయంతో పరిశీలించి, గుండ్రేవుల రిజర్వాయరు నిర్మాణాన్ని త్వరగా చేపట్టాలని విన్నపము, ప్రార్థన.

రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు వైఎస్ రెడ్డి, ఏర్వ రామచంద్రారెడ్డి, నెట్టూరి సుధాకర్‌రావు, బొజ్జా దశరథరామిరెడ్డి, ఆడిఎస్ చైర్మన్ సీతారామిరెడ్డి, ఎల్ఎల్‌సి మాజీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ మాజీ అధ్యక్షులు చంద్రమౌళీశ్వరరెడ్డి, కెసి కెనాల్ మాజీ అధ్యక్షులు డిఎల్.శ్రీనివాస రెడ్డి, కుందూ పోరాట సమితి నాయకులు కామని వేణుగోపాల్, రాయలసీమ విద్యావంతుల వేదిన నాయకులు అరుణ్ మొదలుగువారు ఎంతోమంది రైతు నాయకుల శ్రమ ఫలితంగా డి.పి.ఆర్. తయారుచేయడానికి, ప్రభుత్వం నుండి అనుమతులు వచ్చేలా వత్తిడి పెంచడంలో ఎంతగానో కృషి చేశారు. వారి సేవలు మరవలేనివి.

**అనువాదం: అరుణ్,రాయలసీమ విద్యావంతులవేదిక.**

# నీళ్లున్నా కర్నూల్ జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజలకు మిగిలింది కన్నీళ్ళే

**కర్నూలు** జిల్లాలో అత్యంత కరువు పీడిత ప్రాంతం జిల్లాలోని పశ్చిమ ప్రాంతమే. ఒకవైపు వేదవతి నది వరదలతో ముంచెత్తుతున్నా, మరోవైపు హంద్రీ-నీవా కాలువ అందుబాటులో వున్నా నోటికి గుక్కెడు నీరు నోచని ప్రజలున్న ప్రాంతమిది. పాలకుల హామీలు పత్రికా ప్రకటనలకే పరిమితమయినోల్లు తెరుచుకున్న బీళ్ళు, ఆకాశంవైపు చూస్తున్న రైతన్నలకూ మిగిలింది కన్నీళ్ళే. పదవి చేపట్టిన తర్వాత తొలి స్వాతంత్ర దినోత్సవం నాడు ముఖ్యమంత్రిగారు వేదవతి ఎత్తిపోతలపై హామీ యిచ్చినా, గత ఏడాది అక్టోబరులో హంద్రీ-నీవా నుండి 106 చెరు వులకు నీరందించే పథకానికి " నేడే రూ.250 కోట్లు ఇస్తున్నా, రేపే పనులు ప్రారంభించండి" అన్నట్టు ఇరిగేషన్ అధికారిని ఆదేశించినా అవి కేవలం నీటిమీద రాతలుగా మిగిలాయి తప్ప, సీమ ప్రజలకు ఒరిగిందేమీలేదు. 20 వేల ఎకరాలకు సాగునీరు, పత్తికొండ, డోన్, ఆలూరు, పాణ్యం, నందికోట్కూర్ నియోజకవర్గాలలో 3లక్షల మందికి పైగా సాగు నీరందించే పథక ప్రతిపాదనకు అడ్డుపడుతున్న సైందవులు ఎందరో...తొలుత రూ.879 కోట్లతో ప్రతిపాదనలు పంపుతే, వాటిని తిరస్కరించి ఖర్చు తగ్గించి ప్రతిపాదనలను పంపమని అడిగారు. మరల రూ.551 కోట్లకు తగ్గించి పంపినా ఆ ప్రతిపాదనలు "ఎక్కడవేసిన గొంగడి అక్కడే" అన్నట్టు ఒక్క అడుగు ముందుకు వేయలేదు. మరింత విషాద కరమైన విషయం పత్తికొండ నియోజకవర్గానికి ప్రతినిధి రాష్ట్రం లోనే అత్యంత అనుభవశాలి, సీనియర్ అయిన ఉపముఖ్యమంత్రి కే.ఇ.క్రిష్ణమూర్తిగారు కావడం. దీన్నిబట్టే రాయలసీమ ప్రతినిధులు, వారు పాలక పార్టీ వారైనా, ఎంత నిస్సహాయులో అర్థం చేసుకోవచ్చు. సీమ సాగు, తాగునీటి పథకాల విషయంలో రాష్ట్రాధికారులకు అనేక ధర్మ సందేహా లోస్తుంటాయి. అడ్డువేయడానికి యితరరాష్ట్రాల అనుమతి సాకును చూపుతారు. అలా లేకుంటే జలసంబందమైన (hydrological) అనుమతులు అడుగుతారు. ఆ ఇచ్చేది జిల్లా అధికారులు కాదని వారికి తెలియదా? యిలా ఇప్పటికే 3 ఏళ్ళు గడిచాయి కూడా.

రాష్ట్ర అధికారుల ఈ డొంకతిరుగుడు వ్యవహారానికి స్వస్తి చెబుతూ ఈ ఏడాది మే నెలలో వివరమైన జలసంబంధ నివేదికను అటు ముఖ్యమంత్రికి, యిటు సంబంధిత అధికారులకూ పంపారు. ఫలితం వేచిచూడాల్సిందే. మన ముఖ్యమంత్రి, సాగునీటి శాఖామంత్రిలు సీమ నీటి విషయం వచ్చేసరికి, గోదావరి నీళ్లను కృష్ణలో ఎత్తిపోసి అప్పుడు మిగిలిన కృష్ణా జలాలను సీమకు కేటాయిస్తామంటూ పదే ఊదర గొడుతున్న విషయం అందరికీ తెల్సిందే.. ఇప్పటికే పట్టిసీమ వల్ల ఆదాఅయిన జలాలను సీమకిచ్చామని గోబెల్స్ ప్రచారమూ జరుగుతూ వుంది. గోదావరి–కృష్ణా అనుసంధానం, దాని వల్ల ఆదా అయ్యే నీరు వాటిని సీమకు తరలించడమనేది జీవో 69 రద్దుతో ముడివడి వుందనే విషయాన్ని మాత్రం వాళ్ళుచెప్పరు. గోదావరి నీళ్ళను నమ్ముకోవడ మంటే, కుక్కతోకను పట్టుకొని గోదావరిని ఈదినట్టే. అందుకే మనకే మిగిలివున్న కృష్ణా జలాలతో సీమ నాలుగు జిల్లాలలోని చెరువులనింపే ప్రతిపాదన ప్రభుత్వానికి పంపడం జరిగింది.

జల లభ్యత వివరాలను పరిశీలిస్తే, 75% జల లభ్యత ఆధారంగా కృష్ణా జలాలను వివిధ ప్రాంతలకు కేటాయించారు.

| | రాయలసీమ | కోస్తాంధ్ర | తెలంగాణా | మొత్తం |
|---|---|---|---|---|
| ప్రాజెక్టులకు | 122.70 | 377.47 | 266.83 | 767.00 టిఎంసీలలో |
| ఆవిరినష్టాలు | 11% | 11 % | 11% | 33 % |
| మొత్తం | 133.70 % | 388.47 | 277.83 | 800 టిఎంసీలలో |

ఇక్కడ పేర్కొన్న పట్టిక ప్రకారం శ్రీశైలం జలాశయంలో మొత్తం ఆవిరి నష్టం 33 టిఎంసీలుగా లేక్కకట్టారు. జాగ్రత్తగా గమనిస్తే ఈ కేటాయింపుల విషయం లోనూ రాయలసీమకు నష్టం జరిగింది. కృష్ణా జలాలు కేవలం 133.70 టిఎంసీలు కేటాయించిన సీమకు ఆవిరినష్టం 11%, 388.47 టిఎంసీలు కేటాయించిన కోస్తాంధ్రకు ఆవిరినష్టం 11 టిఎంసీలే. ఇదీ మొదటినుండీ సీమ విషయంలో జరుగుతున్న గొప్ప సమన్యాయం. యిదే విధమైన సమన్యాయాన్ని చెన్నై తాగునీటి వాటాలలో చూపించారు మన కోస్తాంధ్ర అధిపతులు. ఆ విషయం అలా వుంచితే, గత 32 ఏళ్ళలో (1984–85 నుండి 2015–16) ప్రభుత్వ గణాంకాల ప్రకారం వాస్తవమైన ఆవిరి నష్టాలు 518.86 టిఎంసీలు మాత్రమే అంటే ప్రతి సంవత్సరం

సగటున ఆవిరి నష్టం 16.2 టిఎంసీలు. అంటే ఆవిరినష్టంలో ఆదా 33–16=17 టిఎంసిలని స్పష్టమవుతుంది. ఇక వివిధ ప్రాంతాలకు ఆవిరి నష్టం కేటాయింపులు, ఆ ప్రాంతాలకు కేటాయించిన నీటి పరిమాణపు శాతంలో లెక్కగట్టాలి. అప్పుడు

రాయలసీమకు :122.70×16టిఎంసీలు 767=2.56 టిఎంసీలు;

కోస్తాంధ్రకు : 377.47టిఎంసీలు×16టిఎంసీలు/767=8.57 టిఎంసీలు;

తెలంగాణాకు : 266.83 టిఎంసీలు×16టిఎంసీ/767= 5.57 టిఎంసీలు.

**: మొత్తం ఆవిరినష్టం కేటాయింపులు=16 టిఎంసీలు.**

ఈ గణాంకాల ఆధారంగా ఆవిరినష్టంలో మిగులు అనగా ఆదా అయిన జలాలు.

రాయలసీమకు 11–2.56=8.44 టిఎంసీలు.

కోస్తాంధ్రకు 11–8.57=3.13టిఎంసీలు.

తెలంగాణాకు 11–5.57=5.43 టిఎంసీలు.

మొత్తం మిగులు 17టిఎంసీలు.

రాయలసీమ, కోస్తాంధ్రలకు కలిపి ఆవిరి నష్టంలో మిగులు 8.44+3.13 టిఎంసీలు = 11.57 టిఎంసీలు.

అయితే కోస్తాకు కేటాయించిన నీటి పరిమాణం 377.47 టిఎంసీలను పరిగణలోనికి తీసుకుంటే ఆ ప్రాంతానికి కేటాయించిన ఆవిరి నష్టపు 3.13 టిఎంసీలు అత్యల్పం. అంతేగాక ఆప్రాంతంలో రాజధాని అమరావతి యేర్పాటు వల్ల, వివిధ జల వనరుల ద్వారా ఆమాత్రం నీటిని భర్తీ చేయడం కష్టసాధ్యం కాదు. అందువల్ల ఆ మిగులునూ కరువుపీడిత ప్రాంతమైన రాయలసీమకు మరలించవచ్చు. ఈ కేటాయింపులు బచావత్ కేటాయింపులకు విరుద్ధం కాదు కూడా. మన రాష్ట్రంలో ఆవిరి నష్టం మిగులు జలాలను కరువుపీడిత జిల్లాలకు కేటాయించడంతో ప్రాంతాల మధ్య ఎలాంటి వివాదాలకు తావుండే అవకాశం ఉండదు. మనరాష్ట్రంలోని రెండు ప్రాంతాలలో మిగిలే ఆవిరినష్టపు జలాలు 11.57 టిఎంసీలను నాలుగు జిల్లాలకు, జిల్లాకు 11.57 టిఎసీలు/ 4=2.90 టిఎంసీల చొప్పున, ప్రతిజిల్లాలో చెరువుల నింపేందుకు వినియోగించవచ్చు. ప్రతి జిల్లాలో వేల ఎకరాలకు నీరందివ్వడమే గాక, భూగర్భ జలాలు

పెంచడం ద్వారా సన్నకారు రైతాంగం లబ్ధి చెందుతుంది. పై నీటిని హంద్రీ–నీవా ద్వారా నాలుగు జిల్లాలలోని చెరువులను నింపేందుకు బహుశా ఖర్చు దాదాపు రూ.2000 కోట్లు కావొచ్చు. ఈ మొత్తం రాష్ట్ర బడ్జెట్‌లో పెద్ద మొత్తమేమీ కాదు. అంతేగాక కరువుపీడిత ప్రాంత ప్రజల మౌళిక అవసరాలకై నిధులను కేటాయించడం ప్రజాస్వామ్య ప్రభుత్వాల కనీస కర్తవ్యం. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని హంద్రీ–నీవా ద్వారా కర్నూల్ జిల్లాలోని 106 చెరువులకు నీటిని సరఫరా చేయడంతో పాటు, మిగిలిన 3 జిల్లాల చెరువును నింపేందుకు కృషి చేయాలని ప్రభుత్వాన్ని ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులు కృషిచేయాలి. ఇందుకోసం ప్రజలు ఉద్యమించాలి.

**( విశ్రాంత ఇంజనీర్ సుబ్బారాయుడు గారు ప్రభుత్వానికి పంపిన వినతి ఆధారంగా, వ్యాస రూపం అరుణ్)**

# ఇక ఈ రెండేళ్ళనూ వృధా చేయకండి

**- ఎం.సుబ్బరాయుడు, డి.ఇ.**

**జూలై 5, 2018న** "ఆంధ్రజ్యోతి"లోని శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావుగారి వ్యాసం, ప్రతి విషయాన్ని మసిపూసి మారేడుకాయ ఎలా చేయవచ్చునో ప్రతి ఒక్కరికీ నేర్పగలదు. తామేదో పట్టిసీమ నుండి గోదావరి జలాలను కృష్ణాడెల్టాకు అందించామని గొప్పలు చెప్పు కుంటున్నారు కదా. అయితే ఆ నీరు పట్టిసీమ నుండి ఆవిరై కృష్ణా డెల్టాకు చేరి అక్కడ నీరుగా మారి పొలాలకు అందడంలేదు కదా. ఆ నీరు గత ప్రభుత్వం, జలయజ్ఞంలో భాగంగా నిర్మించిన పోలవరం కుడి కాలువ ద్వారా అనే విషయం విస్మరిస్తే ఎలా? అంతేగాక తాము గొప్పలు చెప్పుకుంటున్న పట్టిసీమ ఎంత ప్రజాధనం వృధా చేసిందో కాగ్ స్పష్టంగా ఎత్తి చూపింది కూడా. ఇక ఆ నీటి వెంట ఏరులైపారిన అవి నీతిని గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదుకూడా. గత ప్రభుత్వాల కృషి తమఖాతాలో వేసుకొనడం చంద్రబాబు ప్రభుత్వానికి వెన్నతో పెట్టిన విద్యనే కదా.

జలయజ్ఞంలో భాగంగా చేపట్టిన ప్రాజెక్టులను, హంద్రీ-నీవా, గాలేరు-నగరి లాంటి వాటిని పూర్తిచేయడానికి నిర్మాణ ఖర్చులను విపరీతంగా పెంచి అస్మదీయులకు దోచిపెట్టడం ప్రజలు గమనించడం లేదని భావిస్తే పిల్లికళ్ళు మూసుకొని పాలు తాగినట్టే వుంటుంది. రాయలసీమకు లబ్ధిచేకూర్చే పై రెండు మరియు ఎస్సార్బీసీలను పూర్తిచేయడానికి ఎంతకాలం పడుతుందో చెప్పగలరా? ఆఘమేఘాలపైన పట్టిసీమ ప్రాజక్టును పూర్తిచేసిన ఈ ప్రభుత్వానికి ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయిన రాయలసీమ ప్రాజక్టులపై సీతకన్ను ఎందుకో? సీమ తాగు, సాగునీటి అవసరాలను తీర్చగల పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ను 44వేల క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచ కుండా, శ్రీశైలం రిజర్వాయర్‌లో కనీస నీటిమట్టాన్ని 854 అడుగులకు పునరుద్ధరించ కుండా సీమకు నీళ్ళు ఎలా అందించగాలరో అమాత్యుల వారు సెలవిస్తారా?ఆ పనులు 2019కి పూర్తి చేయగలరా? నత్త నడక నడుస్తున్న ఆ పనులను గమనించిన వారెవరైనా అది అసాధ్యమని నిర్ద్వందంగా చెప్పగలరు.

తెలుగుదేశం ప్రభుత్వానిది ఎప్పుడూ కింది చూపే. అదీ హ్రస్వదృష్టి. వారికి

క్రిందనున్న గుంటూర్-కృష్ణా జిల్లాలు తప్ప, మిగతా జిల్లాలు కనపడవు. ముఖ్యంగా సీమప్రజలను మభ్య పెట్టేందుకు ప్రచారార్భాటం తప్ప, సీమ ప్రాజెక్టులు ముందుకు సాగడంలేదు. కేవలం 5 టిఎంసీల నీటిని ఎత్తిపోసే ముచ్చుమర్రితో సీమ సస్యశ్యామలమైతుంది అనేది సీమ ప్రజల చెవుల్లో కాలీఫ్లవర్ పెట్టడమే. కడప, కర్నూల్ జిల్లాలకే గాక అటు మహబూబ్‌నగర్ జిల్లాకు ఉపయోగకరమైన గుండ్రేవుల రిజర్వాయర్ గురించి ఊసే దేవినేనిగారి వ్యాసంలో లేదే. 2014 ఆగస్టు15న ఆయన అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు యిచ్చిన హామీ దేవినేనికి తెలియదనుకోవాలా? వారిచ్చేది ఎటూ బూటకపు హామీలేకదా అని పట్టించుకోలేదా? కేంద్రం నిధులిస్తామని చెప్పినా ఖాతరు చేయకుండా లక్షల కోట్లు అప్పుతెచ్చి అమరావతి, పోలవరాన్ని నిర్మించాలను కుంటున్న చంద్ర బాబుకు, రాయలసీమ ప్రజల నీటిఘోష వినపడక పోవడం దుర్మార్గం కాదా? కర్నూల్ జిల్లా పశ్చిమ ప్రాంతాలయిన ఆదోని, ఆలూర్, పత్తికొండ, ఎమ్మిగనూర్ ప్రజలు తాగునీరు, సాగునీరులేక అలో రామచంద్ర అంటూ ఉపాధికి వేలాది మంది వలసలు వెళ్ళడం, రైతుల ఆత్మహత్యలూ శ్రీమాన్ దేవినేని గారికి కన్పించవా? వారి ఆక్రందనలు విన్పించావా? అంతటి బధిరాంధ్ర ప్రభుత్వమా యిది?

ఇక పట్టిసీమ ద్వారా మిగిలిన కృష్ణా జలాలను రాయలసీమకు అందిస్తామని తరచుగా తామే వాగ్దానాలు చేస్తున్నారుకదా. మరి దానికి ప్రభుత్వ ఉత్తర్వులు (జీవో) యివ్వడానికి ముహూర్తం కుదరలేదేమో. కేవలం రూ.1000-1500 కోట్లతో పూర్తయ్యే వేదవతి ఎత్తిపోతల పథకం మాటా ఎక్కడా లేదే. తమ అధినాయకుడు దీనిపై కూడా హామీ యిచ్చాడే. జూన్ మొదటివారంలోనే కృష్ణా డెల్టాకు అందించామని, వారి పంటలను రోగాలనుండి కాపాడామని చెప్పుకొనే దేవినేని అండ్‌కోకు రాయలసీమ లోనూ వరి వేస్తారని, వారికీ జూన్ మొదటి వారంలోనే సాగునీరివ్వాలని, లేకపోతే వరికి "మెదవిరుపు", "పాము పోరా"(ఎండు)తెగుళ్ళూ వస్తాయనే యింకిత జ్ఞానం లేకపోవడం విచారకరం. అయినా సీమ ప్రజలకు కన్నీళ్లు మిగిలిస్తూ శ్రీశైలం నుండి 760 అడుగులదాక నీటిని తోడిన వారికి సీమ ప్రజల తాగునీటి అవసరాలే జ్ఞాపకం లేనపుడు, సాగునీటి అవసరాలు గమనంలోకి వస్తాయనుకోవడం మా భ్రమే. కృష్ణా డెల్టాతో పాటు రాయలసీమకూ జూన్‌లో నీరు అందించగల సిద్ధేశ్వరం అలుగు విషయం దేవినేని గారికి స్పృహలో లేదా? కేవలం రూ.500 కోట్లతో పూర్తయ్యే అలుగువల్ల హెచ్.ఎన్.ఎస్.ఎస్, జి.ఎన్.ఎస్.ఎస్., ఎం.డబ్ల్యు. ఎస్,ఎస్. ఆర్.బి.సి.లకు జూన్

నెలలోనే నీరివ్వవచ్చు.ఈ 500 కోట్లలను భరించలేనంత దివాలా తీసిందా ఈ ప్రభుత్వం..

కేవలం వందల కోట్లతో సీమలో నిర్మాణమయ్యే పై ప్రాజక్టులను వదలి, లక్షలకోట్లతో గోదావరి–పెన్నా అనుసంధానంతో రాయలసీమకు నీరందిస్తానని చెప్పడాన్ని సీమ ప్రజలకు ఆకాశ హర్మ్యాలు నిర్మిస్తాననడమే. అయినా సీమ ప్రజల్ని యింకా ఎంతకాలం మోసగించగలరు? ముఖ్యమంత్రి గారు రైతుపక్షపాతి అని ప్రచారం చేసుకున్నంత మాత్రాన అందరూ నమ్ముతా రనుకోవడం అమాయకత్వమే. చారలు వేసుకున్నంత మాత్రాన నక్క పులి అవుతుందా? కేవలం మీ హామీలను నమ్మి మీవెంట సీమ ప్రజలుంటారను కోవడానికి సీమ ప్రజలు అజ్ఞానంలో లేరు.

మీ ప్రభుత్వానికి ఇక వుండేది కేవలం రెండేళ్ళే. జలయజ్ఞం, ధన యజ్ఞం, ప్రతిపక్షపు అడ్డంకులు, ఆర్థిక యిబ్బందులు అనే కలవరింతలు, పలవరింతలు ఇప్పటికైనా మానండి. రాయలసీమను సస్యశ్యామలం చేసే ప్రాజెక్టులను చేపట్టండి. శ్రీశైలంలో 100 టిఎంసీలను నిల్వచేసి సీమకు నీరందిస్తామని ముఖ్యమంత్రి గారు చేసిన హామీలను నిలబెట్టుకోండి. సముద్రంలో వృధా అవుతున్న తుంగభద్ర వరద జలాలను, ఆర్డీఎస్ కుడి వరద కాలువ నిర్మించి సీమకు తాగు, సాగునీరు అందించండి. తద్వారా, హెచ్.ఎల్..సి., ఎల్.ఎల్.సి. పథకాలకు కేటాయించిన నీరు అంద చేయండి. కరువుసీమ అనంతపూర్ జిల్లాకు వరప్రదాయిని అయిన హెచ్.ఎల్.సి. సమాంతర కాలువ నిర్మాణం వెంటనే చేపట్టండి.

ఆంధ్రప్రదేశ్ అంటే కేవలం గుంటూర్, కృష్ణా జిల్లాలే కాదు, పడమర వున్న రాయలసీమ జిల్లాలుకూడా అనే విషయం గమనిస్తే మంచిది. సీమ ప్రజల నీటి అవసరాలను తీర్చాల్సిన గురుతర భాధ్యత మీపై వుందని, భాధ్యతాయుత పౌరునిగా మీకు గుర్తుచేస్తున్నా.

# రాయలసీమ బతుకుకు ఆధారమైన

# శ్రీశైలం కథేంటి

రాయసీమలోని ఏప్రాజెక్టుకు నీళ్లు అందాలన్నా శ్రీశైలం ఒక్కటేమార్గం. కానీ శ్రీశైలం నుంచి పూర్తిస్థాయిలో రాయల సీమకు కేటాయించిన నీటిని తీసుకునే వీలు ఇప్పటిదాకా జరగలేదు. అలాగే తుంగభద్రా నీటి విషయంలో కూడా ఇదే జరుగుతోంది. రాయలసీమ బాగుపడాలంటే... కేటాయించిన మేరకు నీళ్ళు సీమ పొలాల్ని తడపాలంటే ఏంచేయాలి? మనం ఏంసాధించుకోవాలో వివరించారు రిటైర్డ్ ఇరిగేషన్ నిపుణులు సుబ్బరాయుడు గారు.. ప్రాజెక్టులపై, నీటి సరఫరా వ్యవస్థలపై ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలు..

శ్రీశైలం ఇప్పుడయితే పూర్తిగా ఎండిపోయింది. ఎవరికీ నీళ్ళిచ్చే పర్థిస్థితుల్లో లేదు. నీళ్లున్నప్పుడు, నీళ్ళు లేనప్పుడూ రెండు సందర్భాల్లోనూ రాయలసీమ వారే ఇబ్బంది పడుతున్నారు. నీళ్ళున్నప్పుడు ఎప్పుడు రాయలసీమకు వస్తాయో తెలియదు. నీళ్ళు లేనప్పుడు ఇంకో మార్గం కనిపించదు. దీంతో రెంటికీ చెడ్డ రేవడైంది రాయలసీమ వాసుల పరిస్థితి.

**శ్రీశైలం పరిస్థితిని ఒక్కసారి పరిశీలిస్తే....**

శ్రీశైలం నుంచి ఏ ప్రాంతంవారు ఎంత మొత్తంలో నీటిని తీసు కోవాలి. వాడుకోవాలి అనే అంశం కంటే మొదట శ్రీశైలంను రక్షించుకోవాల్సిన అవరసం ఉంది. గతంలో వచ్చిన వరదల నేపథ్యంలో భవిష్యత్‌లో శ్రీశైలం రిజర్వాయర్ దెబ్బతినకుండా చూసుకోవాల్సిన అవసరముంది.

308 టిఎంసీల సామర్థ్యం నుంచి ఇపుడు 215 టిఎంసీల నీటినిల్వ సామర్థ్యానికి శ్రీశైలం పడిపోయింది. ఈలెక్కన చూస్తే శ్రీశైలంలో నీటి నిల్వ సామర్థ్యంలో

మూడోవంతు భాగం మేర పూడిక ఆక్రమించేసింది. మరోచోట రిజర్వాయర్ కట్టే పరిస్థితిలేదు కాబట్టి మనమంతా దీన్ని కాపాడుకోవాలి. ఇదే మన ముందున్న తక్షణ కర్తవ్యం.

ఒకవైపు పూడిక తొలగింపుతోపాటు పై ప్రాంతాల నుంచి భారీగా నీరు ఒక్కసారి వచ్చి చేరితే ఏం చేయాలో కూడా ఆలోచించాలి. ముందస్తు ప్రణాళికలు రూపొందించుకుని అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలి. స్పిల్‌వే నీటినిల్వ సామర్థ్యం 13.5 లక్షల క్యూసెక్యులు. అయితే 2009లో రిజర్వాయర్‌లోని భారీగా వరద నీరు రావడంతో స్పిల్‌వే నుండి నీటి విడుదల 25.5 లక్షల క్యూసెక్యులమించి పోయింది. అంటే రెట్టింపయింది. ఇలాంటి పరిస్థితి రిజర్వాయర్‌పై తీవ్ర ప్రభావం చూపుతుంది.

దీన్ని సంరక్షించుకేనేందుకు అనేక మార్గాలున్నాయి. ఇటీవల సెంట్రల్ వాటర్ కమీషన్ (సి.డబ్ల్యు.సి) సభ్యులు శ్రీశైలంను ఆమధ్య పరిశీలించి వెళ్ళారు. ఆ సందర్భంలో కొందరు సభ్యులు కొన్ని నిశ్చితాభిప్రాయాలను వ్యక్తం చేశారు. శ్రీశైలం భవిష్యత్ గురించి, రాబోయే సమస్యల గురించి లోతైన అధ్యయనం చేశారు. శ్రీశైలంలో స్పిల్‌వే సామర్థ్యాన్ని పెంచే అవకాశం లేదు. పెద్దఎత్తున వరదనీరు వచ్చి చేరితే వరద నీటిని బయటకు పంపేటప్పుడు రిజర్వాయర్ దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకువాలి. అందుకై ఒక ప్రత్యేక 'సొరంగం' (టనల్) ఏర్పాటు చేయాలని అభిప్రాయపడ్డారు. రిజర్వాయర్‌కు కుడివైపున సొరంగంను ఏర్పాటు చేయడం చాలా సులువు. పొడవు తక్కువ. అదే ఎడమవైపున టనల్ ఏర్పాటు చాలా పెద్దదవుతుంది. నిర్మాణం కూడా ఖర్చుతో కూడుకున్నదేగాక, కష్టతరమవుతుంది. ఎస్.ఎల్.బి.సి. 43.5 కిలోమీటర్లు ఉంది. కుడివైపున కేవలం 18.6 కిలోమీటర్ల మాత్రమే వెలుగొండ వరకు వస్తుంది. శ్రీశైలం రక్షణ విషయంలో మరో ఆలోచన కూడా చేయడం జరిగింది. పై భాగంలో(అప్ స్ట్రీమ్‌లో) నీటిని మళ్ళించేందుకు ఆస్కారం ఉందా? అన్న కోణంలో అధ్యయనం జరిగింది. అంటే ఇటీవలి కాలంలో తక్కువ రోజుల్లో ఎక్కువ వరదనీరు వచ్చి స్పిల్‌వే కెపాసిటీకి మించి వస్తున్నందున ఆ నీరు వృథా కాకుండా వరద నీటి ఉధృతి వల్ల ఎక్కడా ఎలాంటి నష్టం జరగకుండా ఆ వరద నీటిని తీసుకుని వినియోగించుకునే అంశంపై సహేతుక దృష్టితో చర్యలు తీసుకోవాలి. తుంగభద్ర నుంచి వచ్చే నీటిని ఎక్కడో ఒకచోట మళ్ళించాలి. దీనిపై శ్రీశైలం పై ప్రాంతాల నుంచి వచ్చే వరద నీటి

ఉధృతి ప్రభావం కొంత మేర తగ్గించవచ్చు. రిజర్వాయర్‌కు ముప్పు కూడా తగ్గుతుంది.

**మంత్రాలయం వద్ద వరదకాలువ....**

ఆర్డీఎస్ (రాజోలిబండ రిజర్వాయర్)కు బ్రిజేష్‌మిశ్రా కమిటీ 4 టిఎంసీల నీటిని బ్రిజేష్ కమిటీ కేటాయించింది. అయితే సుంకేల రిజర్వాయర్ నుంచి 16 కిలోమీటర్లకు పైభాగం(అప్‌స్ట్రీమ్)లో గుండ్రేవుల వద్ద రిజర్వాయర్ ఏర్పాటు చేసుకోవచ్చు. దానిపైన ఆదోని నుంచి రాయపూర్ రైల్వే లైన్ దగ్గర మంత్రాలయానికి సమీపంలో ఉండే రాంపురం నుంచి వరద నీటిని తీసుకొచ్చే ఒక వరద కాలువను నిర్మించేందుకు వీలుంది. ఇది ఎందుకు తీసుకురావాలంటే కృష్ణాజలాలపై మనకున్న హక్కును పూర్తి స్థాయిలో వాడుకునేందుకు వీలుగా ఈ ఏర్పాటు జరగాలి. కెసి కెనాల్‌కు 39.9 టిఎంసీలు కేటాయించారు. 10 టిఎంసీల నీరు రిజర్వాయర్ నుంచి తీసుకొనే విధంగా కేటాయింపులు జరిపారు. మిగిలిన 29.9 టిఎంసీల నీటిని నది ప్రవాహం నుంచి తీసుకోవాలని చెప్పారు. అక్కడితో కమీషన్ ఆగలేదు. దీనిపై ఒక స్పష్టత కూడా ఇచ్చింది. ప్రతి ఏటా నదిలో నీటి ప్రవాహం తగ్గుతోంది. నీరు ప్రవహించే రోజులు కూడా తగ్గిపోతున్నాయి. కాబట్టి కేటాయించిన నీటి వినియోగానికి అనువుగా రిజర్వాయర్లు కట్టుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. నికర జలాల ఆధారంగా రిజర్వాయర్లు కట్టుకునే విధానాలనే కేంద్ర నీటిపారుదల సంఘం (ఇండియన్ ఇరిగేషన్ కమీషన్) అనుసరిస్తోంది.

75 శాతం ఆధారంగా(డిపెండబులిటీ) (ఉదా:-వంద సంవత్సరాల్లో 75 సంవత్సరాల నీటి ప్రవాహం) అంటే పైన 75 సంవత్సరాల్లో ఎక్కువ నీళ్ళు వస్తే, మిగిలిన 25 సంవత్సరాల్లో తగినంత నీరురాదు. అంటే తక్కువ వచ్చినట్లే కదా! దీనికి కూడా కమిటీలు ఒక సూచనచేశాయి. తక్కువ ప్రవాహం (లీన్ ఫ్లో) ఉన్నప్పుడు నీరు తక్కువగా వస్తుంది. 75 శాతం డిపెండబులిటీ ప్రకారం నీటి ప్రవాహం బాగా ఉన్నప్పుడే క్యారీఓవర్ కింద నీటిని తీసుకుని జాగ్రత్త చేసుకోవడం, అందుకోసం క్యారీఓవర్ రిజర్వాయర్లను నిర్మించుకోవాలని చెప్పారు. బచావత్‌గాని, బ్రిజేష్ మిశ్రా ట్రిబ్యునళ్ళు ఈ విషయాన్ని నొక్కి చెప్పాయి. ఇంకా దీనిపై మరో స్పష్టమైన విధానం కూడా సూచించాయి. 75 శాతం డిపెండబులిటీపై కాకుండా ముందు జాగ్రత్తగా కేవలం 50 శాతం డిపెండబులిటీని లెక్కలోకి తీసుకుని క్యారీఓవర్ రిజర్వాయర్లు

ఏర్పాటు చేసుకుని నీటిని నిల్వచేసుకుంటే ప్రయోజనం వుంటుందని చెప్పారు. నీరు అవసరమైనపుడు ఇబ్బంది పడే పరిస్థితి ఎదురుకాదని వారి ఇలా సూచనలు చేశారు. పెద్ద రిజర్వాయర్లు ఉన్నప్పటికీ క్యారీఓవర్ రిజర్వాయర్లు పెట్టుకోమని  చెప్పారు.

## 150 టిఎంసీలకు అనుమతి...

బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ క్యారీఓవర్ కింద 150 టిఎంసీల నీటిని తీసుకెళ్ళేందుకు అనుమతి ఇచ్చారు. 60 టిఎంసీలు శ్రీశైలం రిజర్వాయర్‌కు, 90 టిఎంసీలు నాగార్జున సాగర్‌కు కేటాయించారు. ఇంతేకాక బ్రిజేష్ కుమార్ 47 ఏళ్ళ కాలంలో యావరేజ్ తీసుకుని ఎక్కువ ప్రవాహాన్ని- తక్కువ ప్రవాహాన్ని రెండింటి సగటు లెక్కగట్టి ఒక్క చుక్క నీరు కూడా వృధా కాకుండా చూడాలని చెప్పారు. నికర జలాలను సమర్ధవంతంగా వినియోగించుకునేందుకు నీరు వృధాగా సముద్రం పాలు కాకుండా అవసరమైన మేర ఎన్ని రిజర్వాయర్లయినా కట్టుకోవచ్చున్నారు. అయితే వీటి నిర్మాణానికి ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు జరిపి త్వరితగతిన పూర్తి చేసుకోవాలి.

## గతంలో చూసే ఉంటారు 352 +459 టిఎంసీల కథ. ఇదేమిటంటే-

811 టిఎంసీల నీరు మూడు ప్రాంతాల వారికి రావాల్సి ఉండగా ఎగువ ప్రాంతాలవారు అంత ఇవ్వడం కుదరదని చెబుతున్నారు. 352 టిఎంసీల నీరు ఈ ప్రాంతంలో కురిసే వర్షాలతోనే సమకూరుతుంది (క్యాచ్ మెంట్ ఏరియాలో పడే వర్షం) ఇక 459 టిఎంసీల నీటినే (రివర్ అసిస్టెన్స్ క్రింద) ఇస్తామని వాదిస్తున్నారు. అంటే దీని ప్రకారం నదుల్లో, వాగుల్లో వచ్చే నీటిని వినియోగించుకోకుండా వాటిని క్రిందకు వదలి, ఆ తరువాత 811 టిఎంసీల నీరు కావాలంటే కుదరదు. వరదనీరు 352 టింసీల నీటిలో ఒక్క చుక్క కూడా వృధా కాకుండా కాపాడుకోవాలి. అప్పుడే కోస్తా, తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలకు కేటాయించిన నీటిని పూర్తిస్థాయిలో వినియోగిం చుకునేందుకు సాధ్యమవుతుంది. లేదంటే ప్రాంతాల మధ్య నీటి వ్యత్యాసం రోజు రోజుకూ పెరుగుతూనే ఉంటుంది. ఈ మొత్తం వ్యవహారం చూస్తే ఎక్కడికక్కడ రిజర్వాయర్లు కట్టేందుకు ఆస్కారముందో అక్కడ తక్షణం రిజర్వాయర్లను యుద్ధ ప్రాతిపదికన నిర్మించుకుని నీటిని నిల్వ చేసుకోవాలి.

కృష్ణా నదిలో 3 నుంచి 4 నెలలు మాత్రమే వరదనీరు ప్రవహించేది. అయితే ఇటీవల కాలంలో వరుసగా వరద ప్రవాహాలను పరిశీలిస్తే 3,4 నెలల నుంచి కేవలం 30 రోజులకు పడిపోయింది. అంతేగాక ఎగువ భాగంలో నిర్మించిన ఆల్మట్టి డ్యాంను 129 నుంచి 303 టిఎంసీలకు ఎత్తు పెంచేశారు. దీనివల్ల నీటి ప్రవాహం బాగా తగ్గిపోతుంది. వాస్తవంగా మొదట 75 శాతం డిపెండబులిటీ ప్రకారం, తరువాత 65 శాతం డిపెండబులిటీ ప్రకారం ట్రిబ్యునళ్ళు ఆదేశాల ప్రకారం కేటాయించిన నీటిని పంపిణీ చేయాలి. తర్వాత మిగులు జలాలను కూడా ఇచ్చిన దామాషా ప్రకారం పంపిణీ చేయాలి. కానీ ఆలా జరగటం లేదు. అనేక మెలికలు పెడుతున్నారు.

ఎగువ భాగం నుంచి వచ్చే నీటి ప్రవాహం తగ్గడం వల్ల శ్రీశైలంలోకి వచ్చి చేరే వరదనీరు బాగాతగ్గిపోతోంది. అంతేగాక కేవలం 30 రోజుల వ్యవధిలోనే నీరు ఎక్కువగా వస్తోంది. ఆ కాలంలోనే మనం నీటిని తీసుకుని నిల్వ చేసుకోవాలి. అప్పుడు ఆ పనిని చేయకపోతే నీటి సమస్య తప్పదు. నీటి యుద్ధాలు తప్పవు. నీటిని నిల్వ చేసుకొనకపోతే వృధాగా సముద్రం పాలవుతాయి. అందుకే పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ సామర్థ్యం పెంచింది. ఇక్కడ ప్రాజెక్టు అనుమతి, కేటాయింపు అంశంపై రాద్ధాంతాలు చాలా కాలంగా నడుస్తూనే ఉన్నాయి. కృష్ణా జలాల వినియోగంపై రాయలసీమకు ఏ హక్కులున్నాయి. ఇతర ప్రాంతాలకు ఏ హక్కులున్నాయి...? అనే అంశాలు చాలామంది మాట్లా డుతున్నారు. తెలంగాణ-కోస్తా ప్రాంతాలు నికర జలాలపై హక్కుల్ని ప్రస్తావిస్తూ ఎప్పుడూ వివాదం చేస్తున్నారు. ట్రిబ్యునల్ ముందు కూడా ఇలాంటి వాదనలే వినిపిస్తూ వచ్చారు ఇంతకాలం. అయితే ఈ సందర్భంలో కృష్ణా జలాలపై ఏర్పాటైన రెండు కమీషన్లు చెప్పిందేమిటంటే-ఒక్క చుక్క నీరు కూడా వృధా కాకుండా చూసుకోవాలని...ఒక్క ప్రకాశం బ్యారేజీ నుంచి ప్రతి ఏటా 700 నుంచి 800 టిఎంసీల నీరు వృధాగా సముద్రంలో కలుస్తోంది. ఇలా ఎందుకు జరుగుతోంది? వరదనీరు ఎక్కువగా ఉన్న సమయంలో నీటిని నిల్వ చేసుకోకుండా కిందికి వదిలేస్తున్నాం. దీని వల్ల తీవ్రంగా నష్టం జరుగుతోంది. శ్రీశైలంలో 854 అడుగుల కనీస నీటిమట్టం ఉండేలా చూసేందుకు బదులు 875 అడుగుల నీటి మట్టం ఉండాలన్న నిబంధనల కారణంగా కేటాయించిన నీటిని పోతిరెడ్డిపాడు ద్వారా అవసరాలకు మళ్ళిం చుకోలేకపోతున్నాం. వచ్చిన వరదనీటిని కింద ఉన్న నాగార్జున సాగర్‌కు వదిలాక అవి నిండాక మనం తీసుకుంటున్నాం. అప్పటికే నీళ్ళన్నీ

వెళ్ళిపోతాయి. వరదనీటి ప్రవాహం 30 రోజులలోపే ఉండటం వల్ల రాయలసీమ అవసరాలకు గండిపడుతోంది. 90-95 శాతం నాగార్జునసాగర్ తర్వాత వృధాగా సముద్రం పాలవుతోంది. ప్రకాశం బ్యారేజీ నుంచి నీటిని సముద్రంలో కలిసే మున్నేరు నదిపై 20 టిఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించుకుని నీటిని నిల్వచేస్తే ఎగువ ప్రాంతంలోని వారు వరదనీరు అందుబాటులో ఉన్నప్పుడే నీటిని తీసుకునే వీలుకలుగు తుంది. అక్కడ సాగునీటి, తాగునీటి అవసరాలు తీర్చుకోవచ్చుగాని రాయలసీమ అవసరాలు, క్రింది వారి అవసరాలు తీరిన తర్వాత తీర్చుకోవడం కుదరదు.

హెచ్.ఎన్.ఎస్.ఎస్. (హంద్రీ-నీవా సుజల స్రవంతి) దగ్గర విద్యుత్ కోసం భారీఎత్తున ఖర్చు చేస్తున్నాం. అలా అని... ప్రకాశం బ్యారేజి నుంచి క్రిందకు వృధాగా సముద్రంపాలు చేసే నీటిని రాయలసీమకు తీసుకురావడం కుదరదు. కష్టమైన పనికూడా. అందుకే ఈ ప్రయోజనమేదో ముందుగానే పై భాగాన ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

వరద నీరు వచ్చినపుడు ఆ నీటిని సద్వినియోగం చేసుకునే వ్యవస్థ, విధానం ఏర్పాటు చేసుకోకపోవడం వల్లే నీటి వృధా జరుగుతోంది. శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతల, ప్రకాశం నిండాకగాని కిందకు వదలకూడదు. సమానంగా పంపిణీ చేస్తే పోతిరెడ్డి పాడు ద్వారా రాయలసీమ అవసరాలకు తగినంత నీటిని ఏ ప్రాంతానికి తక్కువ చేయకుండా, ఎవరి నీళ్ళు దోచుకోకుండా వాడుకోవచ్చు. కానీ అలా జరగడం లేదు. కిందకు లక్ష క్యూసెక్యుల నీరు వదులుతున్నప్పుడు రాయలసీమకు కనీసం 20 వేల క్యూసెక్కుల నీరన్నా ఇవ్వాలి. ఇలాంటి విధానం లేకపోవడం వల్ల, లోపాల వల్ల ప్రాంతాల మధ్య నీటి అసమానతలు, ఇబ్బందులు వచ్చి పడుతున్నాయి. ఏక కాలంలో అన్ని రిజర్వాయర్లకు, కాలువలకు, నీటి పంపిణీ అనేది ప్రధాన అంశం. దిగువ ప్రాంతాల వారికి నికర జలాలు, రాయలసీమకు మిగులు జలాలు అన్నది వాస్తమే అయినప్పటికీ... వృధాగా సముద్రమంలో నీటిని కలిపే కంటే రాయలసీమ అవసరాలకు నీరిస్తే వచ్చే నష్టమేముంది. వందల టిఎంసీల సముద్రం పాలుచేసేందుకు సిద్ధంగా ఉన్న కోస్తాంధ్ర సంపన్న రైతులు, వారి ప్రతినిధులు రాయలసీమ ప్రాంతం ఎడారి కాకుండా నీరు వాడుకోవడానికి సమేమిరా అంగీకరించరు.

**జీవో 69ని రద్దుచేయాలి...**

ఇవన్నీ జరగాలంటే మొదట జీవో 69ని రద్దుచేయాలి. లేదంటే మౌళిక

మార్పులు చేయాలి. 69 జీవోలో పేర్కొన్న శ్రీశైలం కనీస నీటి మట్టం 834 రాగానే నీటినికిందకు వదలాలనే నిబంధనను తొలగించాలి. 107 జీవోలో ఇదే నిబంధన 854 అడుగులకు పెట్టారు. అయితే రాజకీయ నాయకులు మూకుమ్మడిగా రాయలసీమ అవసరాలను బలిపెడుతూ 69 జీవో ప్రకారం 834 అడుగుల కనీస నీటిమట్టం శ్రీశైలంలో ఉంచాలని పేర్కొన్నా అందులోనే ఒక లొసుగు పెట్టారు. "అవసరమైతే నాగార్జున సాగర్‌కు, డెల్టా ప్రాంతానికి నీళ్ళు తీసుకుపోవచ్చు..." అని. దీనిపైన వారు ఇష్టానుసారంగా నీటిని తరలించుకుపోయి రాయలసీమకు నీరందకుండా చేస్తున్నారు. 107 జీవో ప్రకారం 854అడుగుల కనీస నీటిమట్టం శ్రీశైలంలో ఉంచాలని తీర్మానించినా... దానికి కట్టుబడి ఉండే పరిస్థితి కనిపించడంలేదు. గత పరిస్థితిని ఒక్కసారి గమనిస్తే...పెద్ద మొత్తంలో వరదనీరు వచ్చింది. కానీ నీరు రాకపోయి ఇన్‌ఫ్లోస్ తగ్గితే నీరు తగ్గుతుంది. అప్పుడు జీవో 69 ప్రకారం 834 అడుగుల నీటి మట్టం ఉన్నప్పుడు కూడా నీటిని తరలించుకుపోయే నిబంధనల సాకుతో అవసరాలంటూ నీటిని తరలిచుకుపోయి శ్రీశైలంను ఖాళీ చేస్తున్నారు. ఇక రాయలసీమ పరిస్థితి ఎంటి? 854 అడుగుల వద్ద పోతిరెడ్డిపాడుకు నీళ్ళిచ్చే మార్గం (స్పిల్ లెవెల్) ఉంది. 834 అడుగులకు రాగానే నీటిని తరలించుకుపోతే ఇక తాగేందుకు కూడా రాయలసీమకు నీళ్ళురావు. 834 అడుగుల దగ్గర డెల్టా, తెలంగాణాకు నీరిచ్చేందుకు అవకాశం ఉంది. గేట్లు తెరిస్తే నీళ్ళన్నీ కిందకు పరుగులు తీస్తాయి. ఎస్.ఎల్.బి.సికి స్పిల్ లెవెల్ 825 అడుగుల వద్ద ఉంది. కల్వకుర్తి లిఫ్ట్‌కు 802 అడుగుల వద్ద స్పిల్ లెవెల్ ఉంది. 834 అడుగుల కంటే తక్కువ ఉన్నా నీటిని వాడుకునేందుకు ఆస్కారం ఉంది. కానీ రాయలసీమకు అలాంటి అవకాశం ఎక్కడుంది?

మనిషి రానురాను మారిపోతున్నాడు. తన స్వార్థం తప్ప మిగిలిన వారి ప్రయోజనాలు పట్టించుకోవడంలేదు. అది వ్యక్తిగతంగాను, ప్రాంతీయంగానూ జరుగుతోంది. ఇదే నీటి విషయంలో మనకు స్పష్టంగా కనిపిస్తున్న విషయం. ఈ సందర్భంలో రాయలసీమ ప్రజల విజ్ఞప్తి ఏమిటంటే– మిగిలిన ప్రాంతాల వారికి ప్రకాశం బ్యారేజీ వుంది. పులిచింతల ఉంది. నాగార్జున సాగర్ ఉంది. శ్రీశైలం రిజర్వాయర్‌పై తెలంగాణ మరో రెండు ప్రాజెక్టులను మిగులు జలాల ఆధారంగా కడుతున్నారు. అంటే ఎగువున ఉన్నవారు ఎగువనే నీటిని మళ్ళించుకుని వాడుకుంటున్నారు. కింది వారు గేట్లు

తెరిపించుకుని ప్రాజెక్టులో ఉన్న నీటికి కిందకు తరలించుకు పోతున్నారు. మధ్యలో ఉన్న రాయలసీమ పరిస్థితి ఏమిటి?

**ఒక్క పంట పండకపోయినా ఆత్మహత్యలే శరణ్యం...**

నేడు పరిస్థితి ఏమిటంటే ఒక్క సీజన్‌లో నీళ్ళు రాకపోయినా పంటలు పండక పోయినా... రైతులు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి నెలకొంటుంది. రాయల సీమకు తప్ప మిగిలిన అన్ని ప్రాంతాలవారికి ప్రాజెక్టుల్లో నుంచి ఎప్పుడు అవసరమైతే అప్పుడు నీళ్ళు తీసుకోవడానికి ఆస్కారం ఉంది. కానీ రాయలసీమకు అలాంటి పరిస్థితి, వెసలుబాటు లేదు. 854 అడుగుల కనీస నీటిమట్టం శ్రీశైలంలో ఉండాలన్న నిబంధన అన్నింటికీ అవరోధంగా నిలుస్తోంది. కాబట్టే ఈ నిబంధనను తక్షణం తొలగించాలి. లేదా 69 జీవోను రద్దుచేయాలి. రాయలసీమకు మిగిలిన ప్రాంతాలలాగా ఎప్పుడు నీళ్ళు తీసుకోవడానికి అవకాశం ఉంటే అప్పుడే తీసుకునే వీలుకల్పించాలి. ఈ విషయాలేమీ రాయలసీమ ప్రజాప్రతినిధులు మాట్లాడటంలేదు. ఈ ప్రాంతానికి చెందిన సాగునీటి నిపుణులు ఎన్నో మార్లు భవిష్యత్ ప్రమాదాన్ని గుర్తు చేసినా వాటిని ప్రజా ప్రతినిధులు చెవికి ఎక్కించుకోవడం లేదు. సమయానుసారం అవసమైన వేదికలపై తమ వాదనను వినిపించి, రాయలసీమకు మేలు జరిగేలా చూడటం లేదు. అన్నింటికీ వారి రాజకీయ ప్రయోజనాలను ముడిపెట్టుకుని ఇక్కడి ప్రజలను బలి తీసుకుంటు న్నారు. వారి నిర్లక్ష్యంవల్ల ఈ ప్రాంతానికి సాగు, త్రాగు నీరు అందకుండా పోతున్నాయి.

శ్రీశైలం రిజర్వాయర్‌లో 854 అడుగుల నీటి మట్టం అంటే 13 (841 నుంచి 854 అడుగుల మధ్యలో) అడుగుల నీళ్ళు ఉంటాయి. పై ప్రాంతాలనుంచి ఎక్కువ వరదనీరు వచ్చినపుడు డిశ్చార్జ్ కూడా ఎక్కువగానే ఉంటుంది. మిగిలిన సమయంలో ప్రవాహం సాధారణంగా ఉంటుంది. అయితే రాయలసీమకు ఇబ్బంది కరమైన పరిస్థితి ప్రతిసారి కలుగుతోంది కాబట్టి మనకు కేటాయించిన ఎస్.ఆర్.బి.సి 19 టి.ఎం.సీలు+15 టిఎంసీలు తెలుగుగంగకు, సర్‌ప్లస్ వాటర్ 25 టిఎంసీలు మొత్తం 59 టిఎంసీలు. క్యారీఓవర్ కింద మొత్త 60 టిఎంసీలు పెట్టారు. ఈ 60 టిఎంసీల నీటిని రిజర్వాయర్‌లోనే ఉంచేలా చూసుకోవడం ఇక్కడ ముఖ్యమైన విషయం...

834 ఎండిడిఎల్ (మినిమమ్ డ్రా డౌన్ లెవెల్) శ్రీశైలం రిజర్వాయర్‌లో

నీరు నిల్వఉన్నప్పుడు 53.851 టిఎంసీల నీరు అందుబాటులో ఉన్నట్లు లెక్క. దీనికి 60 టిఎంసీలను కలిపితే 113.851 టిఎంసీలు అవుతుంది. ఈనీటిని జూన్ మొదటివారం నుంచే నిల్వ ఉంచాలి. డిశంబర్ చివరి వరకు ఈ నీటి నిల్వలను ఇలాగే కొనసాగించాలి. ఇంత కంటే ఎక్కువ నీటిని రిజర్వాయర్‌లో నిల్వ ఉంచేలా చూడాలి. ఇది ప్రభుత్వాల బాధ్యత. జూన్ నెలలో నారు మళ్ళు వేయాలంటే పోతిరెడ్డిపాడు కింద ఆధారపడ్డ ప్రాజెక్టులకు అన్నింటికీ ఇచ్చేందుకే 60 టిఎంసీల నీటిని ప్రాజెక్టులో ఉంచాలి. అందుకే క్రింది వారితో పై ప్రాంతాల వారితో సంబంధం లేకుండా ప్రాజెక్టు ఎగువ భాగంలో సిద్ధేశ్వరం వద్ద 50 టిఎంసీల సామర్థ్యంలో ఒక రిజర్వాయర్ నిర్మిస్తే రాయలసీమ అవ సరాలకు అవసరమైన నీటిని అవసమైన సమయంలో తీసుకునే వీలు కలుగు తుంది. లేదంటే వచ్చిన నీటిని క్రిందకు వదలి సముద్రం పాలు చేసి, ఆపై ఉన్న నీటిని మిగిలిన ప్రాంతాల వారు తమ అవసరాలకు వినియోగించుకుని రాయలసీమకు మొండి చేయి చూపిస్తున్నారు. ఇక్కడ ఉన్న రైతులు రైతులు కానట్లు... ఇక్కడి సాగు, త్రాగు నీటి అవసరాలు అసలు అవసరాలే కాదన్నట్లు వ్యవహరిస్తున్నారు. అభివృద్ధి నమూనా అంటే అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందడం అన్న దానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారు.

అసలు విషయమేమంటే- 113.851 టిఎంసీల నీరు రాయలసీమ అవసరాలకు కేటాయించిన, ఉద్దేశించిన నీటిని ఉంచి ఆపై ఎంతైనా వారు తీసుకు పొమ్మనండి. ఎవరూ వద్దనరు. విద్యుత్ ఉత్పత్తి కోసం, నారు మళ్ళ కోసం, త్రాగు నీటి కోసం అంటూ శ్రీశైలంలో ఉన్న నీటిని తరలించుకుపోయి రాయలసీమకు నీరందకుండా చేస్తున్నారు. ఇదేమి అన్యాయం? ఒక ప్రాంతానికి గుక్కెడు నీళ్ళు కూడా ఇవ్వకుండా చేసే దుర్మార్గ చర్యలేమిటి?

బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం 60 టిఎంసీల నీరు పోతిరెడ్డి పాడు కింద ఆధారపడ్డ ప్రాజెక్టులకు కచ్చితంగా ఇచ్చి తీరాలి. ఈ ఏర్పాటు ఇకపై తప్పకజరగాలి. లేకపోతే రాయలసీమ ప్రాంతం శాశ్వతంగా కరువు ప్రాంతంగా ప్రకటించుకోక తప్పదు.

ఇటీవలి కాలంలో ప్రభుత్వం 854 ఎం.డి.డి.ఎల్ వరకు నీటిని ఉంచాలన్న నిర్ణయానికి కట్టుబడే ఉంది. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం 854 ఉన్నప్పుడు ప్రాజెక్టులో నీరు 89.29 టిఎంసీలు ఉంటుంది. పోతిరెడ్డిపాడు కింద ఉన్న ప్రాజెక్టులకు

కేటాయించిన 60 టిఎంసీలను కలపుకుని మొత్తం 149.29 టిఎంసీలు నీటిని నిల్వచేస్తే ఏ సమస్యారాదు. అయితే ఇంత సామర్థ్యం నీరు శ్రీశైలం ప్రాజెక్టులో ఉండాలంటే 871.5 అడుగు నీటిమట్టం ఉండాలి. కానీ ఏనాడూ ఇది పాటించలేదు. అన్నిప్రాంతాల మేధావులకు, నీటిపై రాద్ధాంతం చేసే రాజకీయ నాయకులకు ఈ విషయాలన్నీ తెలుసు. కానీ రాజకీయ ప్రయోజనాల కోసం నోటికి వచ్చినట్లు మాట్లాడు తున్నారు. ప్రజలను ప్రాంతాల వారీగా విడగొట్టి జల జగడాలు సృష్టించి వారి మధ్య పచ్చగడ్డి వస్తే భగ్గుమనే పరిస్థితిని తీసుకొచ్చారు. ఇలా దశాబ్దాల పాటు కాలం గడుపుతూ రాజకీయాలు కొనసాగిస్తున్నారు.

నీటి సమస్యలను మూడు ప్రాంతాలకు చుట్టి ఇపుడు రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సమస్యగా తెచ్చిపెడుతున్నారు. ఇది ఎంతఅన్యాయం. కేటాయింపుల ప్రకారం ఏ ప్రాంతానికి రావలసిన అందవలసిన నీటిని ఆ ప్రాంతానికి ఇస్తే ఏ సమస్యాలేదు. ఎవరూ బాధపడవలసిన అవసరం లేదు. కానీ అలా చేయటం లేదు. అక్కడే సమస్య వస్తోంది. అయితే లీన్ పీరియడ్‌లో మినహా అంటే వర్షాభావ పరిస్థితులు నెలకొని వరద ప్రవాహం లేనపుడు తప్ప మిగిలిన అన్ని సందర్భాల్లో మూడు ప్రాంతాలకు వారి అవసరాలకు ఎవరి అవసరాలను దెబ్బతీయని రీతిలో నీరు అందించవచ్చు. వినియోగించుకునే వీలుంది.

### ఇంకా విశదంగా దీని గురించి చర్చించుకుంటే...

కృష్ణా నదికి ప్రధానంగా ఉన్నవి భీమా, తుంగభద్ర. భీమా అంతా తెలంగాణా పరిధిలోకి వెళుతుంది. ఇక రాయలసీమ వరకు ఉన్నది తుంగభద్ర. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం తుంగభద్ర నుంచి క్రిష్ణా నదికి ఇవ్వాల్సిన వాటా కేవలం 31.45 టిఎంసీలు మాత్రమే. కానీ ఇటీవల వచ్చిన వరద నీటిని పంపిణీ చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఈ ఏడాది 250 టిఎంసీల నీటిని పంపిణీ చేశారు. అంటే ఈ నీటిని అంతా ప్రకాశం బ్యారేజి నుంచి సముద్రం పాలు చేశాం. అందుకే ఈ నీటి వృధాను, రాయలసీమ అవసరాలకు ఉప యోగపడకుండా సముద్రం పాలవుతున్న నీటిని తుంగభద్ర నుంచి పెన్నా నదిలోకి మళ్లించే కార్యక్రమాన్ని చేపట్టాలి. ఇదొక్కటే మార్గం.

**తుంగభద్ర నుంచి పెన్నా బేసిన్‌లోకి నీటిని మళ్ళించాలి :**

తుంగభద్ర నీటిని రాంపురం నుంచి వెడల్పు కాలువను ఏర్పాటు చేసుకోవడం ద్వారా తీసుకునే వీలుంది. ఇక్కడ ఇంకో విషయం గుర్తుంచుకోవాలి. శ్రీశైలం ప్రాజెక్టును రక్షించుకోవాలంటే కృష్ణా జలాల డిశ్చార్జ్ కెపాసిటీని తగ్గించాలి. తగ్గించేందుకు ఈ డైవర్షన్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆర్డీఎస్ నుంచి వాస్తవంగా 29.90 టిఎంసీలు తీసుకోవాలి. ఇప్పుడు రాయలసీమ అవసరాల కోసం నిర్మించిన ప్రాజెక్టుల కెపాసిటి కేవలం 4.5 టిఎంసీలు మాత్రమే. సుంకేసుల రిజర్వాయర్ 1.2 టిఎంసీల కెపాసిటి. అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సామర్థ్యం 2.965 టిఎంసీలు.

కేటాయించిన 29.90 టిఎంసీల నుంచి ఈ 4.5 టిఎంసీల నీరు పోను మిగిలిన నీటిని వాడుకోవాల్సిన అవసరం ఉంది. అంటే దాదాపు 19 టిఎంసీల నీటిని తీసుకునే వీలుంది. కెసి కెనాల్ ద్వారా ఈ నీటిని వాడుకునే హక్కు కల్పించారు. ఈ కొద్ది పాటి నీళ్ళు రాయలసీమకు ఇస్తే నారుమళ్ళు వేసుకునేందుకు ఎలాంటి ఇబ్బంది కలగదు. దీనితోడు వరుణుడు కరుణిస్తే పంట చేతికందుతుంది. కనీసం ఒక పంటను రాయలసీమ రైతులు పండించేందుకు అవకాశం ఉంటుంది.

రాష్ట్ర విభజన తరువాత చాలా మంది మాట్లాడుతున్నారు. రాయలసీమకు రాజధాని ఇవ్వాల్సి వస్తుందన్న కారణంతో ఏవేవో జిమ్మిక్కులు చేశారు. 1953కు ముందున్న పరిస్థితిని పునరుద్ధరించకుండా రాజధానిని కోస్తాకు తరలించుకుపోయారు. ఇక రాష్ట్ర విభజనకు ముందే పోలవరంను జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించుకున్నారు. ఇక ఉన్నది శ్రీశైలం. దీనినుంచి కూడా అవసరమైన నీటిని దండుకునేందుకు ఒకవైపు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. కానీ తెలంగాణ రాష్ట్రం అడ్డు తగలకుండా, ఇప్పుడు రాష్ట్ర నీటి అవసరాలు చూపించాల్సి కాబట్టి కొత్తగా ఎప్పుడూలేని ఆదరణ, కరుణ, ప్రేమ రాయలసీమ పట్ల చూపుతూ శ్రీశైలం నీటిని నిల్వ చేసి రాయలసీమ అవసరాలు తీరుస్తామని చెబుతున్నారు.

**సీమ వాటా నీటి కోసం పెద్ద ప్రాజెక్టు అవసరం...**

అయితే నిబద్ధతతో చేయాల్సిన పని ఒక్కటే. శ్రీశైలంను రక్షించుకుంటూనే

రాయలసీమ అవసరాలను తీర్చే విధంగా పెద్ద రిజర్వాయర్‌ల నిర్మాణం చేపట్టాలి. అదికూడా రాయలసీమకు కేటాయించిన నీటిని మాత్రమే నిల్వ చేసుకుని వాడుకునే విధంగా. పైన చెప్పుకున్నట్లు 19 టిఎంసీ నీటినే కాకుండా, వరద ప్రవాహం ఉన్న రోజుల్లో రోజుకు 3 టిఎంసీల నీరు నిల్వ చేసుకునే విధంగా రిజర్వాయర్‌లు నిర్మించుకోవాలి. ఇలాచేస్తే శ్రీశైలంపై రాయలసీమ వాసులు ఆధారపడే పనే ఉండదు. ఈ నీటి నంతా ఎస్.ఆర్.ఎం.సి. (శ్రీశైలం కుడి ప్రధాన కాలువ)లో తరలించాలి. ఇక పోతిరెడ్డి పాడునుంచి తీసుకునే అవసరం కూడా కలగదు. గడచిన సంవత్సరాలలో కెపాసిటీకి మించిన వచ్చిన నీటిని వృధాగా కిందకు వదలి కింద ప్రాంతాల్లోని ప్రాజెక్టులు నింపుకుని ఆపై ప్రకాశం బ్యారేజి వందల టిఎంసీల నీటిని సముద్రం పాలు చేసే కంటే 60 టింఎంసీల కెపాసిటీ ఉన్న రిజర్వాయర్‌ను నిర్మిస్తే రాయలసీమ సస్యశ్యామం అవుతుంది. నలుగురికి అన్నంపెట్టే రైతన్నల ఆత్మహత్యలు తగ్గుతాయి. పనులు లేకపోవడం వల్ల వస్తున్న ముఠా తగాదాలు తగ్గుతాయి. కోస్తాలో లాగా వ్యవసాయంపై వచ్చే మిగులుతో ఇక్కడ అనేక ఇతర వ్యాపార, పారిశ్రామిక కార్యక్రమాలకు  పెట్టుబడులు పెట్టే విధంగా ఇక్కడి వారు తయారవుతారు. ఒక్క నీటి వల్ల ఎంతో అభివృద్ధి జరుగుతుంది. అదే రాయలసీమ వాసులు కోరుకుంటున్నారు.

వృధాగా సముద్రం పాలయ్యే వరద నీటిని నిల్వ చేసుకునేందుకు రాయల సీమలో రిజర్వాయర్లు ఉన్నాయా? ఎన్ని ఉన్నాయి? తక్షణం యుద్ధ ప్రాతిపదికన ఎన్నింటిని నిర్మించవచ్చు? అని తేల్చుకుని వరద నీటిని నిల్వ చేసుకునే స్థితికి చేరు కోవాలి. పెద్ద పెద్ద ప్రాజెక్టులకు బదులు చిన్న చిన్న రిజర్వాయర్లు అంటే వరద నీరు ప్రవహించే ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నీరు నిల్వ ఉంచుకుని ఆయా ప్రాంతాలకు సాగు, తాగు నీటి అవసరాలు తీర్చే విధంగా స్థానిక సంస్థల నిధులతో కూడా వాటిని నిర్మించుకోవాలి. వీటిపైనే ప్రధానంగా రాజకీయాలకు అతీతంగా దృష్టి సారించాలి. అర టిఎంసీల సామర్థ్యం మొదలుకుని వీలున్నంత మేర ఇలాంటి రిజర్వాయర్లకు పెద్ద చెక్ డ్యాంలకు కనీసం 500ల ఎకరాల సాగుకు పనికి వచ్చే నీటి నిల్వను చేసే వాటికి శ్రీకారం చుట్టాలి.

ఉదాహరణకు గత లెక్కల్ని పరిశీలిస్తే కర్నూలు జిల్లా నంద్యాల నుంచి ఒక్క ఏడాదిలో సుమారు 70 టిఎంసీల వరద నీరు, కుందూనీరు ప్రవహించింది. ఇది కేవలం నంద్యాల ప్రాంతం మాత్రమే . ఈ లెక్కలు చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది.

ఈ నీటిని నిల్వ చేసుకునే రిజర్వాయర్లు, పెద్ద చెక్‌డ్యాంలు లేకపోవడం వల్ల చోద్యం చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. అంత నీటిని వడిసి పట్టుకుని ఉంటే ఎలా ఉండేది ఒక్కసారి ఆలోచించండి! అందుకే కుందూ, పెన్నా నదులపై పెద్ద సంఖ్యలో డ్యామ్‌లు నిర్మించాలి. ఇదీ కూడా జీరో ల్యాండ్ అక్విజేషన్ (భూసేకరణతో సంబంధం లేకుండా) వరద వచ్చినపుడు ఎంత మేర భూమి మునకకు గురవుతూ ఉందో అంతే భూభాగాన్ని తీసుకుని పెద్ద చెక్‌డ్యాంలు, రిజర్వాయర్లు చేపట్టాలి. భూమి యొక్క స్థితిని బట్టి ఇలాంటి పెద్ద చెక్‌డ్యాంలు, రిజర్వాయర్లు పది కిలోమీటర్లకు ఒకటి లేక 15 కిలో మీటర్లకు ఒకటా అన్నది ఆలోచించాలి. ప్రభుత్వం శాశ్వత ప్రాతిపదికన సర్వేచేయించి, నిధులను విరివిగా విడుదలచేసి  డ్యాంలు నిర్మించాలి.

బ్రిజేష్ కుమార్ మొత్తం నీరు సగటు లెక్కగట్టి పంపిణీ చేశారు. కాబట్టి ఒక్క చుక్క కూడా వృధా కాకుండా వినియోగించుకోవాలి. లేదంటే సమస్య తప్పదు.

పోతిరెడ్డిపాడు తరువాత పాములపాడు నుంచి ఎస్.ఆర్.ఎంసీ కెనాల్ వెళు తోంది. దాని పైభాగంలోనుంచే డైవర్షన్ కెనాల్ ఏర్పాటు చేసుకోవాలి. మంత్రాలయం, గూడూరు, సి.బెలగళ్, ధూపాడు, నందికొట్కూరు, మిడుతూరు, పాములపాడు, నల్ల కాలువ వరకు గ్రావిటీతో నీరు ప్రవహిస్తుంది. ఈ నీళ్ళన్నీ బనకచర్ల రెగ్యులేటర్‌కి, పోతిరెడ్డిపాడుకు మధ్యలో వచ్చిచేరుతాయి. బనకచర్ల నుంచి నీటి మళ్ళింపుకు ఉన్న సౌలభ్యాన్ని బట్టి పంపిణీ చేస్తాం. ఇలా పెద్దఎత్తున వచ్చే వరదనీటిని మళ్ళించి తీసుకురావడం వల్ల శ్రీశైలంకు రక్షణ ఏర్పడుతుంది. మరియు ఇక్కడ ఇంకో విషయం. కెనాల్ ద్వారా పై నుంచి వరద నీటిని మళ్ళించడం వల్ల  సిల్ట్ కూడా రిజర్వాయర్‌లోకి చేరదు. తద్వారా పెరుగుతున్న పూడికను తగ్గించే వీలుకలుగుతుంది. ఈ వరద కాలువ వల్ల శ్రీశైలం పై వరద ప్రవాహం ఒత్తిడి తగ్గి డ్యాము రక్షణలకు వీలు కలుగజేస్తుంది.

ఇంత ఎందుకు చెబుతున్నామంటే పై ప్రాంతాల వారు జూరాల  నుంచి నీటిని తీసుకునే వెసలుబాటు ఉంది. అవసరమైతే విద్యుత్ ఉత్పత్తి పేరుతో ఉన్న నీటిని తోడుకుంటారు. వాళ్లకి సమస్యరాదు. అందుకే రాయలసీమ అవసరాలు తీర్చేందుకు ఉద్దేశించిన నీటిని రాయలసీమ కోసం ప్రత్యేకత ఉంచండి అన్నది మన నినాదం. ఆపై ఎన్ని వందల టిఎంసీల నీటిని తీసుకుపోయినా ఎవరికీ అభ్యంతరం లేదు. క్యారీఓవర్ కింద 60 టిఎంసీల నీళ్ళిస్తేచాలు. అదే పదివేలు. అదే లక్ష కోట్లు.

834 అడుగుల నీటి మట్టం ఉన్నప్పుడు 53 టిఎంసీలు ఉంటాయి. దీనికి 60 టిఎంసీలు అంటే 862 అడుగు మేర నీరు ఉండాల్సి వస్తుంది. పై ప్రాంతాల నుంచి వచ్చే నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టే నాటికి చివరి రోజుకు రాయలసీమ అవసరాలకు అగుణంగా 60 టిఎంసీల నీరు ఉంచితే చాలు. అదే ఇక్కడి ప్రజలు కోరుకునేది. మరో చుక్క నీరు మాకు అక్కర్లేదు. అందుకే సిద్ధేశ్వరం ప్రాజెక్టు కట్టమంటున్నాం. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ప్రకారం 862 పైన ఉండాలి. కానీ ఏ ప్రభుత్వం దాన్ని పాటించడంలేదు. రాయలసీమకు వినియోగించే 60 టిఎంసీల నీటిని తీసుకునే విషయంలో మొదట్నుంచీ డెల్టావారే అడ్డుతగులుతూ వచ్చారు. ఇకపై కూడా ఇలాగే ఉంటామంటే రాయలసీమ ప్రజలు ఏంకావాలి? మాకు లేకుండా రాయలసీమ వాళ్ళే నీళ్లు వాడుకుంటున్నారని ఆరోపణలుచేసి ఇక్కడి నాయకుల నోర్లు నొక్కి నీళ్లు తీసుకుపోతున్నారు. కానీ వందల టిఎంసీల నీరు సముద్రం పాలవుతున్నా వీరు ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. సముద్రం పాలయ్యే నీటినే ఇవ్వమని అడిగితే సాకులు, సవాలక్ష అభ్యంతరాలు, రాయలసీమ ప్రజలను మిగిలిన ప్రాంతాల వారి ఎదుట నీటి దొంగలుగా, దుర్మార్గులుగా నిలబెడుతున్నారు. వీరు చెబుతున్నట్లు నీటిని వినియోగించుకుంటే రాయలసీమలో మునుపటి కంటే ఒక్క ఎకరా భూమి సాగైనా పెరగాలి. ఒక్కడి రైతు జీవితంలోనైనా ఆర్థిక ఎదుగుదల కన్పించాలి. ఆత్మహత్యలు ఆగాలి. వలసలు లేకుండా పోవాలి. కరువు పరిస్థితులు రాకుండా ఉండాలి. ఏదీ ఈ మార్పులు రాలేదే.

**( రిటైర్డ్ ఇంజనీరు సుబ్బరాయుడు గారి అభిప్రాయాలకు అక్షర రూపం**

**వనం శర్మ, పెన్నేరు సంపాదకులు)**

# కర్నూల్ జిల్లా పశ్చిమ మండలాల వరదప్రదాయిని వేదవతి

**కర్నూల్** జిల్లాలోని పశ్చిమప్రాంత మండలాలు హాలహర్వి, హోలగొంద, కౌతాలం, ఆదోని, ఎమ్మిగనూర్, కోడుమూర్లు అత్యంత కరువుపీడిత ప్రాంతాలు. వీటికి తాగు, సాగు నీరందించే ఏకైక జల వనరు తుంగభద్ర దిగువ కాలువ. 24 టిఎంసిల నీరు కేటాయించబడ్డ ఈ దిగువకాలువ ఆయకట్టు లక్షా 50 వేల ఎకరాలు కాగా, దీనిపైనే 145 గ్రామాలు తాగునీటిపై ఆధారపడి ఉన్నాయి. 324కి.మీ.ల పొడువున్న ఈ కాలువలో 0 నుండి 250కి.మీ. వరకు తుంగభద్రా బోర్డ్ పర్యవేక్షణ వుంటుంది. 0నుండి 131కి.మీ. వరకు ఈ కాలువ కర్నాటక రాష్ట్రంలో ప్రవహిస్తుంది.

24 టిఎంసిల నీటి కేటాయింపు ఉన్నా ఆయకట్టుదారులు కొన్ని దశాబ్దాలుగా ఏనాడు 10 టిఎంసిలకు మించి నీటిని పొందలేదు. తుంగభద్ర డ్యాంలో పూర్తి సామర్థ్యం మేరకు నీరు చేరక పోవడం, డ్యాంలో పూడిక చేరడం, కర్నాటక ప్రాంతంలో అనధికార సాగువల్ల దిగువ కాలువ ఆయకట్టుదారులకు తీవ్ర నష్టం జరుగుతోంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారమే గతేడాది కేవలం 24వేల ఎకరాలకు మాత్రమే సాగు నీరందింది.

ఈ సందర్భంగా దిగువ కాలువ ఆయకట్టు స్థిరీకరణకైవున్న ఏకైక ప్రత్యామ్నాయం ఆ ప్రాంతంలో ప్రవహించే వేదవతి నదీ జలాలను వినియోగించుకోవడమేనని విశ్రాంత ఇంజనీర్ సుబ్బా రాయుడు గారు స్పష్టం చేస్తున్నారు.

అంతరాష్ట్ర నది అయిన వేదవతి(హగరి), వేద-అవతి అనే రెండు ఏరుల కలయికతో ఏర్పడింది. కర్నాటక రాష్ట్రంలోని పశ్చిమ కనుమలలోని బాబుబుడాన్ గిరి ప్రాంతలో మొదలైన ఈ నది కర్నాటక సరిహద్దు దాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం జిల్లాలోని భైరవాని తిప్ప దగ్గర ప్రవేశించి మరికొంతదూరం ప్రవహించిన తర్వాత ఆంధ్ర-కర్నాటక (అనంతపురం-బళ్ళారి) సరిహద్దుగా ప్రవహిస్తుంది. ఆ తర్వాత తిరిగి కర్నాటకలో ప్రవేశించి కొన్ని మైళ్ళ ప్రవాహం తర్వాత బళ్లారి-కర్నూల్

జిల్లాల సరిహద్దుగా మారి కర్నూల్ జిల్లాలో తుంగభద్రా నదిలో కలుస్తుంది. ఈ నది కర్నాటకలో 182 మైళ్ళు, ఆంధ్రప్రదేశ్‌లో 45 మైళ్ళు, ఇరురాష్ట్రాల సరిహద్దుగా 16 మైళ్ళు... మొత్తం 243 మైళ్ళ ప్రయాణం సాగిస్తుంది.

బచావత్ కమీషన్ వేదవతిని కృష్ణ బేసిన్ కె-9 సబ్‌బేసిన్ నదిగా పరిగణిస్తుంది.

1973లో బచావత్ కమీషన్ కృష్ణా జలాలను మహారాష్ట్ర, కర్నాటక, అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య పంపిణీ చేసింది. కాని ఆ సమయంలో వేదవతి జలాల లభ్యతపై తగినంత పరిశోధ నాత్మక సమాచారం లేకపోవడంతో వేదవతిలో 50 టిఎంసిల జలాలు లభ్యం కావచ్చనే అంచనాతో 75% ఆధారితంగా పైరాష్ట్రాలకు పంపిణీ చేసింది. అయితే వేదవతి కేవలం కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోనే ప్రవహిస్తూంది కాబట్టి ఆనదీ జలాలను ఆ రెండు రాష్ట్రాల మధ్యనే పంపిణీ చేసింది.

కర్నాటకలోని..

వాణి విలాస్ సాగర్‌కు 5.90 టిఎంసిల ఆవిరి నష్టం

2.30 టిఎంసి + చిన్న సాగునీటి ప్రాజక్టులకు 29.87 టిఎంసిటి,

మొత్తం 38.07 టిఎంసిలను కేటాయించింది.

ఆంధ్రప్రదేశ్‌లోని...

భైరవానితిప్ప రిజర్వాయర్‌కు 4.10టిఎంసి

+ ఆవిరినష్టం 0.80టిఎంసి

+ చిన్న తరహా నీటి పారుదలకు 7.57 టిఎంసిలు

మొత్తం సగటున సంవత్సరానికి 12.47 టిఎంసిల కేటాయింపు జరిగింది.

మొత్తం పంపిణి - 38.07+12.47= 50.54 టిఎంసిలు

అయితే తర్వాతి కాలంలో కేంద్ర జల కమీషన్, 43 ఏళ్ళ (1965-66 నుండి 2007-08 వరకు) గణాంకాలను పరిశీలించి, 65% ఆధారితంగా 74 టిఎంసీలు లభిస్తాయని నిర్ణయించింది.

సగటున ఏడాదికి 40.66 టిఎంసిల చొప్పున వేదవతి నది జలాలను కర్నాటక రాష్ట్రం వాడుకుందని సెంట్రల్ వాటర్ కమీషన్ బ్రిజేష్‌కుమార్ కమిటీకి నివేదిక సమర్పించింది. అంటే ఆ రాష్ట్రం ఏడాదికి సగటున ( 40.66 టిఎంసీ - 38.07 టిఎంసిలు) 2.59 టిఎంసిలు అధికంగా వాడుకుందన్న మాట. ఇక మన రాష్ట్రం అదే కాలంలో సగటున సంవత్సరానికి 6.77 టిఎంసిలు వాడుకుందని తేల్చింది. అంటే మనకు కేటాయిం చింది 12.47 టిఎంసిలు కాగా, వాడుకున్నది కేవలం 6.77 టిఎం సిలు మాత్రమే. అంటే మనం వినియోగించని మన హక్కైన నీరు 12.47 టిఎంసిలు- 6.77 టిఎంసి = 5.70టిఎంసిలు. దాదాపు 6 టిఎంసిలుగా చెప్పవచ్చు.

అంతే గాక 43 సంవత్సరాలలో కర్నాటక 31 ఏళ్ళు తనకు కేటాయించిన నీటికన్న అధికంగా వాడుకోగా, మన రాష్ట్రం మనకు కేటాయించిన నీటికన్న అధికంగా కేవలం 3 ఏళ్ళు మాత్రమేనని కేంద్ర జల కమీషన్ సమర్పించిన జలనివేదిక స్పష్టం చేసింది. అంటే మన ప్రభుత్వాల నిర్లక్ష్యంవల్ల కేటాయించిన నీటిని వినియోగించుకోక పోవడంతో నష్టపోయింది, పోతున్నది, కరువుపీడిత రాయలసీమ ప్రాంతమే కావడం యాదృచ్ఛికం కాదని చెప్పవచ్చు. అలా మనం వినియోగించుకోని నీరంతా తుంగభద్ర ద్వారా కృష్ణలో చేరి సాగర్, కృష్ణ-డెల్టాలను సంపన్నం చేసి ఆ ప్రాంతపు రొయ్యలు, చేపల చెరువులను నింపి ఆ తర్వాత సముద్రం పాలవుతున్నాయనేది చరిత్ర చెబుతున్న సత్యం.

అదలా వుంటే ఇప్పుడు వేదవతి నదీజలాల గురించి తెలుసు కుందాం... వేదవతి, కృష్ణా నదిలాగే పశ్చిమ కనుమ అధిక వర్షపాతంపై ఆధారపడుతుంది. వేదవతి నది పొడవు కర్నాటకలో 182 మైళ్ళు కాగా, యిక దానికి నీరు అందించే పరీవాహక ప్రాంతం కర్ణాటకలో 7034 చదరపు మైళ్ళు.

వేదవతి నది పొడవు ఆంధ్రప్రదేశ్‌లో 45 మైళ్ళు. దానికి నీరు అందించే పరీవాహక ప్రాంతం ఆంధ్రప్రదేశ్‌లో 2074 చదరపు మైళ్ళు. వేదవతి నది పొడవు, పరీవాహక ప్రాంతం కర్నాటకలో ఎక్కువగా వుండటంతో, ఆ నదీ జలాలను కర్నాటక వాసులే ఎక్కువగా వినియోగించుకొనే అవకాశం కల్గింది. అందువల్లనే వేదవతి కర్నాటక సరిహద్దు దాటి భైరవానితిప్ప చేరుకొనేసరికి నదిలో నీరు వుండటం లేదు. మన రాష్ట్రంలో వేదవతి జలాలను నిల్వ వుంచుకోనేందుకు వున్నా ఏకైక జలాశయం

భైరవానితిప్ప. అందులో దశాబ్దాలుగా కనీసం 1 టిఎంసి నీరు కూడా చేరడం లేదు.

పోతే ఆంధ్రప్రదేశ్‌లో వేదవతి పరీవాహక ప్రాంతం 2074 చదరపు మైళ్ళు ఉన్నా, మనం వేదవతి జలాలను వినియోగించుకోలేక పోతున్నాం. అంతేగాక అనంతపురం జిల్లాలోని వేదవతి పరీవాహక ప్రాంతంలో పడే కొద్దిపాటినీటిని కూడా మనం అనంతపురం జిల్లాలో వినియోగించుకునే వీలులేదని బచావత్ కమీషన్ ఆంక్షలు విధించింది. కాని భైరవానితిప్ప క్రింది భాగాన కర్నూల్ జిల్లాలో లభించే వేదవతి జలాలను కర్నూలు జిల్లాలో వాడుకునేందుకు ఎలాంటి అభ్యంతరాలులేవు. వాటిని వినియోగించు కునేందుకు ఇక్కడ ఎలాంటి పథకాలులేక ఆ నీరంతా తుంగభద్ర ద్వారా క్రిష్ణార్పణ మవుతోంది.

అందువల్ల వేదవతిలో లభ్యమయ్యే జలాలను కరువుపీడిత పశ్చిమ మండలాలకు లబ్ధిచేకూరేలా తుంగభద్ర దిగువకాలువ ఆయకట్టు స్థిరీకరణకై తగిన సాగునీటి పథకాలు అత్యవసరం వాటిని చేపట్టాల్సిన బాధ్యత ఈప్రభుత్వానికుందని వేరేగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పుడు ఆ పథకమేమో వివరంగా చూద్దాం

కర్నూల్ జిల్లాలో ఎల్.ఎల్.సి., దాని ప్రవాహ నిడివిలో 131కి.మీ. వద్ద ప్రవేశించి, ఆతర్వాత మరల కొంతదూరం కర్ణాటకలో ప్రవహించి తిరిగి 156 కి.మీ.ల వద్ద మనరాష్ట్రంలో ప్రవేశిస్తుంది. 156కి.మీ.ల వద్ద తుంగభద్ర దిగువకాలువ కట్ట ఉపరితలఎత్తు సుమారు 405మీ.

గూళ్యంవద్ద వేదవతినది అడుగుభాగపు స్థాయి 385మీ.

ఎత్తులో తేడా 20 మీ.

వేదవతి(గూళ్యం) నుండి దిగువకాలువ దూరం.4.కి.మీ.

అందువల్ల గూళ్యంవద్ద వేదవతినదిపై 20 మీ.ఎత్తుకు ఒక ఎత్తిపోతల పథకం ఏర్పాటుచేసి 4.కి.మీ.ల పైపులైను ద్వారా వేదవతి జలాలను దిగువ కాలువకు తరలించవచ్చు.

కర్నూల్ జిల్లాలో దిగువకాలువ నీటివిడుదల సామర్థ్యం 725 క్యూసెక్కులు. కనుక 350 క్యూసెక్కుల సామర్థ్యంగల రెండు లిఫ్టలను ఏర్పాటు చేయవలసి వుంటుంది. ముందస్తు జాగ్రత్తకై 350 క్యూసెక్కుల సామర్థ్యంగల మరో పంపును ఏర్పాటు చేయాలి.

ఆ విధంగా రోజుకు 0.060 టిఎంసిలను దిగువ కాలువకు తోడి పోయగలం. వేదవతిలో జూన్ నుండి నవంబర్ వరకు నీరు లభ్యమవుతుంది కాబట్టి 100 రోజులలో 6 టిఎంసిల నీటిని దిగువ కాలువకు వాడుకోవచ్చని పరిశీలనలో తేలింది. ఈ పథకంవల్ల కర్నాటక ప్రాంత రైతులకూ మేలు జరుగుతుంది. కాబట్టి ఆరాష్ట్రం నుండి ఎలాంటి అభ్యంతరం ఉండదు. బచావత్ కమీషన్ అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 811 టిఎంసిల నీటిని, విభజనానంతరం, కృష్ణా నదీ నిర్వహణ బోర్డు ఆంధ్రప్రదేశ్‌కు 512 టిఎంసిలు, తెలంగాణాకు 299 టిఎంసిలుగా పంచింది. అంతేగాక, ఇరు రాష్ట్రాలు తమకు కేటాయించిన నీటిని తమకు తోచిన రీతిలో వినియోగించుకోవచ్చని తెలియజేసింది. అందువల్ల మనకు కేటాయించబడీ, మనము వినియోగించుకోలేని 6 టిఎంసిల నీటిని అదే కె-9 బేసిన్‌లో వినియోగించు కునేందుకు ఎలాంటి అభ్యంతరాలుండవు. అంతేగాక, ఆ 6 టిఎంసిల నీరు మనకు కేటాయించిన 512 టిఎంసిలలో భాగం కాబట్టీ క్రిష్ణాబోర్డ్, కర్నాటక ప్రభుత్వ అను మతులు కోరనవసరంలేదు. కాని, 0 కి.మీ నుండి 250 కి.మీ వరకు దిగువ కాలువ తుంగభద్రా బోర్డు పరిధిలో వుండటంవల్ల ఈ విషయాన్ని ఆబోర్డుకు తెల్పితేచాలు.

సాధారణంగా తుంగభద్ర డ్యాం నుండి దిగువకాలువకు నీటి విడుదల ఏటా జూలై/ఆగస్ట్ నెలలలో వుంటుంది. యిక వేదవతి నదిలో నీటి ప్రవాహం జూన్ నెల మొదటి పక్షంలోనే ప్రారంభమవుతుంది. అందువల్ల కృష్ణా-డెల్టాకు నాట్లు వేయడానికి పట్టిసీమ ద్వారా జూన్‌లోనే నీటిని ఎలా సరఫరా చేస్తున్నారో, అదేవిధంగా వేదవతి జలాలను జూన్ ప్రారంభంలోనే తుంగభద్ర దిగువ కాలువ ఆయకట్టుకు అందించవచ్చు. ఆపైన దిగువకాలువ ఆయకట్టుకు కేటాయించిన నీటిని అవసరం మేరకు ఇండెంట్ పెట్టి వాడుకోవచ్చు. సరైన పర్యవేక్షణలో దిగువకాలువ ఆయకట్టుకు వేదవతి, తుంగభద్ర నదుల నుంచి జలాలను అవసరమైన సమయంలో అవసరమైన మేరకు అందించవచ్చు. ఆవిధంగా దిగువకాలువ ఆయకట్టుదారుల ప్రయోజనాలను కాపాడగలం. ఈ నీటి పథకానికి ఖర్చు సుమారు

| | |
|---|---|
| 1) 3 ఎత్తిపోతల పంపులు, | |
| 1కి రూ.35 కోట్లు చొప్పున | = రూ.105 కోట్లు |
| 2) భూసేఖరణ, పైప్‌లైన్లు, ఇతరములు | రూ.20 కోట్లు |

మొత్తం = రూ. 125 కోట్లు

దీనివల్ల ప్రజలకు, ప్రభుత్వానికి జరిగే లబ్ది చాలా ఎక్కువ. ఒక అంచనా ప్రకారం 1 టిఎంసి నీటి సరఫరా వల్ల చేకూరే లాభం సంవత్సరానికి రూ. 35 కోట్లు అంటే 6 టిఎంసిల నీటి సరఫరాతో రూ. 210 కోట్ల మేర ప్రతి సంవత్సరం ఆదాయం వస్తుంది

జలశాస్త్ర నివేదిక (Hydrological Report) ప్రకారం కె-9 బేసిన్‌లో వేదవతిలో నీటి లభ్యత 74.05టిఎంసిలు. కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌లకు బచావత్ కేటాయింపులు -50.54 టిఎంసిలు. (38.07+12.47=50.54 టిఎంసీ) ఈ కేటాయింపులు పోను వేదవతిలో లభ్యమయ్యే అదనపు నికర జలాలు - 74.05 టిఎంసీలు; 50.54 టిఎంసి= 23.51 టిఎంసిలు

అంతేగాక బచావత్ మరియు బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ వేదవతిలో సమృద్ధిగా నీరుందని స్పష్టం చేశాయి కూడా. అందువల్ల పైన చూపిన కేటాయించబడని 23.51 టిఎంసిలను ఆంధ్రప్రదేశ్ వినియోగించుకునే అవకాశం నూటికి నూరు పాళ్ళు వుందని చెప్పవచ్చు. అయితే ఈ పథకాల విషయంలో మనం రెండు విషయాలను అర్థం చేసుకోవాలి.

1) గూళ్యం దగ్గర 20 మీ.ఎత్తిపోతల పథకం ద్వారా దిగువ కాలువ ఆయకట్టు స్థిరీకరణకు వినియోగించే 6 టిఎంసిల జలాలు ఇప్పటికే మన రాష్ట్రానికి కేటాయించ బడి, వినియోగించుకోని జలాలు. వాటికి కొత్తగా కేటాయింపులు అవసరం లేదు.

2) డిసెంబర్ 2011లో వేదవతి నదీ జలాల వినియోగంకై మరో ఎత్తిపోతల పథకాన్ని ప్రతిపాదించారు. అది 3,500 క్యూసెక్కులను రెండు ప్రదేశాలలో 40 మీటర్ల ఎత్తిపోతల పథకం. ఈ పథకానికి పైన చెప్పబడ్డ 23.50 టిఎంసిల నీటిని వినియోగించాలి. దీనివల్ల దిగువ కాలువ పైబాగాన యింతవరకు నీరందని దాదాపు ఒక లక్ష ఎకరాలకు సాగునీరు అందించవచ్చు. ఆయితే ఈ జలాలకై కేటాయిం పులు అవసరం. పైరెండు పథకాలకు ఒకదానితో మరోకటికి సంబందం లేదని అర్థం చేసుకోవాలి.

**ఈ రెండో పథకం గురించి మరిన్ని వివరాలు తెలుసుకోవాలి:-**

బచావత్ కమిటీ తన నివేదికలో, రాష్ట్రాలు కొత్త పథకాలను చేపట్టే ముందు.

నీటి లభ్యత గురించి పూర్తిగా పరిశోధన చేయాలని ఆ ప్రాజెక్టు వివరమైన నివేదిక తయారు చేయాలని, దాన్నిపూర్తిగా పరిశీలించిన తర్వాతనే కొత్త నిర్మాణాలను చేపట్టాలని నిర్దేశించింది. (పేజీ42 బచావత్ కమిటీ నివేదిక)

అయితే బ్రిజేష్ కుమార్ తన నివేదిక పేజీ 185లో కరువు పీడిత ప్రాంతాలకు జలాలను అందించడానికి నీటి లభ్యతను బట్టి గతంలో అవకాశంలేని కొత్త ప్రాజెక్టుల అవసరం కలుగవచ్చని తెల్పింది. అంతేగాక తన నివేదిక (పేజీ 596)లో ఆంక్షలు, సడలింపు లపై తన నిర్ణయాలను తెల్పుతూ "వాస్తవంలో మరిన్ని జలాలు అందుబాటులో వుంటే (కొత్త ప్రాజెక్టుల) ఆంక్షల సడలించవచ్చు. ఆంక్షల పరిమితులను మార్చవచ్చు. ఆంక్షలు అవసరం లేకపోతే పూర్తిగా తొలగించవచ్చు. గతంలో చెప్పినట్టు అవన్నీ నిర్దిష్టమైన వాస్తవాలపై, పరిమితులపై ఆధార పడివుంటాయి." అని అన్నారు.

పై వాఖ్యానాల ఆధారంగా 15 ఏప్రిల్ 2013న కర్నూల్ జిల్లా చీఫ్ ఇంజనీర్ గారు మన ప్రభుత్వానికి ఒక వివరమైన ప్రతిపాదనను సమర్పించారు. ప్రాజెక్టు వివరమైన నివేదిక (డిపిఆర్) కోసం రూ. 4.10 కోట్లు మంజూరు చేయమని కోరారు. కాని 4ఏళ్ళు గడిచినా ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందనలేదు. ఇది రాయలసీమ ప్రజల అవసరాల పట్ల ప్రభుత్వానికున్న చిన్నచూపును తెలియజేస్తూంది.

ఈ ప్రాజెక్టు వల్ల భైరవాని తిప్పకు నీటి సరఫరా అయ్యే ఖర్చును తగ్గించవచ్చు. భైరవానితిప్పకు కృష్ణా జలాలను హంద్రీ-నీవా ద్వారా 254 మీటర్ల ఎత్తునుండి భైరవానితిప్పకు ఎత్తిపోయాలని ప్రభుత్వ ప్రతిపాదనలు వున్నాయి. కానీ, వేదవతి జలాలను భైరవానితిప్పకు 385 మీటర్ల నుండి ఎత్తిపోయవచ్చు. అంటే వేదవతి నుండి ఎత్తి పోయడం ద్వారా 131 మీటర్ల (385-254 మీటర్లు) తక్కువ ఎత్తు నుండే భైరవానితిప్పకు నీటి సరఫరా చేయవచ్చు. ఆ విధంగా ఎత్తిపోతల కయ్యే విద్యుత్ ఖర్చును తగ్గించవచ్చు.

అంతేగాకా హంద్రీ-నీవా కాలువను వెడల్పు చేయడంద్వారా దానికి కేటాయించిన 40 టిఎంసిల నీటిని పూర్తిగా వినియోగించు కోవచ్చని, కాలువ వెడల్పు కార్యక్రమాన్ని ప్రభుత్వం వందల కోట్ల రూపాయలతో చేపడుతూ వున్నది. ఆ కాలువకు కేటాయించిన 40 టిఎంసిలలో తాగునీటికి 05 టిఎంసిలు కేటాయించ బడ్డాయి. పోతే కాలువలో నీరు 600 కి.మీ.ల దూరం ప్రవహించవలసివుంది. కాలువలో

లైనింగ్ లేకపోవడంతో ప్రవాహ నష్టాలు 20% ఉండవచ్చని అంచనా. అంతేగాక అత్యధిక ఉష్ణోగ్రత వుండే ప్రాంతాలలో హంద్రీ-నీవా ప్రవహిస్తుంది కాబట్టి ఆవిరి నష్టం కనీసం 10 టిఎంసిలు ఉంటుందని అంచనా. అంటే- హంద్రీ-నీవాలో సాగునీటికి మిగిలేది 40-05-10=25 టిఎంసిలు మాత్రమే. ఈ 25 టిఎంసిలతో సీమ నాలుగు జిల్లాలలో 6.025 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం అసాధ్యం. అంతేగాక కృష్ణా వరదజలాల నుండి హంద్రీ-నీవాకు 40 టిఎంసిలు ప్రతి ఏటా అందుతాయని చెప్పలేం కూడా.

హంద్రీ-నీవా జలాలు నీరందించే ప్రాంతాలు అత్యంత కరువు పీడిత ప్రాంతాలనే విషయం గమనంలోకి తీసుకుంటే, ఆ ప్రాంత రైతాంగానికి 40 టిఎంసిల నీటికన్నా ఎక్కువనీరు అవసరం అనేది వేరే చెప్పాల్సిన విషయంకాదు. పైన తెల్పినట్టుగా కేవలం 25 టిఎంసిలతో సీమ నాలుగుజిల్లాలలో 6.025 లక్షల ఎకరాలకు నీరందిస్తామనడం సీమవాసులను మభ్యపెట్టడమే. ఎండమావులలో దప్పిక తీర్చుకోమని చెప్పడమే అవుతుంది. ఆ 25 టిఎంసిల నీరు కేవలం కర్నూల్, అనంతపూర్ జిల్లాల అవసరాలకే సరిపోయే పరిస్థితి. అలాంటప్పుడు కడప, చిత్తూర్ జిల్లాల మాటేమిటి? ఇది సీమ జిల్లాల మధ్య వైషమ్యాలు పెంచేందుకు దోహదపడుతుందని చెప్పక తప్పదు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు, దిగువకాలువ ఆయకట్టు స్థిరీకరణకు తోడ్పడే ఏకైక జలవనరు వేదవతి ఎత్తిపోతల పథకం.

**ఈ పథకం గురించి మరిన్ని వివరాలకెళదాం.**

బచావత్ కమిటీ ముందు వేదవతీ జలాల వినియోగం విషయంలో కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఈ కింది షరతులకు అంగీకరించాయి.

1) కర్నాటకలోని వాణివిలాస్ సాగర్ నుండి అనంతపురం జిల్లాలోని భైరవానితిప్ప జలాశయం వరకు దాదాపు 40 మైళ్ళ ప్రాంతంలో కర్నాటక ఎలాంటి సాగునీటి పథకాలు చేపట్టరాదు.

2) వేదవతీకి నీరందించే ప్రధాన ఉపనది చిన్న హగరి. ఆ చిన్నహగరిపై కర్నాటక-ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల పై భాగాన 16 మైళ్ళ వరకు కర్నాటక ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదు. ఈ నిభందనల వల్ల ఆంధ్రప్రదేశ్‌కు లబ్ది చేకూరుతుంది.

మరోవైపు

3) మన రాష్ట్ర (ఆంధ్రప్రదేశ్) – కర్నాటక సరిహద్దులో అనగా అనంతపురం జిల్లాలో వేదవతిపై ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదు.

4) చిన్నహగరిపై ఆంధ్రప్రదేశ్ ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదు.

మొదట చెప్పినట్టుగా వేదవతి, అనంతపురం–బళ్లారి సరిహద్దు తర్వాత, బళ్ళారి జిల్లాలో ప్రవేశించి, కొంత దూరం తర్వాత కర్నూల్ జిల్లా–బళ్లారి జిల్లాల సరిహద్దుగా ప్రవహిస్తూంది. ఈ సరిహద్దు ప్రాంతంలో వేదవతిపై సాగునీటి పథకాల నిర్మాణాలపై ఎలాంటి అభ్యంతరాలను బచావత్ కమీషన్ పెట్టలేదు. ఈ ప్రాంతలోనే రెండు ఎత్తిపోతల పథకాలు (40+40 మీటర్లు) మరియు 20 మీటర్ల ఎత్తిపోతల పథకాలను ప్రతిపాదించడం జరిగింది. ఇన్ని అవకాశాలున్నా కూడా మన ప్రభుత్వాలు సీమప్రాంత నీటి అవసరాలను తీర్చేందుకు ఏమాత్రం కృషి చేయకపోవడం విచారకరం. ఈ విషయాన్ని బ్రిజేష్‌కుమార్ నివేదిక స్పష్టంచేసింది కూడా. “ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏ ప్రాజెక్టుకు ఎలాంటి నూతన ప్రతిపాదనలు చేయలేదు.” (పే 540)

పోగా పోలవరం నిర్మాణంవల్ల రాయలసీమ సస్యశ్యామలమైతుం దని అన్ని పార్టీలు ఊదరగొడ్తున్నాయి. కాని వాస్తవాలు అందుకు పూర్తిగా విరుద్ధంగా వున్నాయి. 80 టిఎంసిల గోదావరి జలాలను పోలవరం పథకం ద్వారా కృష్ణాకు తరలించడంవల్ల మన రాష్ట్ర వాట 22.5 టిఎంసిలు (80–మహారాష్ట్ర 14– కర్నాటక 21–తెలంగాణా 22.5) మాత్రమే. పోగా పైరాష్ట్రాలు దాదాపు 57.50టిఎంసిల కృష్ణా జలాలను వినియోగించుకుంటాయి. దీనివల్ల శ్రీశైలం జలాశయంకు చేరే నీరు ఆ మేరకు 57.50 టిఎంసిల తగ్గుతాయి. దాంతో, కృష్ణా వరద జలాలపై ఆధారపడే సీమ ప్రాజెక్టులు హంద్రీ–నీవా, గాలేరు–నగరి, తెలుగుగంగ పథకాలకు నీరందడం కష్టసాధ్యం అవుతుంది. రాయలసీమ ప్రజలకు మబ్బుల్లో(పోలవరం) నీళ్ళను చూపించి ముంత లోని(వేదవతి) నీళ్ళను పారవేసేలా ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపట్ల సీమప్రజలు అప్రమత్తంగా వుండాలి. వేదవతిలో నికరంగా లభ్యమవు తున్న 23.50 టిఎంసిల నీటిని వినియోగించుకోవడంద్వారా ఇటు తుంగభద్ర దిగువకాలువ ఆయకట్టు స్థిరీకరణ,అటు హంద్రీ–నీవా ఆయకట్టుకు చాలా మేరకు స్థిరీకరణ చేయవచ్చు.

ఇక్కడే మరోవిషయం, కర్నాటక తమ అవసరాల నిమిత్తం 3 టిఎంసిల

వేదవతీ జలాలను తమకు కేటాయించాలని బచావత్ మరియు బ్రిజేష్ కుమార్ కమిటీలను కోరగా, ఆ అభ్యర్థనను రెండు కమిటీలు తిరస్కరించాయి. యిప్పుడు మనం వేదవతీ నుండి కర్నాటకకు ఆ 3 టిఎంసిల నీరునిస్తామంటే ఈ ప్రాజెక్టు నిర్మాణానికి కర్నాటక అభ్యంతరం చెప్పే అవకాశమే ఉండదు.

పైన ప్రతిపాదించిన రెండు సాగునీటి పథకాల వల్ల వేదవతీ జలాల వినియోగంతో

1) కర్నూల్ జిల్లాలోని కరువు పీడిత పశ్చిమ మండలాలను కోన సీమగా మార్చవచ్చు.

2) హంద్రీ–నీవాకు వేదవతీ జలాల తరలించడం ద్వారా సీమ నాలుగుజిల్లాలు లబ్ధి పొందుతాయి.

3) భైరవాని తిప్పకు వేదవతీ జలాల తరలించడం ద్వారా విద్యుత్ ఖర్చు తగ్గించవచ్చు.

4) గూళ్యం దగ్గర వేదవతిపై రిజర్వాయర్ లేదా బ్రిడ్జి నిర్మాణం ద్వారా ఆదోని–బళ్ళారిల మధ్య దూరం 30–35కి.మీ. తగ్గుతుంది. అందువల్ల సీమ ప్రజలు తమప్రాంత ప్రజా ప్రతినిధులపై ఒత్తిడి తెచ్చి వేదవతి ఎత్తిపోత పతకాలను సాధించుకోవాల్సిన అవసరంవుంది.

**( విశ్రాంత ఇంజనీర్ శ్రీ.ఎం.సుబ్బారాయుడుగారు**

**ప్రభుత్వానికి సమర్పించిన ప్రతిపాదనకు వ్యాస రూపం అరుణ్.)**

# సిద్ధేశ్వరం అలుగు / బ్రిడ్జ్

**- ఎం.సుబ్బరాయుడు, డిఇ.**

**అటు** తెలంగాణ, ఇటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రజలకు శ్రీశైలం రిజర్వాయర్ వర ప్రదాయినిగా చెప్పవచ్చు. నేడు అందులో పూడిక చేరడంవల్ల క్రమంగా దాని నిల్వ సామర్థ్యం తగ్గుతూ వస్తూంది. శ్రీశైలం రిజర్వాయర్ నిర్మాణమప్పుడు దాని నీటి నిల్వసామర్థ్యం 308.082 టిఎంసీలు కాగా 2011లో దాని నిల్వసామర్థ్యం 215.817 కు పడిపోయిందని నిపుణల అధ్యయనాలు తేల్చాయి.

అంటే ప్రతిఏటా అందులో చేరుతున్న పూడిక (308.082-215.817 = 92.65 టిఎంసీ/27) 3.40 టిఎంసీలు. ఈ విధంగా పూడిక చేరుకుంటూ పోతే అనతికాలంలోనే శ్రీశైలం రిజర్వాయర్ కేవలం పెద్ద తటాకంగా మారే పరిస్థితి వుంది. ఈ నష్టాన్ని పూడ్చుకోవటానికి రెండే, రెండు మార్గాలు కన్పించినా అవి అమలులో సాధ్యమయ్యే పరిస్థితి తక్కువ. మొదటిగా చేరిన పూడికను తీసివేయాలంటే శ్రీశైలం రిజర్వాయర్ రెండు కొండల మధ్య వున్నదాయే. మరోవిధంగా dredging ద్వారా పూడికను బయటికి పంపుతే, అది క్రిందిభాగాన వున్న నాగార్జున సాగర్‌లో చేరుతుంది.

ఇక, పైనష్టాన్ని పూడ్చుకోవడానికి పైభాగాన ఒక రిజర్వాయర్ కట్టు కోవాలంటే ఖర్చు తడిసి మోపెడవుతుంది. ఒక టిఎంసీ నిల్వ సామర్థ్యంగల రిజర్వాయర్ నిర్మాణానికి సుమారు రూ.150 కోట్ల నుండి రూ. 200 కోట్ల వరకు ఖర్చువుతుందని అంచనా. ఇక ఒక టిఎంసీ పూడికను తొలగించాలంటే రూ.300 కోట్లు ఖర్చువుతుందని అంచనా. అందువల్ల శ్రీశైలం రిజర్వాయర్‌లో చేరే పూడికను తగ్గించాడానికే గాక, రాయలసీమ జిల్లాలకు కేటాయించిన నీటిని సకాలంలో రైతులకు అందజేయడానికి, శ్రీశైలం రిజర్వాయర్‌ను వరదల బారినుండి రక్షించేందుకు సిద్ధేశ్వరం అలుగు తప్ప, వేరే ప్రత్యామ్నాయాలేవీలేవని. నిపుణుల అధ్యయనాలు తెల్పుతున్నాయి. ఈ సందర్భంలో, శ్రీశైలం రిజర్వాయర్ కిందికి విడుదలచేసే సామర్థ్యం అత్యధికంగా 19.50 లక్షల క్యూసెక్కులు కాగా, 2009లో వచ్చిన వరదల ప్రవాహం దాదాపు 25.50 లక్షల క్యూసెక్కులు ఈ హెచ్చరికను మనం గుర్తుంచుకోవాలి.

మరో విషయం, పూడికను నివా రించడం ద్వారా శ్రీశైలం రిజర్వాయర్‌లో నీటి నిల్వ సామర్థ్యం తగ్గకుండా వుంటుంది కాబట్టి, గత ప్రభుత్వం చేసిన వాఖ్య, “ సిద్ధేశ్వరం అలుగు అధనంగా నీటిని నిల్వ చేయదు” (Siddesvaram weir will not impound additional water) అర్థరహితమవుతుంది. అధనంగా నీటిని నిల్వ చేయకున్నా పూడిక చేరడాన్ని నివారించి. నీటినిల్వ సామర్థ్యం తగ్గకుండా ఉపయోగ పడుతుంది. ఇక ఆ ప్రభుత్వపు రెండో అభిప్రాయం, సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం అనవసర ఖర్చు ( the construction of Siddesvaram weir is an unfruitful expendture ) అనేదాన్ని పరిశీలిద్దాం.

ప్రజల జీవితావసరాలను లాభ నష్టాలతో బేరీజువేయడం ప్రజాస్వామ్య ప్రభుత్వాల లక్షణంకాదు. అయినా, లాభ నష్టాల దృష్టి తోనూ పరిశీలిద్దాం. సిద్ధేశ్వరం అలుగు నిర్మాణంవల్ల నాగార్జునసాగర్‌లో కూడా పూడిక చేరడం తగ్గిపోతుంది.

2011లో హైడ్రోలాజికల్ సర్వే అంచనాలో తేలిందే మంటే– 820 అడుగుల వద్ద క్రిందిభాగాన చేరిన పూడిక 39.653 టిఎంసీలు. ఒక టిఎంసీ సామర్థ్యంతో ఒక రిజర్వాయర్ నిర్మించాలంటే అయ్యే ఖర్చు రూ.300 కోట్లు.

39.653 టిఎంసీల సామర్థ్యంతో  రిజర్వాయర్ నిర్మాణానికయ్యే ఖర్చు రూ.300 కోట్లు × 39.653= రూ.11,895.90 కోట్లు.

ఒక టిఎంసీ నీటితో వచ్చే ఆదాయం  రూ.35 కోట్లు. 39.653 టిఎంసీల నీటితో వచ్చే ఆదాయం  రూ. 39.653 × రూ.35 కోట్లు = రూ.1387.855 కోట్లు

అంటే, కొత్తగా 39.653 టిఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణాని కయ్యే ఖర్చు రూ.300కోట్లు × 39.653= రూ.11895.90 కోట్లు పెట్టడం కన్నా, కేవలం రూ.600.కోట్లు. ఖర్చయ్యే సిద్ధేశ్వర అలుగునిర్మాణం అన్నివిధాల లాభదాయకంగా వుంటుంది. ఓ బంగారు నాణెం కాపాడు కోవడానికి ఓ వెండి నాణెం వెచ్చించడం విజ్ఞతకాదా! ప్రభుత్వం ఈ విషయం గుర్తించకుంటే ఎలా.

మనకు తెలిసినంత మేరకు ముగ్గురు ఇంజినీర్స్ ఇన్ చీఫ్స్ (engineers-in-chiefs) ప్రతిపాదించిన ఏ ప్రాజెక్ట్‌ను రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించలేదు. సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం విషయం లోనే ఈ  తిరస్క రించడం  కనపడుతుంది. బహుశా ఈ అలుగు / బ్రిడ్జ్  రాయలసీమకు లబ్ది చేకూర్చే ప్రాజెక్ట్ కావడం వల్లనేమో.

కర్నూల్ జిల్లా చీఫ్ ఇంజనీర్ కూడా పట్టిసీమ ఎత్తిపోతల వల్ల కృష్ణా జలాలను రాయలసీమకు మళ్ళించే అవకాశం వుందని, ఈ అలుగు ద్వారా సీమ జిల్లాలకు ఆ నీటిని సకాలంలో తరలించే అవకాశం ఉందన్నారు. సాంకేతికంగా ఈ అలుగు నిర్మాణం సాధ్యమేనని, అయితే రాయలసీమకు కేటాయించిన నీటికన్న అదనంగా, శ్రీశైలం రిజర్వాయర్ నీటిమట్టం 854 అడుగుల కింద నీటిని నిల్వచేసుకొనే అవకాశం లేదని ఆయన అభిప్రాయపడ్డాడు.

కర్నూల్ జిల్లా చీఫ్ ఇంజనీర్ గారు లేవనెత్తిన అభిప్రాయాలను పరిశీలిస్తే...

**1) సాంకేతికంగా అలుగు నిర్మాణం సాధ్యమేనని చెప్పారు.**

**2) అదనపు నీటిని నిల్వచేయలేము,అన్న దానిపై యిదివరకే. విశదపరచాము.**

**3) శ్రీశైలం రిజర్వాయర్ నీటిమట్టం 854 అడుగుల కిందకు వున్నా, రాయలసీమకు కేటాయించిన నీటిని నిలువచేసుకునేందుకే ఈ అలుగు / బ్రిడ్జ్ అవసరం.**

కొన్ని దశాబ్దాలుగా రాయలసీమ ప్రజల ఆకాంక్షలు పై మూడవ అంశంతోనే ముడిపడివున్నాయి. ఆ ఆకాంక్షలు నెరవేరాలంటే కృష్ణా నదిపై సిద్ధేశ్వరం వద్ద అలుగు/ బ్రిడ్జ్ నిర్మాణం జరగాల్సిందే.

2017లో జనవరి మొదటివారం నుండి, సెప్టెంబర్ రెండవ వారం వరకు కృష్ణా నదీ (సీమలో రిజర్వాయర్ వున్నా) జలాలు రాయలసీమ ప్రజలకు ఒక చుక్క కూడా అందలేదు. కానీ, కనీస నీటిమట్టం 834 అడుగులు వుండాలని నిర్దేశిస్తున్నా, ప్రభుత్వమే తన ఉత్తర్వుల తానే ఉల్లంఘిస్తూ రిజర్వాయర్లో నీటిమట్టం +790 అడుగులు చేరే దాక అటు తెలంగాణా, ఇటు కోస్తాకు నీటిని వదిలారు. అప్పటికీ రిజర్వాయర్‌లో 25 టిఎంసీల నీరు వుంది. కానీ, రాయలసీమకు కేటాయించిన నీరూ అందే పరిస్థితిలేదు. ఇంత అన్యాయం జరుగుతున్నా, సీమప్రాంత నాయ కులు కేవలం ప్రేక్షకులుగా మిగిలారు. వారి గొంతు మూగపోయింది. అంత క్రింది లెవల్‌లో ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం కూడా నిరుపయోగమయ్యింది.

అత్యున్నత స్థానంలో వున్నముగ్గురు ఇంజినీర్స్ ఇన్ చీఫ్స్ (engineers-in-chiefs) 19/08/2011

సమావేశంలో ఈకింది విధంగా అభిప్రాయాలు వెలిబుచ్చారు. "తమ పంటకాలపు చివరివరకు అంటే 31/03/2010 వరకు శ్రీశైలం రిజర్వాయర్‌లో నీటి నిల్వను కనీస నీటిమట్టాన్ని +854 అడుగుల స్థాయికి తగ్గకుండా ఉంచాలని రాయలసీమ ప్రజలు, ఆయకట్టుదారుల నుండి బలమైన ఒత్తిడి వస్తున్నది. కాని విద్యుత్ ఉత్పత్తి మరియు కిందిభాగాన వున్న నాగార్జునసాగర్ మరియు కృష్ణా డెల్టా ఆయకట్టుదార్ల అవసరాలకై గత పదేళ్లకు పైగా ఆ స్థాయిలో నీటిమట్టాన్ని వుంచడం సాధ్యపడలేదు. రాయల సీమలో క్రిష్ణా జలాలను నిల్వచేయడానికి గోరుకల్లు మరియు వెలుగోడు రిజర్వాయర్లు తప్ప వేరే రిజర్వాయర్లు లేవు. అందువల్ల రాయలసీమ ప్రాంత త్రాగు మరియు సాగునీటి అవసరాలను తీర్చడానికి తగిన వసతులు కల్పించాల్సివుంది. దానికి సిద్ధేశ్వరం అలుగు నిర్మాణమే ఏకైక మార్గం."

పై నిర్మాణంవల్ల శ్రీశైలం రిజర్వాయర్ క్రింది ప్రాంత మరియు పై ప్రాంతాలకు రక్షణ కలుగుతుంది.

శ్రీశైలం రిజర్వాయర్ నుండి, రాయలసీమకు కేటాయించబడి పోతిరెడ్డిపాడు ద్వారా విడుదల చేయాల్సిన నీరు.

| | |
|---|---|
| శ్రీశైలం కుడికాలువ | 19 టిఎంసీలు |
| మద్రాసు తాగునీటికై | 15 టిఎంసీలు |
| పట్టిసీమ/పోలవరం ద్వారా అదాఅయిననీరు | 22.50 టిఎంసీలు |
| (కర్నూల్ చీఫ్ ఇంజనీర్ అభిప్రాయంలో) | |
| బ్రిజేష్ కుమార్ తెలుగుగంగకు కేటాయించినది. | 25 టిఎంసీలు |
| పులిచింతలవల్ల ఆదాఅయిన కృష్ణాజలాలు | 27 టిఎంసీలు |
| మొత్తం | 108.50 టిఎంసీలు |

## క్రిష్ణ-డెల్టాకు అందుబాటులో వున్న నీరు

పట్టిసీమ/పోలవరంద్వారా మరలించే గోదావరిజలాలు 80/100 టిఎంసీలు.

పులిచింతల నుండి ప్రకాశం బ్యారేజ్ మధ్య ప్రాంతంలో అందుబాటులోకి వచ్చేనీరు 70 టిఎంసీలు. మొత్తం 150/170 టిఎంసీలు

## క్రిష్ణా- డెల్టా అవసరాలు...

బచావత్ కమిటీ కేటాయించినది. 181.20 టిఎంసీలు. అందులో ఆధునుకీకరణ మరియు పొదుపువల్ల ఆదా అయిన 29 టిఎంసీలు తీసివేయగా మిగిలిన కృష్ణా డెల్టా కేటాయింపులు.

**181.20 టిఎంసీలు-29 టిఎంసీలు = 152.20 టిఎంసీలు**

పై వివరాల ప్రకారం రాయలసీమ ప్రజలకు 108.50 టిఎంసీల నీటిని నిల్వచేసుకున్నా కృష్ణా డెల్టా ప్రయోజనాలు ఏమాత్రం దెబ్బతినవని స్పష్టమవుతుంది. ఈ విషయాలను దృష్టిలో వుంచుకోనేనేమో మన ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీలో మరియు బయట సీమకోసం శ్రీశైలం రిజర్వార్‌లో 100 టిఎంసీల నీటిని నిల్వ ఉంచుతామని పదేపదే ప్రకటనలు చేశారు.

2011లో APERL సంస్థ జరిపిన అధ్యయనం ప్రకారం శ్రీశైలం రిజర్వార్‌లో ఏ ఎత్తున ఎంత నీరువుంటుందో తెలిసింది. (పట్టికను పరిశీలించండి)

జీ ఓ.69 ప్రకారం శ్రీశైలం రిజర్వార్‌లో నీరు 854’ పైన ఉంటేనే పోతిరెడ్డిపాడు ద్వారా రాయలసీమకు నీరు విడుదలచేయాలి.

- 790 (24.391 టిఎంసీల నీటి నిలువ )అడుగుల నుండి 854 (89.290 టిఎంసీల నీటి నిల్వ) అడుగుల మధ్యలో నీరు ఉంచాలంటే కావసిన నీరు 89.290-24.391= 64.899 లేక 65 టిఎంసీలు.

- శ్రీశైలంరిజర్వార్‌లో 790 నుండి 854 అడుగుల వరకు నీరు చేరేసరికి నాట్లు వేసే సమయం ఎప్పుడో దాటి పోయుంటుంది. ఆ తర్వాత నీళ్ళిచ్చినా పెద్దగా వుపయోగముండదు.

- శ్రీశైలం రిజర్వార్‌లో కనీస నీటిమట్టం 834 (53.851 టిఎంసీల నీటి నిల్వ )నుండి 854 నీరు చేరాలంటే కావాల్సిన నీరు 89.290- 53.851=35.439 టిఎంసీలు.

- శ్రీశైలం రిజర్వార్‌లో నీటి మట్టం 834 నుండి 841 అడుగులకు నీరు చేరాలంటే కావాల్సిన నీరు 63.321-53.851=9.470 టిఎంసీలు.

- శ్రీశైలం రిజర్వార్‌లో నీటి మట్టం 841 నుండి 854 అడుదులకు నీరు

**2011లో APERL సంస్థ జరిపిన అధ్యయనం ప్రకారం శ్రీశైలం రిజర్వార్‌లో ఏ ఎత్తున ఎంత నీరువుంటుందో తెలిపే పట్టిక**

| వ. నం | సిల్ లెవెల్ ఎత్తు అడుగుల్లో | నీటి నిల్వ (టిఎంసీ) | వాఖ్యానం |
|---|---|---|---|
| 1. | 885 | 215.807 | శ్రీశైలంరిజర్వార్ లో పూర్తి స్థాయి |
| 2. | 860 | 105.900 | ప్రతిపాదిత సిద్ధేశ్వరం అలుగు సిల్ ఎత్తు |
| 3. | 854 | 89.290 | శ్రీశైలంరిజర్వార్ తొలుత నీటి మట్టం |
| 4. | 841 | 63.321 | పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సిల్ స్థాయి. |
| 5 | 834 | 53.851 | జీ ఓ.69 ప్రకారం కనీస నీటి మట్టం. |
| 6 | 820 | 40.817 | ప్రతిపాదిత సిద్ధేశ్వరం అలుగు సగటు అడుగు భాగం స్థాయి |
| 7. | 800 | 28.979 | తాగునీటికి మరియు జీ.వో 196 ముచ్చుమర్రి ద్వారా నీటిని వాడుకోవచ్చు |
| 8. | 790 | 24.391 | 2010 ఈ స్థాయివరకు నీటిని తోడారు. |
| 9 | 760 | 13.742 | గతంలో ఈ లెవల్ వరకు నీటిని తోడారు. |

చేరాలంటే కావాల్సిన నీరు 89.290-63.321= 25.969 టిఎంసీలు.

- శ్రీశైలంరిజర్వార్‌లో నీటి మట్టం 854 నుండి 860 అడుగులకు నీరు చేరాలంటే కావాల్సిన నీరు 105.900-89.290=16.610 టిఎంసీలు.

ఇప్పటి ప్రభుత్వ విధానాల ప్రకారం శ్రీశైలంరిజర్వార్‌లో నీరు చేరగానే, నీటిమట్టంతో అవసరం లేకుండా, విద్యుత్ ఉత్పత్తి పేరుతోనో, కింది ప్రాంతపు తాగునీటి అవసరమంటూనో, యుద్ధప్రాతిపదికన కిందికి నాగార్జున సాగర్‌కు నీళ్ళు వదలుతారు. నీటి మట్టం +854 అడుగులకు చేరేంతవరకు ప్రభుత్వం ఏమాత్రం వేచి చూడదు. మరోమాటలో చెప్పాలంటే ప్రభుత్వానికి రాయలసీమ అవసరాల గురించి

పట్టించుకోలేదు. రాయలసీమకు నీరు పోతిరెడ్డిపాడు ద్వారా మాత్రమే నీరు అందుతుందనీ, అలా అందచేయాలంటే, శ్రీశైలం రిజర్వార్‌లో నీటిమట్టం +854 అడుగులు ఉండాలనే విచక్షణ ప్రభుత్వాలకు లేకపోవడం సీమకు శాపంగా మారింది.

2017లో శ్రీశైలం రిజర్వార్‌లో నీటిమట్టం 790 అడుగుల చేరేదాక 12/01/2017 వరకు నీటిని విడుదల చేస్తూవచ్చారు. 12/09/2017 నుండి కృష్ణా వరద జలాలు శ్రీశైలంరిజర్వార్‌లోకి రావడం మొదలెట్టాయి. ఆ తర్వాతనే 23/09/2017 నుండి పోతిరెడ్డిపాడు ద్వారా సీమకు నీటి విడుదల ప్రారంభమయింది. అంటే, అప్పటికే సగం పంటకాలం, సగం వర్షకాలం పూర్తయ్యిం దన్నమాట. క్రింది ప్రాంతాలు, క్రిష్ణా డెల్టా, నాగార్జునసాగర్ ఆయ కట్టులకు సకాలంలో నీరందుతుంది కాని, సీమ ప్రాంతానికి సకాలంలో నీరందడం లేదు. ఇది వివక్షత కాదా?

శ్రీశైలం రిజర్వాయర్ నిర్మాణ సమయంలో కనీస నీటిమట్టం 854 అడుగులుగా నిర్ణయించబడింది. కానీ, జీవో. 69 తేది. 15/06/1996 ద్వారా తెలుగు దేశం ప్రభుత్వం కనీస నీటి మాట్టాన్ని +854 అడుగుల నుండి +834 అడుగులకు కుదించడంతో, సీమప్రజల గుండెల్లో గునపం దించినట్టయ్యింది. అంతేగాక, నీటి విడుదల ప్రాథన్యాలలో శ్రీశైలం కుడి బ్రాంచ్ కాలువకు నీటిని శ్రీశైలం రిజర్వార్‌లో నీరు +854 అడుగులకు పైన ఉన్నపుడే విడుదల చేయాలని వుంది. రాయలసీమ వాసులెవ్వరూ కృష్ణా డెల్టా ఆయకట్టు దారుల ప్రయోజనాలకు అడ్డుపడేవారు కాదు. అందరూ రైతులే. అందరికీ జీవనాధారం నీరే. ఉన్న నీటిని అందరం ఎలా పంచుకోవాలా? ప్రతి ఎకరాకు కనీసం ఒక పంటకైనా నీరందించాలా అనేదే మా ఆలోచన.

**ఇప్పుడు కృష్ణా – డెల్టా ఆయకట్టుదారుల ప్రయోజనాలను చూద్దాం.**

కృష్ణా డెల్టాకు పెద్ద మొత్తంలో 181.2 టిఎంసీల నీటిని కేటాయించారు. ఈ ప్రాంతంలో సాధారణంగా అక్టోబర్‌లో తుపాన్ సంభవించే అవకాశాలు ఎక్కువ. అందువల్ల అక్కడ వరినాట్లు జూన్/జూలై నెలలలో వేయకపోతే వారికి పంటలందడం కష్టమే. అందువల్ల వారి పంటలు తుపాన్ వల్ల దెబ్బతినకుండా, ప్రథమ ప్రాధాన్యంగా వారికి నీటిని, రుతుపవనాల ప్రారంభంలోనే నీరందాలి.

అయితే నేడు పట్టిసీమ / పోలవరం, పులిచింతల ప్రాజెక్టుల వల్ల వారికి అవసరమైన నీరు సకాలంలో అందజేయవచ్చు. అందువల్ల వారి కోసం పోతిరెడ్డిపాడు నుండి నీటి విడుదలపై పరిమితి (restrictions) విధించాల్సిన అవసరంలేదు. కనుక, రాయలసీమ ప్రజల సాగునీటి, త్రాగునీటి ప్రయోజనాలకు ఉరితాడైన, సీమ అభివృద్ధికి అడ్డుగోడగా నిలిచిన జీవో. 69 తేది. 15/06/1996 వెంటనే రద్దు చేయాలి.

మేము, సిద్ధేశ్వరం అలుగు ప్రతిపాదనను 2003లోనే నాటి ప్రభుత్వం ముందుంచాము. కాని, ప్రభుత్వాలు 16 ఏళ్ళు గడిచినా పట్టించుకోలేదు.

సిద్ధేశ్వరం అలుగు యొక్క నీటినిలవ సామర్థ్యం అత్యధి కంగా 43.389 టిఎంసీలు. కానీ, రాయలసీమ ప్రజలకు దాదాపు 108.591/109 టిఎంసీల నీటిని నిలుపుకొనే హక్కు వుంది. బ్రిజేష్ కుమార్ కమిటీ శ్రీశైలం రిజర్వాయర్‌లో 60 టిఎంసీల క్యారీ ఓవర్ జలాలను నిల్వ ఉంచాలని సలహానిచ్చింది కూడా. ఈ కోణంలో చూసినా సిద్ధేశ్వరం అలుగు / బ్రిడ్జ్ నిర్మాణం తప్పనిసరి అవుతుంది.

రాయలసీమ ప్రజలకు దాదాపు 108.591/109 టిఎంసీల నీటిని నిలుపుకొనే హక్కు వున్నా, ఆ మొత్తం నీటిని నిలుపుకునేందుకు, అలుగు సిల్ లెవెల్‌ను చాలా పెంచవలసి వుంటుంది. అది ఆచరణ సాధ్యంకాదు. అందువల్ల సిల్ లెవెల్‌ను +860 అడుగులకు కుదించి అలుగును నిర్మాణం చేయడమేగాక రాయలసీమ ప్రజలకు దాదాపు 108.591/109 టిఎంసీల నీటిని శ్రీశైలం రిజర్వాయర్ నుండి వాడుకొనే హక్కుకు హామీ ఇవ్వాలి.

అలుగు / బ్రిడ్జ్ నిర్మాణానికి ఈ కింది వాటికై అనుమతి పొందాల్సిన అవసరం లేదు.

1) భూసేకరణ (Land acquisition)

2) అటవీశాఖ అనుమతి (Forest Clearance),

3) పర్యావరణశాఖ (Environmental) అనుమతి,

4) విద్యుత్ వినియోగం (Power consumption),

5) జీవావరణశాఖ (Ecological Clearance) అనుమతి

6) జల సంబంధశాఖ (Hydrological) అనుమతి. వాటికి శ్రీశైలం

రిజర్వాయర్ నిర్మాణం సమయంలోనే అనుమతి లభించింది. ఆ విధంగా ఎక్కువ ఖర్చు లేకుండా నిర్మాణం చేయగల ఈ అలుగు / బ్రిడ్జ్ వల్ల రాయలసీమ రైతులకు సకాలంలో నీరందించడం, శ్రీశైలం డ్యాంను వరదల నుండి కాపాడడం, ప్రకాశం జిల్లా – హైదరాబాద్‌ల మధ్య దూరాన్ని 50 కి.మీ.లకు తగ్గించడ మేగాక విద్యుత్ ఉత్పత్తి కూడా సాధ్యపడుతుంది.

అదేగాక, మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపురం పట్టణానికి మరియు కర్నూల్ జిల్లాకు మధ్య తక్కువ దూరం రోడ్డు మార్గానికై సిద్ధేశ్వరం వద్ద క్రిష్ణా నదిపై బ్రిడ్జ్ నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో.ఆర్.టి.నెం.410 తేది.06/05/2011న ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణా ప్రజలు కూడా తమకు ఆ బ్రిడ్జ్ నిర్మాణం అవసరమని పత్రికా ప్రకటనలు చేసారు. ప్రభుత్వానికి విన్నవించారు కూడా. అందువల్ల సిద్ధేశ్వరం అలుగు/ బ్రిడ్జి నిర్మాణంపై ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా వుంటుంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిద్ధేశ్వరం అలుగు/ బ్రిడ్జి నిర్మాణానికి తగిన ఉత్తర్వులి వ్వడం ద్వారా రాయలసీమ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని గాఢంగా అభిలషిస్తున్నారు.. ఇప్పటికైనా సీమ ప్రజలు 2016 సీమ ప్రజలు సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపనకై ఉవ్వెత్తున ఉద్యమించిన సందర్భాన్ని, మూడేళ్ళుగా వివిధ శాంతియుత రూపాల్లో సాగుతున్న నీటి చట్టబద్ధ హక్కుల ఉద్యమాలను ప్రభుత్వం గుర్తెరుగుతుందని, తిరిగి అలాంటి ఉద్యమాలకు తావివ్వకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని ఆశిద్దాం.

ప్రశ్నలు – సమాధానాలు

# నీళ్లలో న్యాయమైన వాటా చాలు సీమ సస్యశ్యామలం!

" రాయలసీమవాసులు నిరంతరం శ్రమజీవులు. అయినా ఎప్పుడూ వారికి కష్టాలు, కన్నీళ్లే తోడు. దీనికి కారణం ప్రభుత్వం సాగునీటి వసతి సరైన రీతిగా కల్పించకపోవడమే. రాయలసీమపై ఎటువంటి దయచూపవలిసిన పనిలేదు. న్యాయంగా రావలిసిన నీటివాటా ఇచ్చి రిజర్వాయర్లు నిర్మిస్తే రాయలసీమ సస్య శ్యామలం అవుతుంది. రాయలసీమ నీటి కష్టాలు తీరకపోవడానికి ప్రధాన కారణం ఇక్కడి ప్రజల్లో, ముఖ్యంగా రాజకీయ నాయకుల్లో సరైన అవగాహన, చైతన్యం లేకపోవడమే. అదే సర్కారు, తెలంగాణ ప్రాంతాల్లో అయితే ఒక ప్రాంతీయ సమస్య ముందుకు వచ్చినప్పుడు ప్రజలతో పాటు రాజకీయ పార్టీలు కూడా తమ పార్టీ పాలసీలను, పాత గొడవలను వదిలేసి ఏకతాటిపైకి వస్తారు. ఆ పద్ధతి ఇక్కడ లేదు. అదే మన దుస్థితికి కారణం" **–ఎం.సుబ్బారాయుడు, రిటైర్డ్ ఇంజనీర్**

నీళ్లు, నీళ్లు అంటూ అనుక్షణం రాయలసీమ నీటి కష్టాలు గురించి ఆలోచిస్తూ, ఎప్పుడూ ఏదోఒక కొత్త ప్రాజెక్టును తయారుచేస్తూ గడిపే మనిషి ఎం.సుబ్బారాయుడు. నీటి లెక్కలతోనే ఆయన జీవితమంతా. రాయలసీమను సస్యశ్యామలం చేసే మహత్తర పథకానికై అనుక్షణం అన్వేషణ. ఎస్సార్బీసీ, తెలుగుగంగ, హంద్రీనీవా వంటి పథకాల్లో జూనియర్ ఇంజనీర్‌గా ఉద్యోగం మొదలెట్టి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా రిటైర్ అయ్యి 13 సంవత్సరాలయినా తాను అందరిలా విశ్రాంతి తీసుకోకుండా ఇప్పటికీ రాయలసీమకు నీళ్ల గిరించి ఆలోచించే వ్యక్తి. నిరాడంబరత్వం ఆయన నైజం. రాజకీయ నాయకుల నుండి సాధారణ ప్రజలు, విద్యార్థులు ఎవరొచ్చినా ఎంతో ఆప్యాయంగా రాయల సీమ నీటి పథకాల గురించి, వాటికి నీటి కేటాయింపుల గురించి ఎంతో ఓర్పుతో వివరించే వ్యక్తి ఆయన. ఆరోగ్యం సహకరించక, నడవలేని స్థితిలో వున్నా ఆయన ఆలోచనలు మాత్రం రాయలసీమ ప్రాజెక్టుల చుట్టూ తిరుగుతుంటాయి. ఆయన ఆవేదన తన గురించి కాదు, తన కుటుంబం గురించి కాదు. రాయలసీమ ప్రజల గురించి. అటువంటి వ్యక్తి శ్రీ ఎం. సుబ్బారాయుడు గారితో రస్తా కోసం చేసిన ఇంటర్వ్యూ .

**ప్ర : రాయలసీమకు నీటిలో సమాన వాటా ఇవ్వడం అనేది ఎప్పటినుంచో లేదు కదా? మరి ఇన్నాళ్లూ ప్రజలు ఎందుకు మౌనంగా ఉన్నారంటారు?**

**జ :** ప్రజలు మౌనంగా ఉండడానికి ప్రధాన కారణం ఒక్కటే. కోస్తా వాళ్లకు నీటి విలువ బాగా తెలుసు. రాయలసీమ కంటే సర్కారు ప్రాంతంలో వ్యవసాయ రంగం అభివృద్ధి చెందింది. అక్కడి ప్రజలకు నీటి పథకాల విలువ, కొత్త ప్రాజెక్టుల ఆవశ్యకత వంటి వాటి గురించి అవగాహన వుంది. స్వాతంత్రం తొలినాళ్లలో మన రాష్ట్రంలోని పెద్దపెద్ద ఇంజనీర్లు ఎక్కువ మంది కోస్తా నుండి వచ్చినోళ్లే. ఆ ఇంజినీర్లకు తెలుసు, నీటి పంపకాలు ఎట్లా జరిగితే తమ ప్రాంతానికి సమృద్ధిగా నీళ్లు అందుతాయి అని. కృష్ణా నది మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గుండా ప్రవహిస్తోంది. యీ నాలుగు రాష్ట్రాల నీటి అవసరాలు మొత్తం 4200 టీఎంసీలు. కానీ కృష్ణా నదిలో మొత్తం నీటిలభ్యత 2130 టీఎంసీలు మాత్రమే. అంటే అవసరాలలో లభ్యత సగం మాత్రమే అన్నమాట. అందుకే బచావత్ కమిషన్ సెప్టెంబర్ 1960లోపు పూర్తయిన, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు మాత్రమే నికర జలాలు కేటాయించింది. శ్రీశైలం ప్రాజెక్టు రాయలసీమలో వున్నా కూడా శ్రీశైలం నుండి రాయలసీమకు ఒక్క టీఎంసీ కూడా కేటాయించలేదు. కోస్తావారు ముందు చూపుతో 1951 లోనే అనుమతులు లభించిన కృష్ణా-పెన్నార్ ప్రాజెక్టును పక్కనబెట్టి నాగార్జునసాగర్‌కు నీటి కేటాయింపులు చేయించుకోగలిగారు. ఇక మన వాళ్ళైతే 'మన కర్మ ఇంతే' అనే వేదాంత ధోరణిలోనో, లేకపోతే మనకు కృష్ణా నీళ్ళల్లో హక్కులు ఎక్కడున్నాయి అనే నిరాశ, నిస్పృహలతోనో బతుకుతుండేవారు. ఇప్పుడిప్పుడే రాయల సీమ నీటిహక్కుల గురించి తెలుసుకుని ఉద్యమించడానికి ఉరక లేస్తున్నారు.

**ప్ర : రాయలసీమ నీటి కష్టాలను తీర్చడానికి ఎప్పుడూ ఏదో ఒక పథకం గురించి ఆలోచిస్తూ వుంటారు మీరు. మీకు అసలీ ఆలోచన ఎలా వచ్చింది?**

**జ :** చాలా సంవత్సరాల కిందట నేను గుత్తిలో జూనియర్ ఇంజనీర్‌గా పనిచేసేటపుడు నాకో అవసరం వచ్చి పడింది. అదేమంటే 'ఎంపిక చేయబడ్డ ఒక స్థలంలో యాభై వేల నీలగిరి వృక్షాలు నాటించడం'. ఆ పని పూర్తి చేయడానికి నేను రెండు మూడ్రోజులు అక్కడే ఉండాల్సి వచ్చింది. వర్షం పడితే ఆ మొక్కలను నాటాల్సి ఉంది. ఎంత ఎదురు చూసినా వాన జాడే లేదు. అప్పుడు నాకనిపించింది వర్షంతో

నాకేం పని లేకపోయినా, చెట్లు నాటించిన ఖర్చుతో గానీ, దాని లాభంతో కానీ నాకు సంబంధం లేకపోయినా నేనింత ఆతృతగా ఎదురుచూస్తున్నాను కదా మరి వర్షంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రాయలసీమ రైతుల పరిస్థితి ఏమిటని ఆలోచనలో. పడ్డాను. నేను పుట్టి పెరిగిన రాయలసీమ ప్రాంత కరువు సమస్య పరిష్కారానికి మార్గాలు వెదకడం మొదలెట్టాను.

**ప్ర : రాయలసీమకు న్యాయమైన నీటి వాటా దక్కితే సీమ మొత్తం సస్యశ్యామలం అవుతుందా?**

**జ:** న్యాయపరమైన నీళ్లు అందితే నూటికి నూరు శాతం సస్యశ్యామలం అవుతుంది. అంతేకాదు వ్యవసాయంలో కోస్తా డెల్టాతో పోటీ పడగలదు. ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి వల్ల కేటాయించిన నికర జలాలను కూడా వాడుకోలేకపోతున్నాం.

**ప్ర : రాయలసీమ ప్రజాప్రతినిధులకు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు చలనం రాకపోవడానికి కారణాలు ఏమైవుంటాయి?**

**జ :** అస్సలు చలనమే లేదు అనను కానీ నాయకులంతా కోస్తా ఇంజనీర్ల మాటకే సై అనేవారు. ఉదాహరణకు శ్రీశైలం ప్రాజెక్టును తీసుకుంటే అంత పెద్ద ప్రాజెక్టును కడుతున్నారు కదా మరి దాంట్లో కరువు రాయలసీమకు నీటి కేటాయింపులు చేయనేలేదు. మన నాయకులు కోస్తా వారిలా ముందుచూపు ఆలోచనలు చేయలేక పోయారు. ఎటువంటి రాజకీయ ఒత్తిడులకు తలొగ్గకుండా సీమ అభివృద్ధి కోసం నూరు శాతం పనిచేసుంటే సీమకు ఇప్పుడు యీ దుస్థితి ఉండేదికాదు. సాక్షాత్తు బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ స్వయంగా 'ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాయలసీమ కోసం ఎటువంటి కొత్త ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు అడగలేదు' అని వ్యాఖ్యానించింది. దాన్నిబట్టి రాయలసీమ నాయకులకు కోస్తా వారంత ముందుచూపు లేదనే చెప్పాలి. మన నాయకులకు నీటి లెక్కల గురించి చెబితే మనకెక్కడ నీళ్లున్నాయి అంటూ మాట్లాడేవారు. మొత్తం దోపిడీ అంతా వివరిస్తే అలాగా అంటూ ఆశ్చర్యపోయేవారు. పూర్తి అవగాహన లేకపోవడమే దీనికి కారణం.

**ప్ర: రాయలసీమ నీటి హక్కుల్లో ఇక్కడి వారు అడిగే వాటా పైన తెలంగాణకు ఏమైనా అపోహలు, అభ్యంతరాలు వుంటాయా?**

**జ:** ఉన్నాయి కానీ మనపై లేవు. కోస్తా వారి డామినేషన్ పైన తెలంగాణకు అపోహలు వుండొచ్చు. ఎందుకంటే కృష్ణా పరివాహక ప్రాంతం తెలంగాణలో ఎక్కువగా ఉంది. తర్వాత రాయలసీమలో ఆపై కోస్తాలో తక్కువగా ఉంది. కానీ బచావత్ ట్రిబ్యునల్ నీళ్లు పంచేటప్పుడు పరివాహక ప్రాంతాన్ని పరిగణనలోకి తీసుకోకుండా సెప్టెంబర్ 1960 నాటికి పూర్తయిన ప్రాజెక్టులకు మాత్రమే నీటి కేటాయింపులు చేసింది. అక్కడే జరిగింది సీమకు పెద్ద ద్రోహం. కోస్తా వాళ్ళ సంగతి తెలిసే మన వాళ్ళు శ్రీబాగ్ ఒడంబడిక రాసుకున్నారు కానీ దాన్ని అమలు చేయించుకోలేకపోయారు.

**ప్ర : ఎందుకు రాయలసీమ ప్రజలకు నీళ్లపై అంత నిరాశ?**

**జ :** సీమ ప్రజలకు మొదటి నుంచి చెరువులపై ఆసక్తి ఉంది కానీ పెద్ద ప్రాజెక్టులపై లేదు. చెరువులు నిండాలంటే వర్షం కావాలి, వర్షాలు పడవు. రెండు మూడేళ్ళకోసారి వర్షాలు పడే పరిస్థితి. ఇవన్నీ రాయలసీమ రైతులను ఇంకా ఇంకా పేదరికంలో కూరుకుపోయేలా చేశాయి. చాలాకాలం నుంచే వ్యవసాయరంగం బాగా అభివృద్ధి చెందిన ప్రాంతం కాబట్టి కోస్తా జనాలకు, నాయకులకు నీటి విలువ తెలిసి ఎప్పుడూ అంట కాచుకుండేవారు. వారితో పోటీ పడలేక రాయలసీమ వాళ్ళు నిరాశకు లోనయ్యారు, కానీ ఇప్పుడు నీటి కోసం ఏమైనా చేయాలి అనే నిశ్చయంతో వున్నారు.

**ప్ర : ప్రభుత్వాలు మొదటి నుంచి నీటి పంపకాలలో సవతి తల్లి ప్రేమ చూపాయా?**

**జ :** కనీసం బచావత్ ట్రిబ్యునల్ సూచనలు పాటించి వుంటే సీమకు చాలా వరకు న్యాయం జరిగుండేది. ట్రిబ్యునల్ సూచనలు పాటించడంలో ప్రభుత్వాలు సవతి తల్లి ప్రేమ చూపుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తనకున్న అధికారాలను ఉపయోగించి రాయలసీమకు తగిన నీరు ఇవ్వొచ్చు .

**ప్ర : మీరు దాదాపు 20 సంవత్సరాల నుంచి ఎప్పుడూ ఏదో ఒక చిన్న, పెద్ద పథకాలు తయారు చేసి రిపోర్టులు ఇస్తూనే వున్నారు, ప్రభుత్వాలు వాటిని పట్టించుకున్నాయా?**

**జ :** తగిన విధంగా పట్టించుకోవడం లేదు. వైఎస్ లాంటి వాళ్ళు సిద్ధేశ్వరం ప్రాజెక్టు గురించి ఓపికగా విని సదభిప్రాయం వెలి బుచ్చారు. కిరణ్ కుమార్‌రెడ్డిగారు కూడా గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టులపై సానుకూలంగా స్పందించారు, తర్వాత పరిస్థితులు తారుమారయ్యాయి. సిద్ధేశ్వరం అలుగు, వేదవతి, గుండ్రేవుల వంటి పెద్ద ప్రాజెక్టులే కాకుండా అనంతపురం సమాంతర కాల్వ, ఇంకా ఇతర చిన్న వాటికి రిపోర్టులు ఇచ్చినా ఇంతవరకు ఒక్కటీ కార్యరూపం దాల్చలేదు. గుండ్రేవుల, వేదవతికి ప్రభుత్వం యీమధ్యే సానుకూలంగా స్పందించింది . అవి కూడా ఎప్పటికో , కనీసం ఒక్కటైనా చూస్తానా బ్రతికుండగా అని నిరాశ కలుగుతోంది. నా మిత్రులు, కుటుంబం వల్ల మళ్ళీ ఉత్సాహం వస్తోంది. ఆ భగవంతుడు ఆరోగ్యం ఇచ్చినంత వరకు నా పని కొనసాగిస్తా.

**ప్ర : బచావత్ , బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునళ్ళు కృష్ణా జలాల్లో సీమకు న్యాయమైన వాటా ఇచ్చాయా?**

**జ :** వాటా పంపిణీ లో ఎప్పుడో అన్యాయం జరిగింది. అసలు ట్రిబ్యునల్ అవార్డులే న్యాయమైన ప్రాతిపదికన లేవు . కానీ బచావత్ స్వయంగా చేసిన సూచనలే పాటించడంలేదు. ప్రతి సంవత్సరం 300 టీఎంసీల కృష్ణానీరు సముద్రంలో కలుస్తు న్నాయి అని బ్రిజేష్ కుమార్ కమిషన్ స్వయంగా ప్రకటించింది. ప్రభుత్వాలు అవార్డును, వాటిలోని సూచనలను అస్సలు పాటించట్లేదు. అవార్డు ఏంచెబుతోంది అంటే క్యారీ ఓవర్ నీటి కోసం వీలైనన్ని ఎక్కువ ప్రాజెక్టులు కట్టుకోండి అంటుంది. ఇండియన్ ఇరిగేషన్ కమిషన్ కూడా కరువు ప్రాంతాల్లో ప్రాజెక్టులు 1:1 కాస్ట్ బెనిఫిట్ రేషియో ఐనా సరే నిర్మించాల్సిందే అంటుంది. కానీ ముక్కారు పంటలు పండే కోస్తాలో కడుతున్న ప్రాజెక్టుల వేగం సీమలో ఎక్కడుంది.

**ప్రశ్న : రాయలసీమ నీటి గురించి చర్చ జరిగినప్పుడల్లా సర్కారు వారు సీమ వాసులకు హక్కులేం లేవన్నట్లు మాట్లాడుతుంటారు కదా దానిలో నిజమెంత?**

**జవాబు :** రాయలసీమకు కృష్ణా నీటిలో అనగా శ్రీశైలం నుండి లేవు కానీ తుంగభద్ర నీటిపై హక్కులున్నాయి. అవే కేసీ కెనాల్, హెచ్చెల్సీ , ఎల్లెల్సీ కాల్వలు.

రాయలసీమకు దయాదాక్షిణ్యంతో ఎటు వంటి నీరు ఇవ్వొద్దు కానీ న్యాయపరమైన వాటాలో దోపిడీ చేయకుంటేచాలు. రాయలసీమను వ్యవసాయ రంగంలో డెల్టా ప్రాంతానికి సమానంగా అభివృద్ధి చేయొచ్చు. వారి నీటిచౌర్యం ఎలా ఉందంటే కృష్ణా నదికి ఉపనది ఐన తుంగభద్ర నుంచి ఏటా 170 టీఎంసీల నీరు కృష్ణాలో కలుస్తుంది రాయలసీమలో. అసలు నిజం ఏంటంటే తుంగభద్ర నీరు కృష్ణాలో పారించవలిసింది రూలు ప్రకారం 31.45 టీఎంసీలు మాత్రమే. యీ విషయం రాయలసీమలో కొంతమంది ప్రజాప్రతినిధులకే తెలియదు. తుంగభద్ర నుంచి మీకివ్వ వలసిన నీరు మీకిచ్చి మిగిలిన నీటిపై మేము ప్రాజెక్టులు కట్టుకుంటాం అంటే, అలా కాదు మీరు మీ భాగం తీస్కుని మిగిలినదంతా మాకే వదిలెయ్యమంటున్నారు. ఇదేం పంపకం. ఎగువ నది పరివాహక రైతులకు సమృద్ధిగా నీరు లేకున్నా, కరువులతో ఇబ్బందులు పడుతున్నా క్రిందివారికి కావాల్సినన్ని నీళ్ళు ఉండాలి అనుకుంటే ఎలా. రాయలసీమలో కేసీ కెనాల్ కు కేటాయించిన నీటిని నిల్వ చేసుకోవడానికి రిజర్వాయర్లు కట్టమూ అంటే ఎలా .

**ప్ర: ప్రభుత్వాలు కూడా రాయలసీమను దశాబ్దాలుగా పట్టించుకోకుండా ఉండడానికి కారణం ఏమిటి?**

**జ :** కచ్చితంగా పూర్తి అవగాహన లేకపోవడమే, ఎవరూ ప్రచారం చేయకపోవడం, అంతో ఇంతో తెలిసిన రాజకీయ నాయకులు తమ స్వార్థం కోసం నీళ్ల సమస్యను మూసిపెట్టడం జరుగుతూవచ్చింది. ఇక్కడి ప్రజాప్రతినిధులకు తమ స్వార్ధ ప్రయోజనాలే తప్ప ప్రజల సమస్యలు పట్టవు. అలాఅని నూటికి నూరు శాతం మంది కాదు, కొంతమంది పట్టుదల గల నాయకులు వున్నారు కానీ, వాళ్లకు మాత్రమే తాపత్రయం వుంటే ఏమి లాభం . ఇది ఒకరిద్దరు పూనుకుంటే తీరే సమస్య కాదు కదా. నాలుగు జిల్లాల నుండి అందరూ ఏకమై సాదించుకోవాల్సినది.

**ప్ర : సీమ, సర్కారు ప్రాంతాలకు శాసనసభ సీట్లలో తేడా ఉండదం వల్ల, కోస్తాలో సీట్ల సంఖ్య ఎక్కువ కనుక ఇక్కడివారి డిమాండును ప్రభుత్వాలు పట్టించుకోవు అనే వాదన సరైనదేనా?**

**జ :** చాలా వరకు కరెక్టే. ఇక్కడి నాయకులకు తమ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించాలని ఉన్నా కూడా వారికి ఒక అపోహ, భయం ఉంటుంది . అదేమంటే 'తాము తమ ప్రాంత నీటి సమస్యపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రయత్నం చేస్తే పార్టీలో, ప్రభుత్వంలో తమ ప్రాధాన్యతను తగ్గిస్తారేమో' అని. అన్ని పార్టీల రాజకీయ నాయకులు ఆ అపోహలను, భయాలను వీడి అందరూ ఒక్కటై పోరాడ డానికి సంసిద్ధం కావాలి. అప్పుడే రాయలసీమకు సరైన న్యాయం జరుగుతుంది.

**ప్ర : రాయలసీమ నీటి వాటాలు మనం అడిగిన రీతిలో ఇవ్వడానికి తెలంగాణ ప్రభుత్వం నుంచి ఏమైనా అభ్యంతరాలు వుంటాయా?**

**జ :** అట్లా ఏమి వుండవు, ఆ ప్రాంత నాయకులకు అపోహలు ఏమైనా వున్నా అవి సరైన రీతిలో అవగాహన కల్పిస్తే తీరిపోయేవే. వాళ్ళు మనం ఇచ్చి పుచ్చుకునే రీతిలో ఐక్యమత్యంతో నడుచుకుంటే ఇరువురికి లాభం ఉంటుంది. అది అభిలషణీయం కూడా .

**ప్ర : ఇప్పుడు కడుతున్న పోలవరం వల్ల రాయలసీమకు మేలు జరుగుతుందా?**

**జ:** జరుగుతుంది దానికి సరైన నిర్మాణం వున్నప్పుడు. పోలవరం ద్వారా 80 టీఎంసీల గోదావరి నీళ్లు రాయలసీమకు మళ్లిస్తామని చెబుతున్నారు . కానీ ఆ 80 టీఎంసీలపై రాయలసీమకు మాత్రమే కాదు. ఎగువనున్న తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలకు కూడా హక్కులు ఉంటాయి. ఒక బేసిన్ నుంచి ఇంకో బేసిన్ కు నీళ్లు మళ్లించబడితే ఆ మళ్లించబడిన నీటిపై అన్ని రాష్ట్రాలు ఒక నిష్పత్తి ప్రకారం పంచుకోవాల్సిందే అని బచావత్ తీర్పు ఇచ్చాడు. దాంతో రాయలసీమకు దక్కేవి 22 టీఎంసీలే. మరి వీటితో పాటు తెలుగుగంగ, ఎస్సార్బీసీ వంటి వాటికి కేటాయించిన నీళ్లు నిలుపుకోవడానికే కదా మాకు సిద్దేశ్వరం అలుగు కావాలంటోంది. పైగా యీ మళ్లింపు నీళ్లలో భాగంగా కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణలు పైనే 57.5 టీఎంసీలు నిలుపుకుంటాయి. అప్పుడు శ్రీశైలానికి నీటి ప్రవాహం తగ్గదా. రాయలసీమకు ఒక ప్రత్యామ్నాయ నిర్మాణం; తన వాటా నీటిని నిలుపు కోవడానికి కట్టుకోనివ్వకుండా ఊరికే నీళ్లిస్తామంటే ఎట్లా వస్తాయి. శ్రీశైలం ప్రాజెక్టులో విద్యుత్తు ఉత్పత్తి పేరిట

790 అడుగుల వరకు కిందకు విడుదల చేస్తారు. బచావత్ ట్రిబ్యునల్ సూచనల ప్రకారం ప్రాధాన్యత త్రాగునీరు, ఇండస్ట్రియల్,వ్యవసాయం, విద్యుత్తు; అలా ఇవ్వవలసి ఉంది. కానీ రాయలసీమలో వ్యవసాయ రైతులు రోజు ఆత్మహత్యలు చేసుకుంటున్న పరిస్థితి నెలకొంది. అటువంటప్పుడు ప్రభుత్వాలు విద్యుత్తు ఉత్పత్తి కంటే సాగునీటికే అధిక ప్రాధాన్యత ఇచ్చి రైతులను ఆదుకోవాలి. సోలార్ ఎనర్జీ వంటి ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నాయి కదా.

**ప్ర : ప్రస్తుతం దేని గురించి రిపోర్టు తయారు చేస్తున్నారు?**

**జ :** శ్రీశైలం ప్రాజెక్టు ఇప్పటి కెపాసిటీ దాని డిజైన్ కెపాసిటీ కంటే నేడు దాదాపు 95 టీఎంసీలకు పైగా తగ్గిపోయింది. దానికి కారణం రిజర్వాయరులో సిల్ట్ చేరడమే. మాములు పద్ధతుల్లో యీ పూడు తొలగించే అవకాశంలేదు. అయితే సిల్టేషన్ ఇలాగే కొనసాగితే మరో అరవై డెబ్భై ఏళ్లకు రిజర్వాయర్ మొత్తం మట్టితో నిండడం ఖాయం. యీ సమస్యకు కూడా పరిష్కార మార్గం సిద్ధేశ్వరం అలుగే. శ్రీశైలం రిజర్వాయర్ జీవన కాలం పెంచేందుకు తీసుకోవలసిన చర్యలపై నా తదుపరి రిపోర్ట్ ఉంటుంది. శ్రీశైలం, నాగార్జున సాగర్ లాంటి పెద్ద ప్రాజెక్టులు భవిష్యత్తులో కట్టడానికి కృష్ణా నదిపై ఎక్కడా వీలులేదు కాబట్టి వాటినే కాపాడుకోవడం మన ధర్మం. అలా చేయకపోతే భవిష్యత్తు తరాలు మనల్ని క్షమించవు. పెరుగుతున్న అధిక జనాభా వల్ల నీటి అవసరాలు ఇంకా ఎక్కువైతాయి. కాబట్టి వాటిని కాపాడుకోవడం మన బాధ్యత.

**ప్ర : ఇన్నేళ్లలో ఎప్పుడైనా ఎందుకిదంతా అని అనిపించలేదా?**

**జ :** అప్పుడప్పుడు అనిపించి అన్నీ పక్కన పడేస్తుంటాను కానీ మళ్లీ ఎవరో ఒకరొచ్చి ఏంరాస్తున్నారు సార్ అనడం, మళ్ళీ వాటిలో మునిగిపోవడం అలవటాయి పోయింది. నా వరకు నేను కూడా నా ప్రాంతానికి నాకు తెలిసిన పద్ధతిలో చేతనైన సేవ చేస్తున్నందుకు సంతోషంగా ఉన్నాను.

“చివరిమాటగా, రాయలసీమ నీటి కష్టాలు తీరాలంటే యీ ప్రాంత రాజకీయ నాయకుల్లో రైతులను ఆదుకోవాలనే తపన పెరగాలి.”

## రాయలసీమ విద్యావంతుల వేదిక ప్రచురణలు

1. రాయలసీమ విద్యావంతుల వేదిక అవగాహన పత్రం.
2. సమైక్య ద్రోహం.
3. సీమ జల సంపద గురించి తెలుసుకుందాం!
4. చిత్తూరు జిల్లాలో కొరవడిన నీటి పారుదల సౌకర్యాలు.
5. కడప జిల్లా సాగు నీటి పథకాలు.
6. తుంగభద్ర ఎగువ సమాంత కాలువ.
7. ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం- ప్రజాస్వామిక దృక్పథం.
8. రాయలసీమ నీటి వాటాపై చట్టబద్ధ హక్కు కల్పించాలి.
9. తుంగభద్ర ఎగువ సమాంతర కాలువ.